సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

APTEL 14598/2015.

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి | ఆదివారం 3 ఏప్రిల్ 2016 సంపుటి : 1 సంచిక 27 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల : రూ. 5.00

## పచ్చనోట్లకోసం పచ్చదనం కోల్పోయిన పల్లెలు

- ఆహార భద్రతకు పెనుముప్పు
- కమ్ముకుంటున్న రోగాలు

2 లో





నిరుపయోగంగా ఉన్న నాగళ్లు



పొలం పనులు లేని రాయపూడి గ్రామస్తులు

అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రోజుల్లో ఆహారధాన్యాల కొరతకు గురవుతుందా ? అంటే అవుననే చెబుతున్నారు సామాజిక వేత్తలు ... సెజ్‌లు, విమానాశ్రయాలు, పోర్టులు, రాజధానులు, పరిశ్రమల పేరుతో పచ్చనిపొలాలను ప్రభుత్వం, వ్యాపారవేత్తలు, రియల్టర్లు ఎగరేసుకుపోతుంటే రైతు నిస్సహాయ స్థితిలో ఉన్నారు. రైతుల మనస్సు మార్చడానికి కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వాలు పనిగట్టుకొని... డబ్బు జబ్బును వ్యాప్తి చేశారు. అయితే ఎంత డబ్బు ఉన్నా..ఆస్తులు, అంతస్థులు ఉన్నా కడుపునింపేది కేవలం పిడికెడు మెతుకులే అని గుర్తించలేనంతగా ఈ జబ్బు విస్తరించేలా చేశారని సామాజిక తత్వవేత్తలు ఆరోపిస్తున్నారు. నిజానికి రైతంటే దేశానికి తండ్రిలాంటి వాడు, తన స్వేదంతో సేద్యంచేసి ప్రజల కడుపు నింపేవాడు ....

రాజధాని స్పెషల్ కరస్పాండెంట్

## శిలాశాసనాన్ని సందర్శించిన సీఎం

**మల్కాపురంలో 755 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న కాకతీయుల శిలాశాసనం**

**రాజధాని ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం సచివాలయ సందర్శన అనంతరం మల్కాపురంలోని కాకాతీయుల కాలంలో రుద్రమదేవి పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా ప్రతిష్టించిన శిలా శాసనాన్ని ఆయన సందర్శించారు. మార్చి 25 వ తేదీకి ఈ శిలా శాసనం 755 సం॥రాలు పూర్తి చేసుకుంటున్న సందర్భముగా మంత్రులు, దేవినేని ఉమామహే శ్వరరావు, రావెల, నారాయణ, తెనాలి, మంగళగిరి పురపాలక సంఘం చైర్మన్ గంజి చిరంజీవి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మన్నవ సుబ్బారావు, సిఆర్‌డిఎ కమిషనర్, శ్రీకాంత్, ఇంధన శాఖ కార్యదర్శి అజయ్‌జైన్, జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండె తదితరులు పాల్గొన్నారు.



## ఈవారం రాజధాని

- రాజధాని గ్రామాల్లో తాగునీటి కష్టాలు
- కన్నుల పండువగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం
- సి.ఆర్.డి.ఎ. సి.ఇ బాధ్యతల నుంచి కాశీ విశ్వేశ్వరరావు తొలగింపు
- 24 నుంచి అందుబాటులోకి ఇసుక : కలెక్టర్ కాంతిలాల్ దండె
- పుష్కర ఘాట్లను పరిశీలించిన గుంటూరు కలెక్టర్, తాహశీల్దార్.
- సీతానగరం పుష్కర ఘాట్ మరమ్మతులు ప్రారంభం
- రాజకీయంగా నన్ను సర్వనాశనం చేయాలనుకుంటున్నారు : రోజా
- ఎఐఎస్ఎఫ్ నేతలపై కేసులు
- విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన తుని రైతులు
- పెన్నా నదిలో ముగ్గురు గల్లంతు
- ముంబై, బెంగళూరు, హైదరాబాద్, కోల్‌కత్తా, చైన్నై, అహ్మదాబాద్ విమానాశ్రయాలలో భద్రత కట్టుదిట్టం.
- తాత్కాలిక సచివాలయాన్ని శుక్రవారం పరిశీలించిన ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు

పత్రికా రచనలో ఆసక్తిగలగలవారికి ఆహ్వానం

అతి త్వరలో ఆంధ్రప్రదేశ్ అంతటా విస్తరించనున్న 'రాజధాని వార్తలు' దినపత్రికకు

విలేకరులు కావలెను

మరిన్నివివరాల కోసం

సెల్ :9440662699

info@rajadhani-vartalu.com

## పంట మాటున పన్ను ఎగవేత..!

ఆరుగాలం శ్రమించినా వర్షాభావ పరిస్థితుల వల్ల పంట చేతికందక, చేసిన రుణాలు తీర్చలేక, బతుకు పోరులో ఓటమినంగీకరిస్తూ, రైతన్న ఉరికొయ్యకు వేలాడుతుంటే...కార్పొరేట్ బాబులు మాత్రం పన్ను పోటును తప్పించుకునేందుకు నల్లధనాన్ని తెల్లగా చేయడం కోసం కోట్లరూపాయలు ఆదాయం వచ్చినట్లు చూపుతున్న లెక్కలు ప్రభుత్వాన్ని దిమ్మెర పడేలా చేస్తున్నాయి.

వివరాలు 8లో

## పగలే వెన్నెల జగమే ఊయల..

ఎండలు మండిపోతున్నాయి... ఎంత అర్జంటు పనిఉన్నా బయటికి వేళ్లాలంటే వడదెబ్బకు భయపడి పనులు మానేసి మరీ ఇంట్లోనే ఉంటున్నారు. ఇలాంటి పరిస్థితులను ఆరోగ్యవంతంగా ఎదుర్కొంటానికి విజయవాడ ఏలూరు రోడ్డులోని అస్రానీ ఎలక్ట్రానిక్స్ యజమాని కునాల్ అస్రానీ ఒక గొడుగును తయారు చేశారు. తాను ఒకసారి ముంబై వెళ్లినప్పుడు అక్కడి కాలేజీ మహిళలు టూ వీలర్స్‌పై వెళుతూ ఇలాంటి గొడుగులను అమర్చుకున్నారని వాటిని వర్షానికి ఎండుకు వాడుతుండటం తాను గమనించానన్నారు. ఇలాంటిదే ఎండలు ఎక్కువగా ఉన్న విజయవాడలో ఉంటే బావుంటుందని ఆ గొడుగుకు మెరుగులు దిద్ది అర్థచంద్రాకారంగా మార్చి ప్రస్తుతం వినియోగదారులకు అందిస్తున్నానన్నారు. మోటార్‌బైక్‌పై ప్రయాణం చేసేట ప్పుడు గాలిని తట్టుకునే విధంగా రూపొందించామన్నారు. గొడుగును నిలపటం కోసం ప్రత్యేక గొట్టాన్ని అమర్చారు. 60-70 కిలోమీటర్ల వేగంలో కూడా గొడుగు నిటారుగానే ఉంటుందని, ప్రస్తుతం దీని ధర రూ. 1,600గా నిర్ణయించామన్నారు. ఒంటిపూట బడుల సమయంలో తల్లిదండ్రులు పిల్లలను తీసుకురావడానికి ఇది బాగా ఉపయోగపడుతుందన్నారు. వెనుక కూర్చున్న వారికి కూడా ఎండపడకుండా వెళ్లవచ్చునని అస్రానీ అన్నారు... పగలే వెన్నెల జగమే ఊయల అంటూ ఎండను బీట్ చేయవచ్చు ఈ గొడుగుతో ...






గొడుగుతో ఎండనుంచి రక్షణ పొందుతున్న వాహనదారుడు

అస్రానీ ఎలక్ట్రానిక్స్

## బాలయేసు ఆలయంలో ఘనంగా ఈస్టర్ వేడుకలు

**రాజధాని ప్రతినిధి :** తుళ్ళూరు గ్రామంలో బాలయేసు దేవాలయంలో శనివారం రాత్రి 11 గంటలకు ప్రత్యేక ఆరాధన జరిగింది. అంతకు ముందు మూడు రోజులు.. మార్చి 20, 21, 22-2016, తుళ్ళూరు విచారణ గురువు పాదర్ ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో పరిశుద్ధ తపస్సుకాల ప్రార్ధన కూటములు చాలా ఘనంగా జరిగాయి. ఉపదేశకులు ఫాదర్ సిజో,మరియు ఫాదర్-జోసప్ సూర్య చక్కని వాక్య పరిచర్య జరిపి విశ్వాసులం దరిని ప్రార్ధనలో నడిపి అనేక మంది స్వస్తతలను కారణమయ్యారు. ఈ ప్రార్ధనలో మద్దూరు రాయపూడి, అబురాజ్ పాలెం, మండదం,వెలగపూడి, నేలపాడు నుండి ప్రజలు పాల్గొన్నారు. ఈ ప్రార్ధన కూటముల ద్వారా అందరు కూడా పాత జీవితాన్ని వదలి క్రొత్త జీవితాన్ని ప్రారంభించాలని మతపెద్దలు కోరుతున్నారు.



ఫాదర్ ఫ్రాన్సిస్





పోతురాజు

వర్షిత ఫోటోస్టాట్

మా వద్ద జిరాక్స్, లామినేషన్, మొబైల్ ఎక్సరీస్ మరియు అన్ని రకముల ఫోన్ రీచార్జ్‌లులభించును.

మా అడ్రస్ : మార్కెట్ సెంటర్, రాయపూడి.

ఫోన్ నెం:9985853188,8179260479.

T. పోతురాజు
9133149090
9542154917

G. అశోక్
8008242538
9989479832

శ్రీ సాయిరామ్ రియల్ ఎస్టేట్

రాయపూడి గ్రామము, నిమ్మకాయల మార్కెట్ సెంటర్, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా.

P. పోతురాజు
9985853188

B. బాజి
8187854600

ఇళ్ళు, ఖాళీ స్థలములు, పొలములు అమ్మదలచిన , కొనదలచిన సంప్రదించండి

# రాజధాని వార్తలు
కలం

## చండ ప్రచండ భానుడు

మార్చిలోనే మేనెలల ఎండలను రాజదానితో సహా 13 జిల్లాలు పరిస్థితిని చవిచూస్తుంటే, మే నెలలో పరిస్థితి ఇంకెంత ఘోరంగా ఉంటుందోనని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మనుష్యుల పరిస్థితే ఇలా ఉంటే పశు పక్ష్యాదుల విషయం ఏమిటోనని పర్యావరణ వేత్తలు కూడా ఆందోళనల వెలిబుచ్చుతున్నారు. గత ఏడాది కూడా ఎండ వేడికి ప్రజలు విలవిలలాడారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు దిగాలుగా ఉన్నారు. ఉన్న చెరువులు, కాలువలు ఎండిపోయాయి. కృష్ణాబ్యారేజీలో నీళ్లులేక బోరుమంటోంది. శ్రీశైలం ప్రాజెక్టులో చుక్కనీరు లేక వెలవెలబోతోంది. ప్రజకు తాగునీటికి కటకట లేకుండా ఇప్పటి నుంచే ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవాలి. ఎండల పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలి. వడదెబ్బకు అవసరమైన మందులను మరీ ముఖ్యంగా సెలైన్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిలువ ఉంచాలి. ప్రజలు డీ హైడ్రేషన్‌కు గురికాకుండా ఉండాలంటే మంచి నీరు ఎక్కువగా తాగాలి. అంతేకాకుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ప్రభుత్వం విరివిగా పంపిణీ చేయాలి. చలివేంద్రాలు నడిపే స్వచ్ఛంధ సంస్థలకు ప్రభుత్వం చేదోడు వాదోడుగా నిలవాలి.

ఎండల్లో బాటసారులు సేదతీరడం కోసం రోడ్లు కిరువైపులా అశోకుడు చెట్లు నాటించాడు అని చరిత్రలో చదువుకోవడమే తప్ప ప్రస్తుత ప్రభుత్వాలువాటిని అనుసరించడం లేదు సరికదా.. ఉన్న చెట్లను కూడా నరికించడంతో ఎండల తీవ్రతకు ప్రయాణీకులు, ఉద్యోగస్తులు, విద్యార్థులు అతలాకుతలం అవుతున్నారు. మరీ ముఖ్యంగా రాజధాని ప్రాంతంలో పచ్చని చెట్లు, పంటపొలాలు పోయి, బీడుభూములు దర్శనమిస్తున్నాయి. దీంతో ఎల్‌నినో చోటుచేసుకుంటుంది. ఎల్‌నినో అంటే భూమధ్యరేఖా ప్రాంతంలోని ఫసిపిక్ సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడమే... ప్రస్తుతం ఈ ఉష్ణోగ్రతలు 1.5 పెరిగిందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. దీంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆతరువాత లానినా ఉంటుంది. అంటే విపరీతమైన వర్షాలు సంవత్సరం పొడవునా కురవాల్సిన వర్షం రెండుమూడురోజుల్లో కురిసి జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తుంది.


ఇదివరలో రాజధాని రోడ్లు పరిస్థితి అంతగా బాగోపోయినా ఇరువైపులా ఉండే చెట్లు ఎండాకాలం తీవ్రమైన సూర్యరశ్మినుంచి వాహనదారులను రక్షించేవి. రోడ్లు మార్గాలను అభివృద్ధి పేరుతో ఎన్నో ఏళ్ల చెట్లను పెకలించారు. నిజానికి అభివృద్ధి చెందిన దేశాల్లో అయితే చెట్లను నరికి వేయడం ఉండదు. వాటిని ప్రత్యేక యంత్రాలతో పెకలించి వేరే చోట నాటతారు. దాంతో పర్యావరణకు ఎటువంటి ధోకా ఉండదు. మిడిమిడి జ్ఞానంతో , అన్నింటినీ రూపాయలతో విలువకట్టే మనస్థత్వం అలవాటయ్యాక ప్రకృతిని వినాశనం చేసే అవలక్షణంతో ఆనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ప్రకృతిపట్ల , చెట్లపట్ల సరైన అవగాహన లేని ప్రభుత్వం ప్రజల జీవన విధానాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. కోట్ల మొక్కల పెంపకాన్ని ప్రగల్భాలు పలికే ప్రభుత్వం పదేళ్ల చెట్టుకు ఎన్నికోట్ల మొక్కలు సమానమవుతాయి ? వాటినుంచి మనకు అందే ఆక్సిజన్ ఎంతో లెక్క చెప్పగలదా ? ఏది ఏమైనా మనుష్యులు, పశువులు ఈ ఎండలకు గురికాకుండా సరైన చర్యలు తీసుకోవాలి. ఎండలకు జలాశయాల్లో నీరు నిండుకోవడంతో హైడ్రో విద్యుత్ తయారీ కుంటుపడుతుంది. దీంతో విద్యుత్ కోతలు మొదలవుతాయి. అసలే ఎండలు ఆపై ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు పనిచేయని పరిస్థితులతో పసిపిల్లలవిషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. ఇన్వెర్టర్లు లేనివారు ఇంటి చుట్టూ ,వట్టివేర్ల తడికెలు లేదా మందపాటి దుప్పట్లను తడిపి వేలాడతీయాలి. పిల్లలకు ఎండుద్రాక్షాలు, లేదా, ఖర్జూరాలను నీళ్లలో నానబెట్టి ఇవ్వడం మంచిది ఎందుకంటే పిల్లలు ఈ ఎండలకు ఘన పదార్థాలు తీసుకోలేరు. అలాగే వృద్దుల విషయంలో కూడా జాగ్రత్తలు పాటించాలి.

అధిక ఎండలతో భూగర్భ జలలు కూడా అడుగంటుతున్నాయి. నీటిలభ్యత చాలా తక్కువగా ఉంది. అడవుల నరికివేతతో విస్తీర్ణం తగ్గి, పర్యావరణం దెబ్బతింటుండటంతో ఈ పరిస్థితి తలెత్తింది. ప్రభుత్వం రోడ్లమీద మొక్కల కుండీలు, ఆఫీసుల్లో క్రోటన్స్ పెట్టి గ్రీనరీ అంటం కాదుకాని, పర్యావరణ శాస్త్రవేత్తల సలహామేరకు పంటభూములను, అటవీభూములను, వనాలను పరిరక్షించి, చెట్లనరికివేతను అరికట్టాలి. రాబోయే తరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలి. దానికోసం సమగ్రమైన సర్వే జరిపి, చర్యలు చేపట్టాలి. భావిపౌరులకు మేలైన ప్రకృతిని అందించడమే పరమావధిగా ప్రభుత్వం పరిగణించాలి.

# తుర్లపాటీయం

వెంటనే 1946 నాటి నా బాకి కథను అక్కడ వున్న పాత్రికేయులు, ప్రముఖులకు చెప్పి, వారి సమక్షంలో అయిదు రూపాయాల బాకీకి వడ్డీని కలిపి, వంద రూపాయల నోటు పై నా సంతకంతో గాంధీ విగ్రహం చేతికి సమర్పించాను! ఈ వార్త జిల్లా అంతటా వ్యాపించింది!“65 సంవత్సరాల తరువాత వడ్డీతో సహా గాంధీజికి తుర్లపాటి తీర్చిన బాకీ” అంటూ పత్రికలలో వార్తా శీర్షిక ప్రత్యక్షమైనది!

నా జీవితంలో మహాత్మాగాంధి ఆటోగ్రాఫ్ సేకరించడం, నవభారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను ఇంటర్‌వ్యూ చేయడం,“ఆంధ్ర కేసరి” టంగుటూరి ప్రకాశంగారికి కార్యదర్శిగా పనిచేయడం-అరుదైన మహత్తర అవకాశాలు!అతిసామాన్యుడనైన నేను ఇవన్నీ సాధించడానికి ఆ భగవచ్ఛక్తి నాకు ప్రసాదించిన ఆయురారోగ్యాలే ప్రధాన కారణం! మరి,దాదాపు ఏడు దశాబ్దాలు ప్రజా జీవితంలో అవిచ్ఛిన్నంగా,నిరంతరం ప్రజల సాన్నిహిత్యంతో, ఇంతకాలం జోడుగుర్రాలవలె కలం,గళం పోటీపడి సాగడం నా వంటి సామాన్యుడికి సాధ్యమా?నాకు వేరే ఆశలు లేవు, ఏమీకాని నాకు ఎన్నో అభించాయి! అన్నింటినిమించి నిరంతర అఖండప్రజాభిమానం నేను సంపాదించిన కోట్లాది రూపాయల ఆస్తి! ఈ ప్రజాభిమానం నాపట్ల ఏనాడూ తరగలేదు, కించిత్తు చెరగలేదు.నేను 14వ యేట ప్రజాజీవితంలో అడుగిడినప్పుడు ఒకటే అనుకున్నాను.“ఇలాంటి వ్యక్తి అరుదుగాకాని ఉండ” డన్ను పేరు తెచ్చుకోవాలన్నది నా లక్ష్యం.అది సాధించానని నాకు సంపూర్ణ సంతృప్తి.నేను రాసే ప్రముఖుల జీవిత చరిత్రలలో ఇద్దరు, ముగ్గరికి“వీరికి పుట్టుమచ్చంత అవినీతి మచ్చకూడా లేద”ని రాశాను. నన్ను గురించి ఎవరైనా రాస్తే, ఆపద ప్రయోగం నాకు కూడా ఉపయోగించగల స్థాయిని సంపాదించాను.నేను ఇన్ని దశాబ్దాలుగా కృషి చేశాను.పూర్వజన్మ పునర్జన్మ ఉన్నవో,లువో నాకుతెలియదు.అవి వున్నా మనకు తెలియదు. పూర్వజన్మలో మీరెవ్వరు? చెప్పగలరా? చెప్పలేరు. అలాగే స్వర్గ నరకాలు, పరలోకం ఉన్నయా? ఎవరికి తెలుసు? ఎవరైనా ఈ ప్రపంచం నుంచి వెళ్లిపోయి,ఆ లోకాలకు వెళ్లి, తిరిగివచ్చినవారు ఒక్కరైనా ఉన్నారా? ఒక్కరు,ఒక్కరు,ఒక్కరు కూడా రెండు వందల కోట్ల సంవత్సరాల మానవేతిహాసంలో కనిపించరు! అయినప్పుడు,ఆ లోకమే. మన మంచి చెడ్డల “జడ్జి” ఈలోకమే.ఇదే మన లోకం. మరో లోకం ఉన్నా, లేకపోయి నా మనకొద్దు.



“మరల ఈ దారిని వస్తానో,రానో”!

అందువల్లనే, ఒక గజల్ నాకు ఎంతగారో రచ్చింది!“అందరినీ ప్రేమించు! అందరినీ పలకరించు! మరల ఈ దారిని వస్తానో, రానో!” రాము, రాబోము.ఈ మహత్తం మానవ జీవిత సందేశాన్ని పాంటించడమే మానవ జీవిత ప్రస్థానానికి సాఫల్యం.

చివరగా ఒక మాట. నేను ఎప్పుడూ చేప్పే మాటే.“జాతి,మత,కుల,వర్ణ,వర్గ,స్త్రీ, పురుష విభేదాలకు అతీతమైన, మానవుడు మానవునిపట్ల మానవుడుగా వ్యవహరించే మానవీయ వ్యవస్థ మన లక్ష్యం కావాలి”

( సమాప్తం )

# పచ్చదనం కోల్పోతున్న పల్లెలు

*పొలాలన్నీ హలాల దున్ని , ఇలాతలంలో హేమం పండగా*
*జగానికంతా సౌఖ్యం నిండగ, విరామ మెరుగక పరిశ్రమించే*
*బలం ధరిత్రికి బలికావించే ..కర్షక వీరుల కాయం నిండా*
*కాలువకట్టే ఘర్మజలానికీ, ఘర్మజలానికీ*
*ధర్మజలానికీ , ఘర్మ జలానికి ...*
*ఖరీదు కట్టే షరాబు లేడోయ్ ...*
*అని శ్రీశ్రీ రైతులను స్తుతించారు.*

రైతునుంచి బలవంతంగానో, డబ్బాశ చూపో, ప్లాట్లకోసమో... పరిశ్రమల్లో కూలివారిగానో చేర్చుతామంటూనో అధికారులు, భూబకాసురులు, పెట్టుబడిదారులు, రియల్ ఎస్టేట్ దారులు వారిని మోసం చేస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

ఉదయాన్నే కోడికూతతో మొదలయ్యే వారి దైనందిన కార్యక్రమం పొలాలతో, పాడిపశువులతో పెనవేసుకు పోయేది... పనిలోనే ఆనందం... పనిలోనే విశ్రాంతి...పనిలోనే ఆరోగ్యం ఇది ఒకప్పటి పల్లె జీవన విధానం...

అయితే ఇప్పుడు అన్నీ మారిపోయాయి. టీవీలు...చూసి...చూసీ ..పడుకోవడం లేవడం...ఇంత వండుకుంటం... తినడం రచ్చబండదగ్గర కూచోని నలుగురు ముచ్చట్లు చెప్పడం ....రోజు గడపటం పడుకోవడం ఇంతే ఈ జీవితం అన్నట్లు తయారైందని రైతులు వాపోతున్నారు. పల్లెవీధులు, మనుష్యులు పొలాలు,ఫైర్లు , ఉద్యోగాలు, ఇప్పుడు ఏవీ లేవు.. అంతా స్తబ్ధత....మనిషి ఒకటి మాత్రం గుర్తుంచుకోవాలి...ఎంత సంపాదించినా.. భూదింగతాల్లో పయనించినా, నింగిలో విహరించినా...మనిషికి కావల్సింది మాత్రం పూటకు పట్టెడన్నం మాత్రమే...ఈ విషయం గుర్తించకుండా ఈ పరిస్థితి కొనసాగితే రానున్న కాలంలో ప్రజలంతా దుర్భర దారిద్ర్యం అనుభవించాల్సి ఉంటుందని, సామాజిక ఆర్థిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మూడు నెలల క్రితం హరిత విప్లవ కారుడు స్వామినాథన్ మాట్లాడుతూ అణ్వాయుధాలు, ఆటంబాబులు, పరిశ్రమలు ఉన్న దేశాలు కాదు... తిండిగింజలు ఉన్న దేశమే అత్యున్నత దేశం అని వ్యవసాయం గురించి ఆయన స్వదేశ, విదేశాల్లో మొత్తుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. డబ్బు మీద విపరీతమైన మోజుతో ఇప్పటికే చాలా చిన్న దేశాలు మన దేశంలాగే పరిశ్రమల వెంట పరిగెత్తి తిండి గింజలు లేక ద్రవ్యోల్బణంలో మునిగి తేలుతున్నాయి. అక్కడ పరిశ్రమల్లో ఉద్యోగం చేసేవారికి నెలకు లక్షల డాలర్లు వస్తాయి. అయితే చిన్న బ్రెడ్ ముక్క వేలడాలర్లలో ఉంటుంది. అదీ పరిస్థితి డబ్బులు ఉంటాయి. అయితే జానెడు కడుపు నింపుకోవడానికి ఉన్నదంతా ఊడ్చి ఇచ్చినా సరిపోని పరిస్థితి.

రెండు నెలల క్రితం మన దేశం కూడా ఇలాంటి పరిస్థితినే చవిచూసింది. పప్పుధాన్యాలకు విపరీతమైన కొరత ఏర్పడింది. దాంతో విదేశాల నుంచి నాసిరకం కందులను అధికరేటుకు ఆఘమేఘాల మీద దిగుమతి చేసుకున్నారు. మళ్లీ దాన్ని మిల్లులకు పంపి పొట్టుతీయించి, పప్పుబద్దలుగా చేసే సరికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తలప్రాణం తోక్కొంచింది. ఎంచక్కా మనమే పండించుకుంటే బావుంటుందని అనుకున్నా అది ఎంతోసేపు నిలువలేదు. నాణ్యత లేనిఉల్లి, టమాట ఇతర నిత్యావసరాలకు మనం అధికమొత్తంలో విదేశీ దిగుమతులకు వెచ్చించవలసి వస్తుంది. ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరవక పోతే బెంగాల్‌లో రెండో ప్రపంచయుద్ధకాలంలో సంభవించిన కరువునే దేశం ఎదుర్కోవలసి ఉంటుంది. రైతులకు,రైతుకూలీ లకు మట్టితో ఉన్న అనుబంధం విడతీయలేనిది, పారిశ్రామిక రంగం పేరుతో వారి నైపుణ్యాలను దారి మళ్లించి వారిని తీవ్ర మానసిక క్షోభకు గురిచేయకండని మనస్తత్వ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**నిఖార్స్ అయిన రైతులు చెప్పేదేమంటే మేడలు, మిద్దెలు, బంగారం,డబ్బు, అంతా అబద్ధం...ఈ మట్టే నిజం...అని అవును రైతే రాజు.. రాజుకు గుర్తింపు గౌరవం ఉన్న దేశమే సౌభాగ్యవంతమవుతుందంటున్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు.**

# మన సభాపతి

## డా॥ కోడెల శివప్రసాదరావు

*సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి విజయం సాధించిన కోడెల శివప్రసాదరావును సభాపతి పదవి వరించింది. సుదీర్ఘ అనుభవం కలిగిన శివప్రసాదరావు మంత్రిగా పలుశాఖలను సమర్థవంతంగా నిర్వహించారు. ప్రత్యర్థుల అవాస్తవ ప్రచారాలకు మనస్తాపం చెందిన ఆయన ఒకానొకపుడు మంత్రి పదవికికూడా స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. వారి రాజకీయ పెరుగుదలను జీర్ణించుకోలేని ప్రత్యర్థులు ప్రాణహాని తలపెట్టడమేకాదు, బాంబులతోను, యాసిడ్‌లతోను దాడులు కూడా చేయించారు. అవాస్తవాలను అమితంగా ప్రచారం చేశారు. వాటన్నిటినీ భర్తిస్తూ , సహిస్తూ ధృడచిత్తంతో, మనోధైర్యంతో ముందుకుసాగారు. అవమానాలు భరించారు. అపవాదలను సహించారు.అధినాయకత్వం ఆశయాలకు అనుగుణంగా, పార్టీ ఆదేశాలను తు.చ. తప్పకుండా, ప్రజాసేవకే జీవితం అంకితమంటూ ముందుకు సాగుతున్నారు. నిబ్బరం, నిబద్ధతగల వారికి ఉన్నత పదవులు ఆయాచితంగా లభిస్తాయనే విషయం ఆయన విషయంలో రుజువైంది.*



**సభాపతి ఏకగ్రీవం :**

సభాపతి పదవి కత్తి మీద సాములాంటిది. స్వపక్షం విపక్షం అనే భేదాలకు తావుల కుండా, దరిజేరకుండా నిర్వహించాల్సిందే. శివప్రసాదరావు చిత్తశుద్ధిని, కార్యదక్షతను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. సభానతి వివాదరహితుడుగా వుండాలి. ఓర్పు, సహనం కలిగివుండాలి. సభ్యులు ఆవేశకావేశాలకు నైనా సమయాల్లో కూడా సభా సంప్రదయాలు దుబ్బతినకుండా కాపాడే సున్నిత కనబరచినా, “సభాపతి అసమర్థుడు” అని ముద్ర లేసుకోవటం మాత్రమే కాదు. ప్రభుత్వం మొత్తం అపహాస్యానికి గురవుతుంది. అవహే ళన చేయబడుతుంది. పొరుగు రాష్ట్రాల్లో తలవంపులకు గురై చులకన చేయబడు తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిచర్యకు, అడుగుకు, సభాపతి బాధ్యుడవుతాడు. శివప్రసాదరావు సహనం తక్కువ, కొంచెం కోపిష్ఠి అనికూడా ప్రతిపక్షాలు ప్రచారం చేస్తూంటాయి. అయినసరే ముఖ్యమంత్రి ప్రతిపక్షాలు, గిట్టనివాళ్ళు వ్యాఖ్యాలను విమర్శలను పరిగణనకు తీసుకోకుండా ముందుకు నడిచారు. శివప్రసాదరావు పేరును ఖరారు చేశారు. తన పార్టీలోని సీనియర్‌లను మాత్రమే కాకుండా, ప్రతిపాక్షనేత వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఛాంబర్‌కు కూడా స్వయంగా వెళ్ళి తన అభిప్రాయం తెలిపి, ఆమోదముద్ర వేయించుకున్నారు. ఆయన తెలుగుదేశం తరుపున విజయం సాధించినా, శాసనసభలో బలమైన ప్రతిపక్షంవున్నా, శివప్రసాదరావు రాష్ట్ర సభాపతిగా ఏకగ్రీవం గానే ఎంపికయ్యారు.

**బాల్యంలో దురదృష్టం :**

శివప్రసాదరావు గుంటూరుజిల్లా, నకిరికల్లు మండలం, కండ్లగుంట గ్రామంలో 1947 మే 2న జన్మించారు. మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం. ఇద్దరు తమ్ముళ్ళు, ఇద్దరు చెల్లెళ్లు అందరూ అభివృద్ధిలోకి వస్తారని ఆశ తల్లిదండ్రులకు మెండుగా ఉండేది. దురదృష్టం వారిని వెంటాడింది. వారి ఆశల ను కనికరం లేకుండా త్రుంచిచేసింది. వారం రోజుల వ్యవధిలో తమ్ముళ్ళు, చెలెళ్ళు, మరణించారు. మసూచి వ్యాధి తీవ్రతకు వాళ్ళ నలుగురు బలయ్యారు. ఆ సమయంలో శివప్రసాదరావు తాతగారి ఇంటి వద్ద వుండటం వల్ల బ్రతికి పోయానని ఆయనే స్వయంగా చెపుతారు. ఆరోజులలో మశూచి వ్యాధి ప్రభావం అంత తీవ్రంగా వుండేది. సాధరణ వైద్యం కూడా అందే పరిస్థితులు అపుడు లేవు. తోబుట్టువులు మరణం ఆయన్ని అమితంగా కలిచివేసింది. తనజీవితాన్ని వైద్యవృత్తికే అంకితం చెయ్యాలని చిన్నవయస్సులోనే నిర్ణయించుకున్నారు. ఆ నిర్ణయాన్ని అమలు చేయటానికి నిరంతరం కృషిచేశారు. నందమూరి తారకరామారావు రాజకీయాల్లోకి ‘రమ్మని’ ఆహ్వానించినా, సున్నితంగా తిరస్కరించి, నా జీవితం వైద్యానికే అంకితం అన్నారు. తాను మాత్రమే కాక, తన సంతానాన్ని కూడా వైద్యవృత్తిలోనే కొనసాగించే ఏర్పాటు చేశారు. ఆశయాలు ఆమోఘంగావున్నా, ఆస్తులను అపారంగా కూడాకట్టుకున్నా, ఆప్తులను వృద్ధి చేసుకున్నా విధినెదిరించటం మానవునికి సాధ్యంకాదు అంటుంటారు చాలా మంది. అలాంటి విధి శివప్రసాదరావు పై పగపట్టునట్టు కనిపిస్తుంది. చిన్నతనంలో తమ్ముళ్ళను, చెల్లెళ్ళను పోగొట్టుకున్న ఆయన వైద్యునిగా, రాజకీయ నాయకుడుగా ప్రజలసేవకు అంకితమైన దశలో విధి క్రూరత్వానికి మరోసారి గురై, కొడుకును కూడా పోగొట్టుకున్నారు. ఆర్థోపెడిక్స్‌గా గోల్డ్ మెడల్ అందుకొని, సర్వీస్ ఓరియాంట్‌గా, సిగరేణి కాలరీస్‌లో బాధ్యతలు నిర్వహిస్తూ కారు ప్రమాదంలో మరణించారు.

**ప్రజాసేవకే అంకితం :**

పాఠశాల విద్య కండ్లగుంటలో సాగింది. నరసరావుపేటలోని పురపాలక సంఘపాఠశాల, సిరిపురంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో ప్రాథమికోన్నత విద్యను పూర్తిచేసి, విజయవా డలోని లయోలా కళాశాలలో పి.యు.సి. పూర్తిచేశారు. కర్నూలు వైద్యకళాశాలనుంచి యం.బి.బి.యస్. డిగ్రీ అందుకొన్న శివప్రసాదరావు బెనారల్ విశ్వవిద్యాలయంలో యం. యస్. చేశారు. విద్యార్థిదశలో చదువు తప్పించి మరో ధ్యాసవుండేది కాదు. స్వంత వ్యవసా యం వున్నా దానిపై మక్కువ అంతంతమా త్రమే “ వైద్యం-వైద్యసేవ” అనేవి మాత్రమే ఆయన మదిలో మెదిలేవి. ఆ దృక్పథంతోనే ముందుకు సాగారు. ధృడచిత్తంతో చదువు కొనసాగించారు. యం.యస్. పట్టా అందుకొని, నరసరావుపేటలో ఆస్పత్రిని నెలకొల్పారు. సన్నిహితులు కొందరు. ప్రభుత్వ సర్వీసులో చేరమని సలహా కూడా ఇచ్చారు. ప్రభుత్వ సర్వీసు అంటే గానుగెద్దు జీవితం. గంటలు మాత్రమే పనిచేయటం ఆయనకు ఇష్టం లేదు. వీలున్నంతవరకు రోగులకు సేవచేయటం, ప్రజలను ఆరోగ్యవంతులు చేయటం కోసం స్వంత ఆసుపత్రిని ప్రారంభించరు. వైద్య సహకారం అందక మరణించిన తముళ్ళు, చెల్లెళ్ళు తరచుగా ఆయనకు గుర్తు రావటంవల్ల, మరో ధ్యాస, ఇంకో వ్యాపకం లేకుండా వైద్యానికే అయన అంకితమైపోయారు. ఒడిదుడుకులు లేకుండా మనిషి జీవితం సాగిపోతే మనిషి అజేయుడైపోతాడు. అందుకే అపుడుపుడు సాఫీగా సాగే జీవితానికి విధాత కొన్ని ఆటంకాలు, అవరోధాలు కలిగిస్తుంటాడు శివప్రసాదరావు వైద్య జీవితంలో కూడా అలాంటి అవరోధం ఏర్పాడింది.

**రాజకీయాల్లోకి ఆహ్వానం**

1982లో నందమూరి తారక రామరావు తెలుగుదేశం పార్టీని స్థాపించడం మెరికల్లాంటి వారిని ఏరుకోవటం ప్రారంభించారు. ఆసమయంలోనే శివప్రసాదరావు సున్నితం గానే ఆహ్వానాన్ని తీరస్కరించారు. “వైద్యసే వకే తన జీవితం” అని నిక్కచ్చిగా చెప్పారు. “రాజకీయం కూడా ప్రజాసేవలో భాగమే “రాజకీయం కూడా ప్రజాసేవలో భాగమే” సినిమారంగంలో దేదీప్యమానంగా వెలుగొందుతూ ఎంతో కీర్తిప్రతిష్టలార్జించిన నేను ప్రజాసేవకోసమే పార్టీ స్థాపించారు. “ మనమంతా కలిసే, ముందు కుసాగి, ప్రజాసేవ చేద్దాం” అంటూ రామ రావు నచ్చ జెప్పే ప్రయత్నం చేయటం కూడా శివప్రసాద రావు ను కదిలించలేదు. రాజకీయాలవైపు దృష్టి సారిం చలేదు. పట్టువదలని రామరావు నుంచి రెండు, మూడు సార్లు పిలుపు రావటం తో స్నేహితులు, సన్ని హితులు కూడా బలవంతం చేశారు. జిల్లాలో ప్రాభవం పేంచుకోవాలంటే రాజకీయం అవసరమని వత్తిడి తెచ్చారు. ఒప్పించారు. బలవంతంగా రాజకీయాల్లోకి వచ్చినా, మంచి గుర్తింపు తెచ్చారు. పార్టీ అధినేత రామరావు అత్యంత సన్నిహితుల్లో ఒకడిగా కొనసాగారు. 1983 ఎన్నికల నాటికే ప్రజలతో సన్నిహిత సంబంధాలు పెంచుకు న్నారు. వైద్యునిగా ప్రజలకు అందించిన సేవలు కూడా, శివప్రసాదరావు రాజకీయంగా ఎదగటానికి దోహదపడ్డాయి. ప్రజల ఆదరాభి మానాలు, అధినేత ఆశీస్సులు చూరగొన్న శివప్రసాదరావు విజయానికి బాటలు వేశా యి. రాజకీయాల్లో కాకలు తీరిన కాసు వంశస్తుడైన కాంగ్రెస్ అభ్యర్థి కృష్ణారెడ్డిని, సుమారు పదిహేనువేల ఓట్లు తేడాతో ఓడించి, ఆరంగేట్రంలోనే అబ్బురపరచారు. ఈ నరసరావుపేట నియోజకవర్గం నుంచి ఐదుసార్లు వరుస విజయాలు సాధించారు.

11 ఏళ్లు మంత్రి పలుశాఖల నిర్వహణ : 1983, 9185, 1989, 1994,1999 ఎన్నికల్లో కోడెల నరసరావుపేట నుంచి విజయం సాధించారు.నరసరావుపేట ‘కోడుల కోట’గా ప్రజలు శ్లాఘించారు. 1952లో సారస్వత ఎన్నికలు ప్రారంభమైనప్పటి నుంచి అయిదుసార్లు ఒకే నియోజకవర్గం నుంచి వరుస విజయాలు సాధించిన ఘనత గుంటూరు జిల్లాలో కోడెలకు మాత్రమే దక్కిం ది. 2014 లో అధిష్టానం ఆదేశం మేరకు నియోజకవర్గం మార్పు జరిగింది.

సత్తెనపల్లి నియోజకవర్గం కోడెలకు కేటాయించారు. ఈ చర్య అభిమానులను కొంత నిరుత్సాహ పరిచింది. స్వంత నియోజకవర్గం ఎవరితో కట్టబెట్టి, నిజమైన నాయకునకు స్వపరభేదాలు ఉండకూడదని అనుయాయులకు కోడుల నచ్చజెప్పారు. కోడుల నియోజకవర్గం మార్చుటంలో అధిష్టానం ముందు చూపుతో చేసిందన్న విషయం కూడా గమనార్హం. 2004, 2009లో కోడెల నరసరావుపేటలో ఓటమి పాలయ్యారు. ఆధారాలులేని, బలమైన ఆరోపణ అందుకు దోహదపడ్డారు. 1986లో విజయవాడలో నిరాహారదీక్ష చేస్తూన్న వంగవీటి మోహనరంగా హత్యకు గురయ్యా రు. ఆ హత్య వెనుక కోడెల హస్తం వుందని బహుళ ప్రచారం జరిగింది. ఆ తరువాత బాంబుల సంఘటనకు మనస్తాపం చెందిన కోడెల మంత్రిపదవికి స్వచ్ఛందంగా రాజీనా మా సమర్పించి, దర్యాప్తు నిస్పక్షపాతంగా జరగటానికి సహకరించారు. కోడెల ప్రతిష్టను దెబ్బతీయటానికి అనేక ఆరోపణలు ప్రతిప క్షాలు చేశాయి. నరసరావుపేట పరిధిలో ఫ్యాక్షన్ వాసనలు ప్రభలంగా వున్న గ్రామాలు న్నాయి. ప్రత్యర్థులను మట్టుపెట్టడానికి ఆయుధాలను మాత్రమే కాదు,బాంబులను కూడా సిద్ధం చేసుకోవటం అక్కడి సంస్కృతిలో ఒక భాగం. దుస్సంఘటనలు జరగకుండా పోలీసులు సదా అప్రమత్తంగా వుండేంవారు. పోలీసులకు భయపడి కార్యకర్తలు, బాంబులు తెచ్చి, కోడెల ఇంట్లో దాచారట. అక్కడైతే పోలీసులకు అనుమానం రాదని అలా చేసి వుంటారని, కోడెల వివరణ యిచ్చారు. విషయం తెలియని ఒక వ్యక్తి వాటిని తొక్కటం, అవిపేలటం నల్గురు దుర్మరణం పొందటం జరిగాయి. సి.బి.ఐ. విచారణలో ఆ పేలుళ్ళకు కోడెలకు ప్రమేయం లేదని స్పష్టమైనా, ఆమచ్చ మాత్రం మాసిపోలేదు. ప్రతి ఎన్నికలలో ప్రతిపక్షాలు ఆ మచ్చను ఎత్తిచూపుతు ఎలుగెత్తి చాటుతూ ప్రచారం చేయటంలో కోడెల రెండుసార్లు ఓటమి చవిచూశారని అధిష్టానం నమ్మకం కావచ్చు. అందుకే నియోజకవర్గం మార్పు జరిగివుంటుందని ఆయన అభిప్రాయం కూడా. ఐదుసార్లు వరుస విజయాలు సాధించారు కోడెల హోంశాఖను, భారీ నీటిపారుదల శాఖను, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, పౌరసరఫ రాల శాఖను కూడా సమర్థవం తంగా నిర్వహించారు. ఆయనకు అత్యంత ఇష్టమైన వైద్య ఆరోగ్యశాఖలను కొద్దికాలం నిర్వహించే అవకాశం ఏర్పాడిందని ఆయన సంతోషం వ్యక్తం చేస్తారు. 2004లో ఓటమి చెందాక కూడా ఆయన రాజకీయాల నుంచి వైదొలగలేదు. తెలుగుదూశంలో పార్టీ అధికార ప్రతినిధి సమర్థవంతంగా భాధ్యతను నిర్వహించారు. రైతు సమస్యల ఆధ్యయన కమిటీ అధ్యక్షులుగా కొనసాగారు.

**1952 లోనే ఏర్పడిన సత్తెనపల్లి నియోజకర్గం**

1952లో సార్వసత ఎన్నికలు ప్రారంభ మైనప్పటి నుంచి, స్వతంత్ర అభ్యర్థులను ఇక్కడి ఓటర్లు అక్కున చేర్చుకొన్న అపూరూప సంఘటనలు ఈ నియోజికవర్గంలో కనిపి స్తాయి. స్వాతంత్ర్య సమరయోధుడు. గాంధేయవాది వావిలాల గోపాలకృష్ణయ్య సత్తెనపల్లి నుంచి నాలుగుసార్లు వరుస విజయాలు సాధించారు. ఈ విజయాలలో ఒకటి సి.పి.ఐ. తరుపున కావటం గమనించదగిన విషయం కాగ్రెస్‌కి ఈ నియోజికవర్గం పెద్దగా అచ్చిరా లేదనే చెప్పాలి. 1983లో నన్నపనేని రాజకు మారి దాదాపు 20వేల మెజారిటీతో గెలుపొం దారు. 1984 ఆగస్టు సంక్షోభ సమయంలో నాదెండ్ల భాస్కరరావు వైపు నడిచి, రామారా వుతో విభేదించి పార్టీకి దూరమై కాగ్రెస్‌లో చేరారు. 1989 వినుకొండ నుంచి కాగ్రెస్‌అ భ్యర్థిగా విజయం సాధించి, ప్రభుత్వ ఛీఫ్ విప్ పదవి పొందారు. కాంగ్రెస్‌లో వున్నపుడురాష్ట్ర మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కొనసాగారు. 1995 నాటికి తిరిగి తెలుగుదేశంలో చేరారు. తెలుగు మహిళ అధ్యక్షపదవిని చేపట్టారు. 1999లో టి.డి.పి అభ్యర్థి వై. వీరాంజనే యులు విజయం సాధించిన తర్వాత 2014 లో కోడెల గెలుపొందారు.ఈ నియోజికవర్గం నుంచి 1985లో సి.పి.యం. అభ్యర్థిగా విజయం సాధించిన పుతుంబాక వెంకటపతి, 1994లో గెలుపొందిన పుతుంబాక భారతి భార్యభర్తలు. తెలుగుదేశం అభ్యర్థిగా పోటీచేసిన వైద్యవిధానం పరిషత్ కమిషనర్ డా॥ కె.అంజిరెడ్డి ఓటమి చవిచూడటం విశేషం.

# ఎల్లలు లేని సేవలు

ఆమె

మానవత్వం మన మనస్సుల్లో ఉంటే సేవకుఎల్లలే ఉండవనినిరూపించారు డాక్టర్. సిస్టర్ జైన్ముత్తేజం. ఒకే భాష మాట్లాడేవారే విద్వేషాలతో ప్రాంతాలుగా విడిపోతుంటే... కేరళలో పుట్టి కర్నాటకలో చదివిన సిస్టర్ జైన్ రహదారులు, సౌకర్యాలు ఏమీలేని రాజధాని ప్రాంతంలో గత 25 ఏళ్లనుంచి పేద,నిరక్షరాస్య ప్రజలకు మరీ ముఖ్యంగా గ్రామీణ మహిళలకు డెలివరీ, తల్లీ బిడ్డల సేవలందిస్తున్న సిస్టర్ గురించి ఈ వారం తెలుసుకుందాం...



డాక్టరమ్మ సిస్టర్ జైన్ముట్టేథజం తుళ్లూరు మండలం

కేరళలో పుట్టిపెరిగిన జైన్ డిగ్రీ పూర్తయ్యాక క్రైస్తవ కన్యకా మఠంలో చేరి,రోమ్లో పట్టాభిషేకం పొందిన తరువాత మళ్లీ కేరళ చేరుకున్నానన్నారు. ఆ సమయంలో అక్కడ ఒక డిస్పెన్సరీలో డాక్టర్ అవసరం ఉన్నందున సభ తనను ఎంబీబీఎస్కు అనుమతించిందన్నారు. దీంతో క్రిస్టియన్ క్యాథలిక్ సంస్థకు చెందిన బెంగుళూరులోని సెయింట్ జాన్స్లో 1987లో ఎంబీబీఎస్ చేరారన్నారు. 1991లో డాక్టర్ కోర్సును పూర్తి చేసి ఒక ఏడాది పాటు ఇంటెర్న్షిప్ అక్కడే చేశానన్నారు. 1992లో కేరళలో డాక్టర్ అవసరం ఉన్నా, అదే సమయంలో ఫాదర్. అడాల్ఫ్ తుళ్లూరుకు ఆహ్వానించారన్నారు. గ్రామీణులకు ఇక్కడ వైద్యసేవలు సరిగ్గా అందని పరిస్థితుల్లో ఆయనే ప్రాథమిక వైద్యాన్ని అందిస్తూ వుండేవారన్నారు. అయితే ఆమె వచ్చేనాటికే ఇక్కడ భవనాలు తప్ప వేరే ఏ ఇతర సదుపాయాలు లేవన్నారు. రెండు సంవత్సరాలు ఇక్కడ సేవలు అందించిన తరువాత 95లో వెంకటగిరి ఫాదర్ ఆహ్వానం మేరకు అక్కడ సేవలందించానని ఆమె తెలిపారు. ఆ సమయంలో తుళ్లూరులో వైద్యసేవలు కుంటుబడ్డాయని, ప్రాథమిక వైద్యాన్ని నర్స్ సిస్టర్స్ అందించారన్నారు. అక్కడ రెండేళ్లు వైద్య సేవలు అందించిన తరువాత సెయింట్ జాన్స్ కాలేజీలో ఉన్నతవిద్య నభ్యసించడాని వెళ్లి డీజీఓగా తిరిగి వచ్చి కేరళలోని అస్సిసి ఆసుపత్రిలో సేవలు అందించానన్నారు.



గ్రామీణులకు వైద్య సేవలందిస్తున్నన మేరీమాత డిస్పెన్సరీ

అక్కడ రెండేళ్లు పనిచేసిన తర్వాత తుళ్లూరులో వైద్యసేవలు అవసరమని మళ్లీ ఇక్కడకు పిలిపించారనీ అయితే అంతకు ముందు తన వైద్యసేవలకు ప్రజలు చాలా ఆప్యాయతా అనురాగాలు కురిపించడంతో 2006లో ఈ ప్రాంతంలో తాను మళ్లీ వైద్యసేవలను కొనసాగించడానికి వచ్చానని జైన్ తెలిపారు. అప్పటి నుంచి ఈ ప్రాంతం ప్రజలతో మమేకమాయ్యానని ఈ ప్రాంతం తనకు చాలా ఇష్టమైందని డాక్టర్ చెప్పారు. దాదాపుగా 25 సంవత్సరాలుగా వైద్య సేవలు చేస్తున్నానని ఇది తనకు ఎంతో సంతృప్తి నిస్తుందన్నారు.

ఇటలీలోని రోమ్లో తాను మఠస్త్రీగా పట్టా పొందటంతో ప్రతి ఏడాది అక్కడ ఉన్న డాక్టర్ ఫ్రెండ్స్ ఇక్కడ సేవలందిస్తానికి వస్తారన్నారు. దీంతో ఈ ప్రాంతంలో ప్రతి సెప్టెంబరు, అక్టోబర్లలో వైద్య శిబిరం ప్రారంభిస్తామని, అప్పుడు తాను డాక్టర్గా కాక కేవలం ఒక దుబాశీ (ట్రాన్స్లేటర్గా) వ్యవహరిస్తానన్నారు. ఆ సందర్భంగా ఇక్కడ ఆపరేషన్లు, గుండె, నేత్ర, పిల్లల వ్యాధులు, స్త్రీల వ్యాధుల నిపుణులు ఫిజీషియన్లు వచ్చి వారి ఖర్చులతోనే ఆపరేషన్లు చేసి మందులు ఉచితంగా సమకూర్చుతారన్నారు. ఒక ఏడాది 50 మందికి ఉచిత ఆపరేషన్లు నిర్వహించామన్నారు.

నిజానికి విదేశీ డాక్టర్లకు ఏడాదికి 15 రోజులు వేతనంతో కూడిన సెలవు (విహారయాత్ర) మంజూరు అవుతుంది. అయితే వీరు సెలవులను వినోదం కోసం కాకుండా సేవాతత్పరకు వినియోగిస్తూ ఇక్కడకు వస్తారన్నారు.

పంచాయతీ ఆఫీసులో అటెండరుగా పనిచేస్తున్న సుబ్రమణ్యానికి కూడా ఇక్కడే ఆపరేషన్ జరిపామ న్నారు. అంతేకాకుండా ఇక్కడ చాలా మందికి హెర్నియా, వెరికోస్ వైన్స్ ఆపరేషన్లు నిర్వహించామన్నారు.

నాడీపట్టుకుంటే ఇంత, టెస్టులకు అంత, రూంరెంటులు బారెడు వేసి వైద్యాన్ని వ్యాపారం చేసిన ఈ రోజుల్లో ఇక్కడ ప్రజలతో మమేకమై మానవత్వంతో వైద్యం అందించడం ఎంతైనా ముదావహం. తుళ్లూరు మండల ప్రజల తరుపున డాక్టర్ జైన్కు రాజధాని వార్తలు అభినందనలు తెలుపుతోంది.

**ఒక ఏడాది వైద్యశిబిరం జరుగుతున్నప్పుడు చనిపోయిన స్థితిలో వళ్లంతా చీమలు పాకుతుండగా కోటేశ్వరమ్మను ఇక్కడకు తీసుకువచ్చారని జైన్ తెలిపారు అయితే ఆమెను చూసిన తాను మొదట హెచ్ఐవీ టెస్టు చేశానని అమెకు నెగటివ్ రిజల్ట్ రావడంతో ఆమెకు రక్త పరీక్ష చేయగా,14శాతం నమోదు కావాల్సిన హిమోగ్లోబిన్ కేవలం 1 శాతం మాత్రమే ఉందని ఆమె తెలిపారు. దీంతో అప్పటికప్పుడు విదేశీ డాక్టర్లు తమ రక్తాన్ని ఇచ్చారని, ఆపై గుంటూరు నుంచి తెప్పించిన 5 సీసాల రక్తం ఎక్కించడంతో ఆమె కోలుకుందన్నారు. రెండవ జన్మను ప్రసాదించినందుకు తాను ఇక్కడే పనిచేస్తూ మీదగ్గరే ఉంటానని కోరిందన్నారు. బీకాం చదివిన ఆమె ప్రస్తుతం డిస్పెన్సరీలోని రోగులకు సేవలందిస్తుందని డాక్టర్ జైన్ తెలిపారు.**



మల్లవరపు కోటేశ్వరమ్మ

# జూన్ 15న సచివాలయం తరలింపు

- జూలై ఆఖరు నుంచి హెచ్వోడీల తరలింపు తొలిదశ
- ఉద్యోగ సంఘాలతో మంత్రి నారాయణ, సీఎస్ టక్కర్ భేటీ
- ఉద్యోగ సంఘాల డిమాండ్

**రాజధాని ప్రతినిధి :** నూతన రాజధాని అమరావతికి సచివాలయం తరలింపును ఈఏడాది జూన్ 15న ప్రారంభిస్తామని ప్రభుత్వం ఉద్యోగ సంఘాలకు తెలిపింది. పురపాలకశాఖ మ్రంతి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీటక్కర్ సోమవారం సచివాలయంతో..ఉద్యోగ సంఘాల నేతలు, సచివాలయ భవన నిర్మాణ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. సచివాలయం తరలింపును ఒకేదఫా పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించామని మంత్రి,సీఎస్ వెల్లడించారు. శాఖాధిపతుల కార్యాలయాల (హెచ్వోడీ) తరలింపును రెండు దఫాలుగా పూర్తి చేయాలని యోచనలో ఉన్నామన్నారు. జూలై ఆఖరున తొలిదశ తరలింపు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకు న్నామని చెప్పారు. సచివాలయం కోసం జీ+1 అంతస్తు నిర్మిస్తున్న భవనం మీదే మరో రెండంతస్తులు నిర్మించి, శాఖాధిపతుల కార్యాలయాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చిందని వెల్లడించారు. సచివాలయం కోసం మొత్తం 6 బ్లాకులు నిర్మిస్తున్నామని,అందులో 1,2,3 బ్లాకులు సచివాలయానికి, 4,5 బ్లాకులు శాఖాధిపతుల కార్యాలయాలకు, ఆరో బ్లాక్ను శాసనసభ, మండలికి ఇవ్వాలనే ప్రతిపాదన ఉందన్నారు.

**స్పష్టత ఇవ్వడంలో విఫలం...**

తరలింపుపై స్పష్టత ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తరలింపు తేదీలు,ఇతర డిమాండ్లపై కేవలం ప్రకటనలు చేయడమే కాకుండా ఉత్తర్వులు ఇస్తే ఉద్యోగులు మానసికంగా సిద్ధమవుతారని సూచించారు. 30 శాతం హెచ్ఆర్ఏ కొనసాగింపు, సీసీఏ, ప్రత్యేక అలవెన్స్,వారానికి 5 రోజుల పని విధానం, పిల్లల స్థానికత, విద్యాసంస్థల్లో సీట్లు.. తదితర అంశాల్లో ఉత్తర్వులివ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, మరోసారి ఉద్యోగ సంఘాలతో సమావేశమై వెల్లడిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

**తరలి వెళ్లాల్సిన ఉద్యోగులు 6-7 వేలకు మించరు**

సచివాలయం,శాఖాధిపతుల కార్యాలయాల్లో కొత్త రాజధానికి తరలి వెళ్లాల్సిన ఉద్యోగుల సంఖ్య 6-7 వేలకు మించదని ఉద్యోగ సంఘాలకు కొత్త లేఖను తెరమీదకు తెచ్చాయి. ఈ కార్యాలయాల్లోని శాంక్షన్ పోస్టుల్లో దాదాపు సగం ఖాళీలున్నాయని, కాంట్రాక్టు-ఔట్సోర్సింగ్ ఉద్యోగులంత కొత్త రాజధానికి తరలివచ్చే అవకాశం లేదని చెబుతున్నాయి. ఈ ఏడాది పదవీ విరమణ చేయనున్న ఉద్యోగులు 10శాతం ఉంటారని ఈంచనా. 15-20 శాతం సిబ్బందిని ఇక్కడే కొనసాగించనున్న దృష్ట్యా..కొత్త రాజధానికి వెళ్లే ఉద్యోగుల సంఖ్య 6-7 వేలకు మించదని చెబుతున్నాయి.

# రాజధానికి మెట్రోరైలు ప్రాజెక్టు పనులు

**రాజధాని ప్రతినిధి (విజయవాడ)** :రాజధాని ప్రాంతంలో వివిధ అభివృద్ధి పనులకు భూములను సమకూర్చుకోవడం ప్రభుత్వానికి తలనొప్పిగా పరిణమించింది. మెట్రోరైలు ప్రాజెక్టు, గన్నవరం విమానాశ్రయం విస్తరణ.ఏలూరు కాల్వదారి మళ్లింపు..ఇలా పలు అభివృద్ధి పనులకు అవసరమైన భూములను ఇచ్చేందుకు రైతులు ససేమిరా అంగీకరించడంలేదు. తా.జాగా కొండపల్లిలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్టీటీపీఎస్) విస్తరణకు సంబంధించి భూసమీకరణకు అధికారులు నానాయాతన పడుతున్నారు. ఈ స్టేషన్లో ప్రస్తుతం 1750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. భవిష్యత్ అవసరాల కోసం 800 మెగావాట్ల విద్యుత్ను ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యుదుత్పత్తి యూనిట్ కోసం 70 ఎకరాల భూమి అవసరం అవుతుందని అధికారులు లెక్కలు తేల్చారు. అయితే విద్యుత్ స్టేషన్ పరిసరాల్లో భూముల ధరల ఇప్పటికే అధికంగా ఉన్నాయి. రాజధాని ప్రకటన నేపథ్యంలో విలువ మరింత పెరిగింది. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం,గుంటుపల్లి పరిసర గ్రామాల్లో ఎకరం రూ.3 కోట్లకు పైగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఒకో ఎకరానికి రూ.90 లకల చెలిసామనడంతో రైతులు తమ భూములను అమ్మడానికి ముందుకు రావడంలేదు. మార్కెట్ విలువ ప్రకారం ఎకరానికి రూ.3 కోట్లు పరిహారంగా చెల్లించాల్సిందేనని వారు మొండికేస్తున్నారు. నదికి ఆవలివైపునే రాజధాని అమరావతి ఉండడంతో తమ భూములకు విలువ పెరిగిందంటున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఇస్తే తాము పూర్తిగా నష్టపోతామని రైతులు ముక్త కంఠంతో చెబుతున్నారు.

## రాజా చెయ్యి వేస్తే ఆడియో పంక్షన్ పోస్టర్ విడుదల



గోడ ప్రతికను విడుదల చేస్తున్న రోహిత్ అభిమాన సంఘం సభ్యులు

**రాజాధాని ప్రతినిధి, విజయవాడ :** నారా రోహిత్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిత్ నటించిన 'రాజా చెయ్యి వేస్తే' సినిమా ఆడియో ఫంక్షన్ పోస్టర్ను అభిమానులు విడుదల చేశారు. వారాహి మూవీస్ పతాకంలో నారా రోహిత్, నందమూరి తారకరత్న ముఖ్య తారాగణంగా నిర్మించిన రాజా చేయి వేస్తే సినిమా ఆడియో ఫంక్షన్ మొగల్రాజ పురం, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్లోని ఓపెన్ గ్రౌండ్ లో జరిగింది.దీనిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నందమూరిబాలకృష్ణ, సాయికొర్రపాటి. ప్రదీప్ అర్బన్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గన్నే వెంకట సత్యన్నారాయణ ప్రసాద్ (అన్నా) రాజా చేయివేస్తే సినిమా ఆడియో పోస్టర్ను ఆవిష్కరించారు. సినిమా ఆడియో ఫంక్షన్కు నారా రోహిత్, నందమూరి అభిమానులు, పార్టీ శ్రేణులు తరలి వచ్చారు.

## సుప్రీంకోర్టు తీర్పు టి.ఆర్.ఎస్.ప్రభుత్వానికి చెంప పెట్టు

**బ్రహ్మం చౌదరి**
రాజధాని ప్రతినిధి,



గంటా శ్రీనివాసరావును సన్మానిస్తున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

**హైదరాబాద్ :** రాష్ట్ర విభజనకు ముందున్న ఉన్నత విద్యా మండలి నిధులను నిధులను 58:42 నిష్పత్తిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పంచుకోవాలని సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇవ్వడం హర్షణీయమని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య (టి.ఎన్.ఎస్.ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.బ్రహ్మంచౌదరి అన్నారు. కోర్టు తీర్పు నేపథ్యంలో బ్రహ్మంచౌదరి ఆధ్వర్యంలో టి.ఎన్.ఎస్.ఎఫ్ నాయకులు గత శనివారం మధ్యాహ్నం సచివాలయంలో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావును కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్.బ్రహ్మంచౌదరి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ముందు నిజానిజాలు ఉంచడంలో మంత్రి గంటా శ్రీనివాసరావు సఫలం అయ్యారని, ఆయన చొరవ వల్లే కేసు గెలవడం సాధ్యమైందన్నారు. విభజన చట్టం పదవ షెడ్యూల్లోని అన్ని సంస్థలకు ఈ నిర్ణయం వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం మరింత శుభపరిణామమన్నారు. దీని వల్ల రాష్టానికి 15 వేల కోట్ల రూపాయలు దక్కే అవకాశం ఉందని, ఇందులో విద్యారంగం వాటానే 2 వేల కోట్లని తెలిపారు. ఈ నిధులతో కొత్త రాష్ట్ర ఏ.పి.ని మరింతగా అభివృద్ధి చేయవచ్చన్నారు. వర్సిటీ విద్యార్థులకు మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు నిధులు ఉపకరిస్తాయని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఇకనైనా దుందుడుకు వైఖరికి స్వస్తి పలికి సుప్రీం తీర్పును అమలు చేయాలని కోరారు. ఇరు రాష్ట్రాల మధ్య మరింత గొడవలకు ఆస్కారం ఇచ్చేలా తెలంగాణ వ్యవహరించడం తగదని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వ ఆంధ్రప్రదేశ్కు న్యాయమైన వాటాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.ఎన్.ఎస్.ఎఫ్. జాతీయ కమిటీ సభ్యులు రాజేష్, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్చార్జి అజయ్, టి.ఎన్.ఎస్.ఎఫ్ నాయకులు జయపాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.39 వేలకే ఐఫోన్ ఎస్ఈ

**ఢిల్లీ :** ఐ ఫోన్ ఎస్ఇని ఏప్రిల్ 8 నుంచి భారత్లో రూ.39,000కే విక్రయిస్తామని యాపిల్ ప్రకటించింది. ఈ నెల 29 నుంచి ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చు. బీటెల్ టెలీటెక్, రెడింగ్టన్ సంస్థలు ఈ స్మార్ట్ఫోన్కు పంపిణీదారులుగా వ్యవహరిస్తాయి. దేశంలోని 3000 విక్రయ శాలల్లో ఐఫోన్ ఎస్ఈ కొనుగోలు చేసుకోవచ్చని రెడింగ్టన్, 3,500 దుకాణాలకు అందిస్తున్నట్లు బీటెల్ టెలిటెక్ వెల్లడించాయి. స్పేస్గ్రే, పసిడి, రజత, రోజ్ గోల్డ్ వర్ణాల్లో ఈ స్మార్ట్ ఫోన్ లభిస్తుంది. తెర చిన్నదే అయినా అధునాత ఫీచర్లతో ఐఫోన్ ఎస్ఈని శక్తిమంతంగా తీర్చిదిద్దామని, ఇది 399 డాలర్ల నుంచి లభిస్తుందని యాపిల్ ప్రకటించింది. అయితే పన్నులు కలిపినా రూ.30 వేలకు అందుబాటులో ఉంటుందని అందరూ భావించినా రూ.39 వేలు ధరగా నిర్ణయించడంతో నిరాశకు చెందుతున్నారు.


## క్లాసిఫైడ్స్

రాజధాని ప్రాంతంలో స్థలాలు, పొలాలు కొనదలచిన, అమ్మాలన్నా సంప్రదించగలరు.
దాదా : 9441754056, రాయపూడి
వి. రవిశంకర్ : 9989360960, విజయవాడ.
ఎస్కె నాగుల్ : 9912192112, తుళ్ళూరు
ఎస్. రామోహనరావు : 8801933160, మందడం.

దాదా మెడికల్ ఫాన్సీ స్టోర్స్
& జిరాక్స్ తీయబడును
సబ్స్టేషన్ సెంటర్, రాయపూడి, రాజధాని ప్రాంతం
కౌసర్ : 9989035143, రాయపూడి.

ఖాజా ఖాదర్ రైస్ & జనరల్ స్టోర్స్
సరసమైన ధరలకు అన్ని కంపెనీల బియ్యం
సబ్స్టేషన్ సెంటర్, రాయపూడి పోస్ట్, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా .
షేక్ జానీ, సెల్ : 9948450791

వివాహ బంధం
అన్ని కులముల, మతముల వారికి పెళ్ళి సంభంధములు చూడబడును.
షేఖ్ జానీ : 9985394613
అయ్యప్పనగర్, విజయవాడ.

REALESTATE

అనంతవరం గ్రామంలో పూలింగ్లో లేనిది, దారి, నీటివసతికల 5 నుంచి 10 ఎకరముల పొలము కావలెను. సంప్రదించండి 9440662699

కంచికచర్ల,దొనబండ ఏరియాలలో 25 ఎకరముల పొలం కావలెను. ఫోన్ : 9676844442

నవ్యాధ్రరాజధాని అమరావతి సీడ్ క్యాపిటల్ రింగులో ల్యాండుపూలింగ్లో ఇచ్చిన జరీబు పొలం 40 సెంట్లు కలదు. సంప్రదించండి 9440662699
Google Co-ordinates
16.561657, 80.476594

రేమండ్ టైలర్స్
మెయిన్ బజారు, తుళ్ళూరు

చంద్రిక ట్రేడర్స్
సిమెంట్, ఐరన్, హార్డ్వేర్, ఎలక్ట్రికల్స్, సానిటరి వేర్ హోల్సేల్ అండ్ రిటేల్
రాయపూడి, తుళ్ళూరు మం. గుంటూరు జిల్లా.
ఫోన్ : 9908073516

కె.జి.ఎన్ కార్ ట్రావెల్స్
24 గంటలు కార్లు సప్లయ్ చేయబడును
ఫోన్ : 97040748420

సన్నిధి వెంకట పున్నారావు ,ఎల్ఐసి ఏజెంట్
కేరాఫ్ వైభవ్ డ్రస్సెస్
బ్యాంక్ రోడ్డు, తుళ్ళూరు
సెల్ నెం. 9848407935


# అమరావతిపై బురద చల్లితే ఊరుకోం

## ఆస్తుల వివరాలు వెల్లడించాలని కె.వి.పి.కి సవాల్

### వర్ల రామయ్య

**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని నిర్మాణంపై అవాకులు చెవాకులు పేలుతూ, అవినీతి బురద చల్లుతూ నిర్మాణాన్ని అడ్డుకోవటానికి ప్రయత్నిస్తే సహించేది లేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ వర్ల రామయ్య హెచ్చరిం చారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాల యంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆత్మగా పేర్కొనబడే కె.వి.పి. ఈ రోజున రాష్ట్ర రాజధాని నిర్మాణాన్ని అడ్డుకోవ టానికి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. స్నేహితుడైన వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్య మంత్రి పదవిని అడ్డు పెట్టుకుని అతని ఆత్మగా చెప్పుకుంటూ వేలకోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించి ఆస్తులు కూడబెట్టుకున్నది నిజం కాదా? అని ఆయన ప్రశ్నించారు. అతని అవినీతి ఎల్లలు దాటి అమెరికా సంయుక్త రాష్ట్రాలకు పాకిందని, అమెరికాకు చెందిన బోట్ల కంపెనీకి రాష్ట్రంలో పనులు ఇప్పిస్తానని చెప్పి వందల కోట్లు దండుకుని ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్.బి.ఐ) దర్యాప్తుకి భయపడి నక్కలా నక్కింది నిజం కాదా? అని ఆరోపించారు. రాష్ట్ర విభజన సమయంలో నూతన రాష్ట్ర నిర్మాణానికి 5 లక్షల కోట్లు అవసరమని చంద్రబాబు వ్యాఖ్యానిస్తే, ఆనాడు రాజ్యసభలో వెకిలి నవ్వులు నవ్విన కె.వి.పి. ఈ రోజున రాజధాని నిర్మాణాన్ని అడ్డుకోవాలని ప్రయత్నించడం ఎంత వరకు సబబు? అని ప్రశ్నించారు. వైఎస్ జగన్తో చీకట్లో చేతులు కలిపి తెలుగుదేశం ప్రభుత్వంపైనా, రాష్ట్ర రాజధాని పైనా అవినీతి బుసలు కొట్టటం సభ్య సమాజం హర్షించదన్నారు.

**నాడు కాకా హోటల్లో.. నేడు ఫైవ్స్టార్ హోటల్లో.**

రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు కాకా హోటల్లో టిఫిన్ చేసే కె.వి.పి., ఈనాడు కోట్లకు పడగలెత్తి ఫైవ్ స్టార్ హోటల్లో మాత్రమే టిఫిన్ చేస్తున్న విషయం నిజం కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని గనుల కేటాయింపులో ప్రధాన పాత్ర పోషించి, ఆ శాఖను తన గుప్పెట్లో పెట్టుకుని వేలకోట్లు అక్రమ మార్గంలో దండుకున్నది నిజం కాదా? ఆనాడు ఎ.పి.ఐ.ఐ.సి.ని నీ జేబు సంస్థగా మార్చుకుని తన ఆప్తులకు వేల ఎకరాలు భూములు అక్రమంగా కట్టబెట్టింది నిజం కాదా? అని నిలదీశారు. కె.వి.పి. కుమారుడు పేరిట హిమాచల్ ప్రదేశ్ తదితర ఉత్తర,ఈశాన్య ప్రాంతాల్లో భారీ విద్యుత్ ప్రాజెక్టులు నెలకొల్పింది నిజం కాదా? అవినీతి సొమ్ముతో ఏర్పాటు చేసినవి ఔనా కాదా? కాకరాపల్లి మేఘవరం ఎనర్జీ విద్యుత్ ప్రాజెక్టులో నీ వాటా ఎంత? ఆ డబ్బు అవినీతి సంపాదన కాదా ? హైదరాబాద్ సమీపంలోని గోపన్నపల్లెలో సర్వే నెం.124,262లలో 250 ఎకరాలు అత్యంత విలువైన భూములు కారుచౌకగా తన కుటుంబ సభ్యుల పేరిట కబళించింది నిజం కాదా? అని ప్రశ్నించారు.

ఆ భూమిలో 130 ఎకరాలు సెజ్కు సరిపోతుందని, మిగతా 120 ఎకరాలు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయటం కోసం రాజశేఖరరెడ్డి వద్ద నుండి అనుమతి సంపాదించింది నిజం కాదా? కోస్తా కారిడార్ ప్రణాళిక ప్రకటించకముందే విషయం తెలిసి కాకినాడ విశాఖపట్నం మధ్య వందల ఎకరాల్లో భూములు కారుచౌకగా కొన్నది నిజం కాదా? అని రామయ్య ప్రశ్నించారు. హైదరాబాద్లో మీరు కొన్న విల్లాల వివరాలు ధైర్యముంటే ప్రకటించండి? ఆ డబ్బెక్కడిదో తెలియజేయండి? 2005లో బీ-37 1262 గజాలు, 2009 అక్టోబర్లో ఎ-72లో 1485 గజాలు, తరువాత ఎ-74లో 1870 గజాలు, చివరిగా ఎ-77లో కొన్న 1416 గజాలు ఎక్కడివి? ఆ సొమ్ము ఎక్కడిది? ఈ రకంగా అవినీతి సొమ్ముతో పాగా వేసిన మీరు రాష్ట్ర ప్రభుత్వంపై, అమరావతి నిర్మాణంపై అవాకులు చెవాకులు పేలటం సరి కాదన్నారు. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు మీ ఆస్తులెంత, ఆయన ముఖ్యమంత్రి అయిన తరువాత మీ ఆస్తులెంతో ధైర్యముంటే రాష్ట్ర ప్రజలకు తెలియజేయండని వర్ల రామయ్య సవాలు విసిరారు.




బ్యాంక్ రుణాలు చెల్లించని

# సంఘాల వివరాలు సేకరిస్తాం : కలెక్టర్




**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** జిల్లాలోని వివిధ బ్యాంకుల నుండి రుణాలు పొంది సక్రమంగా చెల్లించని స్వయం సహాయక సంఘాల జాబితాలను త్వరితగతిన అందించాలని జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి బ్యాంకర్ల సంఘం అధ్యక్షుడు కాంతిలాల్ దండె బ్యాంకర్లు, సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని డి.ఆర్.సి. సమావేశపు మందిరంలో ఆంధ్రా బ్యాంకు (లీడ్ బ్యాంక్) ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణాలను తిరిగి చెల్లించని స్వయం సహాయక సంఘాల నుండి వాటిని వసూలు చేసేందుకు త్వరలో జిల్లా వ్యాప్తంగా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రుణాలు చెల్లించని వారి జాబితాలు అందిస్తే మండల స్థాయిలో తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారులతో కూడిన బృందంతో విచారణ చేయిస్తామని ఆయన వెల్లడించారు. జిల్లాలో 5,000లకు మించి జనాభా ఉన్న గ్రామాలలో బ్యాంకులను ఏర్పాటు చేయవలసి ఉందని, అయితే జిల్లావ్యాప్తంగా ఉన్న 1,011 గ్రామాలకు గాను 88 గ్రామాలలో మాత్రమే బ్యాంక్‌లు లేవని కలెక్టర్ వెల్లడించారు. ఏప్రిల్ నెల 15వ తేదీలోపు ఆయా గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండేలా బ్యాంకింగ్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన పథకం కింద జిల్లాలో 29 శాతం మంది మాత్రమే ఖాతాలు తెరిచారని, అయితే ఖతాదారులు బ్యాంకులతో లావాదేవీలను నిర్వహించడం లేదని తెలిసిందని చెప్పారు. ఖతాదారులందరికీ రూపే కార్డులు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ భద్రతా పథకాలపై ప్రజలలో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. జిల్లాలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. మండల స్థాయిలో జరిగే బ్యాంకర్ల సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకర్లు తప్పనిసరిగా హాజరై ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమీక్షించాలన్నారు. ఆంధ్ర బ్యాంకు గ్రామీణాభివృద్ధి సంస్థకు కావలసిన భవన నిర్మాణానికి అడవితక్కెళ్ల పాడులో తగిన స్థలం కేటాయించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆంధ్రా బ్యాంకు డి.జి.ఎం.సి.ధనుంజయ, ఆర్.బి.ఐ., నాబార్డు ఎ.జి.ఎంలు సి.ఎస్.రంగారావు. డా.బి.వి.భవానీ శంకర్, ఎల్.డి.ఎం.సుదర్శనరావు, వివిధ బ్యాంకుల నియంత్రణాధికారులు, ప్రభుత్వ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా తిరుపతమ్మ కళ్యాణ బ్రహ్మోత్సవాలు



**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** పాతగుంటూరు సుద్దపల్లి డొంకరోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల ఆలయ వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఈ నెల 24న వైభవంగా ప్రారంభమయ్యాయని ఆలయ ధర్మకర్త పొదిల పూర్ణ చంద్రరావు తెలిపారు. ఈ నెల 27వరకు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. శ్రీ లక్ష్మీ తిరుపమ్మ గోపయ్య స్వామివార్ల కళ్యాణ మహోత్సవం 26వ తేదీ రాత్రి గం. 9.13 ని.లకు జరుగుతుందన్నారు. వజనేపల్లి జగద్గురు మధ్వాచార్య సంస్థానం బదరీనారాయణ ఆశ్రమ పీఠాధిపతి పరమహంస వీరభద్రాచార్య శ్రీ నారాయణతీర్థ స్వాముల వారి దివ్య ఆశీస్సులతో... లలితా పీఠ వ్యవస్థాపకులు శ్రీ మేళ్ళచెరువు సుబ్రహ్మణ్య శర్మ పర్యవేక్షణలో ఈ మహోత్సవాలు జరుగుతాయని పూర్ణచంద్రరావు తెలిపారు. గురువారం అంకురార్పణ, సాయంత్రం 4 గంటలకు జలబిందెల ఊరేగింపు కార్యక్రమం, శుక్రవారం పసుపు, కుంకుమ, గంధములతో బండ్ల గ్రామోత్సవం నిర్వహించారు. ఈ నెల 26వ తేదీ కళ్యాణం, 27వ తేదీ మధ్యాహ్నం అన్నదానం, అనంతరం రథోత్సవం తదితర కార్యక్రమాలు జరుగుతాయని పూర్ణచంద్రరావు తెలిపారు. ప్రతి రోజు ఉదయం నుండి రాత్రి వరకు పలు పూజా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో 60 అడుగుల విద్యుత్ ప్రభను ఏర్పాటు చేయడంతో పాటు, ఆలయం, పరిసర ప్రాంతాలతో విద్యుత్ దీపాలంకరణ చేశామని తెలిపారు. వేలాదిగా భక్తులు విచ్చేసే ఈ కార్యక్రమానికి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి, వినుకొండ స్వామి అచలానంద గురూజీ, ధార్మిక మండలి అధ్యక్షులు బొల్లేపల్లి సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, వినుకొండ ఎమ్మెల్యే జి.వి.ఎస్. ఆంజనేయులు, గుంటూరు తూర్పు శాసన సభ్యులు మహమ్మద్ ముస్తఫా, తూర్పు టిడిపి ఇన్‌ఛార్జి మద్దాళి గిరిధర్ తదితర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

# మళ్లీ కరెంట్ షాక్

### చార్జీల పెంపునకు రంగం సిద్ధం

**రాజధాని ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ చార్జీల పెంపునకు రంగం సిద్ధమైంది. త్వరలోనే కొత్త టారిఫ్ ప్రకటించనున్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) ఈ మేరకు చేపట్టిన కసరత్తు దాదాపు పూర్తయింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ప్రజలపై సుమారు రూ.2 వేల కోట్ల అదనపు విద్యుత్ చార్జీల భారం పడే వీలుంది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు పెంచనుండడం ఇది రెండోసారి. 2015-16లో రూ.941 కోట్ల భారాన్ని ప్రభుత్వం మోపింది. టారిఫ్ ప్రతిపాదనల ప్రకారం 2016-17 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు రూ.783 కోట్ల మేరకు చార్జీల పెంపును తొలుత ప్రతిపాదించాయి. అయితే పరోక్ష పద్ధతిలో మరో రూ.1,217 కోట్లు రాబట్టాలని, ఆ తర్వాత నిర్ణయించినట్లు తెలుస్తోంది. 2016-17లో 66,839 మిలియన్ యూనిట్ల విద్యుత్ లభ్యత ఉంటుందని, విద్యుత్ డిమాండ్ 57,565 మిలియన్ యూనిట్లు ఉండొచ్చని డిస్కమ్‌లు అంచనా వేశాయి. అలాగే 9,274 మిలియన్ యూనిట్ల మేర మిగులు విద్యుత్ ఉంటుందని, ఇందులో 7,142 మిలియన్ యూనిట్లను బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తామని తెలిపాయి. మొత్తం మీద 2016-17లో రూ.5,148 కోట్ల మేర ఆర్థిక లోటు ఉంటుందని పేర్కొన్నాయి. ఇందులో రూ.4,365 కోట్లు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ఇస్తుందని, మిగిలిన రూ.783 కోట్లు వినియోగదారుల నుంచి రాబట్టాలని డిస్కమ్‌లు ప్రతిపాదించాయి. అయితే ప్రభుత్వం సబ్సిడీలో భారీగా కోతపెట్టి, కేవలం రూ.3.వేల కోట్లతో సరిపెట్టింది. దీంతో ఆర్థికలోటు ఏకంగా రూ.2,148 కోట్లకు పెరిగింది. కొత్త టారిఫ్ ఖరారు కసరత్తులో భాగంగా ఈఆర్సీ సూచనల నేపథ్యంలో.. వచ్చే ఏడాదిలో ప్రజల నుంచి రూ.2 వేల కోట్లు అదనంగా రాబట్టుకునేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. ఏప్రిల్ 1 నుంచి కొత్త విద్యుత్ చార్జీలు అమల్లోకి రానున్నాయి.

గ్రూపుల్లో విధానంతో దొడ్డిదారిన పెంపు

విద్యుత్ చార్జీలు నేరుగా పెంచితే ప్రభుత్వం అన్నివైపుల నుంచి విమర్శలు ఎదుర్కొవాల్సి వస్తోంది. ఇబ్బడి ముబ్బడిగా ప్రేవేటు విద్యుత్ కొనుగోళ్ళు చేసి, ఈ భారాన్ని తమపై వేస్తున్నారన్న భావన ప్రజల్లో నాటుకుపోయింది. ఇటీవలి ప్రజాభిప్రాయ సేకరణలోనూ ఇదే అభిప్రాయం వ్యక్తమైంది. దీనిని గుర్తించిన విద్యుత్ సంస్థలు దొడ్డిదారిలో జనంపై భారం వేసేందుకు సిద్ధమయ్యాయి. రాష్ట్రంలో ప్రసుత్తం టెలిస్కోపిక్ విధానం అమలులో ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి గ్రూపుల పద్ధతిని తెరమీదకు తెస్తున్నారు. టెలిస్కోపిక్ విధానంలో.. ఓ గృహ వినియోగదారుడు నెలకు 200 యూనిట్లు వాడాలనుకుంటే తొలి 50 యూనిట్లకు యూనిట్‌కు రూ.1.45,51 నుంచి 100 యూనిట్ల వరకు యూనిట్‌కు రూ.2.60,101 నుంచి 200 యూనిట్ల వరకు రూ.3.40 చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రసుత్తం గ్రూపుల విధానాన్ని ప్రవేశపెట్టి ఏడాది విద్యుత్ వినియోగాన్ని ప్రాతిపదికగా తీసుకుని చార్జీలు వసూలు చేయనున్నారు. దీనివల్ల నెలకు 50 యూనిట్లు వరకు విద్యుత్ వినియోగించే(పేదవర్గాలు) వారిపై భారం పడనుంది. అంటే ఏడాదికి సగటున 600 యూనిట్లు వాడే వినియోగదారుడు ఒక్క యూనిట్ ఎక్కువ(601) వాడినా తదుపరి ఏడాది నుంచి ఎక్కువ టారిఫ్(రూ.2.60) లోకి వెళుతుండటంతో ఆ మేరకు నెలసరి బిల్లు భారీగా పెరగనుంది. ఎలాగంటే ప్రస్తుతం నెలకు0-50 యూనిట్ల వాడకానికి రూ.72.50 బిల్లు చెల్లిస్తున్నారు. ఏడాదిలో ఒక్క యూనిట్ ఎక్కువ వాడటం వల్ల ఆ వినియోగదారుడు తదుపరి టారిఫ్‌లోకి వెళ్లి నెలసరి బిల్లు రూ.130 కి కానుంది. అంటే నెలకు అదనంగా రూ.57.50 చెల్లించాల్సి వస్తుందన్నమాట. రాష్ట్రంలో 50 యూనిట్ల వరకు వారేవారి సంఖ్య 1.6 కోట్ల వరకు ఉంది. గ్రూపుల విధానం వల్ల ప్రస్తుత ఏడాదిలో 601 యూనిట్లు అంతకుమించి (తదుపరి గ్రూపు 2,400 యూనిట్లు) విద్యుత్‌ను వినియోగించిన దాదాపు 40 లక్షల మంది పేదవర్గాలపై వచ్చే ఆర్థిక సంవత్సరంలో దొడ్డిదారి విద్యుత్ చార్జీల ప్రభావం పడనుంది.

# పార్టీలోనే నేతలకు సముచిత గుర్తింపు

- పర్వత చిట్టిబాబు సంతాపసభలో దేశం జాతీయ కార్యదర్శి లోకేష్
- శంఖవరంలో కొలువుదీరిన పార్టీ రాష్ట్ర నాయకులు
- పోటెత్తిన అశేషజనవాహిని
- అశ్రునయనాలతో నివాళులు అర్పించిన జిల్లా ప్రజానీకం
- గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు




సంస్మరణ సభలో మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి లోకేష్, పక్కనే ఆశీనులైన వివిధ నాయకులు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష జనవాహిని

**రాజధానిప్రతినిధి, కాకినాడ :** కష్టించి పనిచేసిన ప్రతీ నేతకు సముచిత స్థానం, గుర్తింపు, ప్రాధాన్యత లభించేది ఒక్క తెలుగుదేశం పార్టీలోనే అని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ స్పష్టం చేశారు. శంఖవరం పర్వత కుటుంబీకులు పార్టీకి చేసిన సేవలు ఎనలేనివని, వారికి పార్టీ తరుపున తగిన స్థానం లభిస్తుందని ఆయన అన్నారు. తూర్పు గోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే పర్వత శ్రీసత్యనా రాయణమూర్తి (చిట్టిబాబు) సంస్మరణ సభ తూర్పుగోదావరి జిల్లా శంఖవరంలోని బస్టాండ్ సెంటర్లో బుధవారం నిర్వహించారు. తొలుత చిట్టిబాబు చిత్రపటం వద్ద లోకేష్ నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నేతలు, ప్రజలంతా ప్రార్ధించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ దివంగతనేత చిట్టిబాబుతో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఎటువంటి అపాయింట్‌మెంట్ లేకుండానే తమ ఇంటికి ఆయన వచ్చి వెళ్ళేంత అనుబంధం ఉందని తెలిపారు. తన చిన్నప్పుడు చిట్టిబాబు తనను ఆప్యాయంగా ఎత్తుకుని ముద్దాడేవారన్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ చిట్టిబాబు తమతో సన్నిహిత సంబంధాలను నేరపుతూనే ప్రత్తిపాడు నియోజకవర్గంలోను, అలాగే జిల్లాలోను పార్టీ అభివృద్ధికి ఎనలేని సేవలందించారన్నారు.

ప్రత్తిపాడు, తుని అసెంబ్లీ నియోజకవర్గాలను రెండు కళ్ళుగా భావించి వాటి అభివృద్ధికి చిట్టిబాబు చొరవ చూపేవారని తెలిపారు. ఆయనకు తన వంతు సహకారం అందించానన్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖామాత్యులు, తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు మాట్లాడుతూ దివంగత నేత పర్వత శ్రీసత్యనారాయణమూర్తి మనమధ్య లేరనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని నీటి ప్రాజెక్టుల అభివృద్ధికి కృషి చేయాల్సిందిగా ఆయన కోరేవారన్నారు. నియోజకవర్గ ప్రాజెక్టులను పరిశీలించేందుకు తనను ఆహ్వానించేవారని అయితే పరిశీలనకు అనివార్య కారణాల వల్ల రాలేకపోయానని చెప్పారు. చిట్టిబాబు సేవలు ఎనలేనివని, ఆయన్ని కోల్పోవడం జిల్లా ప్రజానీకానికి తీరని లోటన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, ప్రజలకు చిట్టిబాబు తరుపున రాష్ట్ర పార్టీ అండగా ఉంటుందని, చిట్టిబాబు లేని లోటుని తీరుస్తామన్నారు. కాకినాడ ఎంపి తోట నరసింహం మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజానీకం అధైర్యపడవద్దని, నేను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తాను కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా ఉన్నప్పుడు చిట్టిబాబు తనను కలిసేవారని, పార్టీలకు అతీతంగా ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన నేత చిట్టిబాబు అని శ్లాఘించారు. ఎమ్మెల్సీ బొడ్డు భాస్కరరామారావు, ఎమ్మెల్యేలు ఎస్.వి.ఎస్.ర్మ, గోరంట్ల బుచ్చియ్యచౌదరి, గొల్లపల్లి సూర్యారావు తదితరులు ప్రసంగించారు. తుని నియోజకవర్గ ఇన్‌చార్జ్ యనమల కృష్ణుడు, పార్టీ పరిశీలకులు నాయుడు రామచంద్రరావు, మాజీ శాసనసభ్యురాలు పర్వత బాపనమ్మ, కాంగ్రెస్ పార్టీ నేత పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్, తాండవ సుగర్స్ చైర్మన్ సుర్ల లోవరాజు, రొంగల సూర్యారావు, బద్ది రామారావు, డి.సి.సి.బి చైర్మన్ వరుపుల రాజా, ఎపిఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరి ఆశీర్వాదం, పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు నేతలంతా పర్వత శ్రీసత్యనారాయణమూర్తి తమ్ముడు రాజబాబు, ఆయన సతీమణి జానకి దేవి , రాజబాబు మాతృమూర్తి సీతమ్మలను కలసి తమ ప్రగాఢ సానుబూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. రవాణాకు అంతరాయం లేకుండా ఎక్కడికక్కడ పోలీసులు తగు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

# రాజబాబు నాయకత్వమే శిరోధార్యం

- ప్రత్తిపాడు తెలుగుదేశం సమన్వయ కమిటీ తీర్మానం
- కార్యకర్తలు ఆత్మస్తైర్యాన్ని కోల్పోవద్దని నేతల పిలుపు



సమన్వయకమిటీ సమావేశంలో అభివాదం తెలుపుతున్న రాజబాబు

**రాజధాని ప్రతినిధి, కాకినాడ :** ప్రత్తిపాడు నియోజకవర్గం తెలుగుదేశంపార్టీ ని నడిపెంచేందుకు పర్వత రాజబాబు అనే గుర్రాజు నాయకత్వమే శిరోధార్యమని నియోజకవర్గం 'దేశం' పార్టీ సమన్వయకమిటీ సమావేశం అభిప్రాయపడింది, ఆయనకే పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలను కూడా అప్పగించాలని కోరుతూ సమన్వయ కమిటీ తీర్మానించింది. ఈ మేరకు విషయాన్ని రాష్ట్రపార్టీకి నివేదించాలని నిర్ణయించారు. తొలుత రాజబాబుకు ఇన్‌చార్జ్ బాధ్యతలను రాష్ట్రపార్టీ అధిష్టానం అప్పగించిన తరువాతే నియోజకవర్గంలోని క్రియాశీలక కార్యాచరణను ప్రారంభించాలని కమిటీ తన ఏకాభిప్రాయాన్ని బహిరంగపరచింది. మండల కేంద్రమైన శంఖవరంలోని మాజీ ఎమ్మెల్యే పర్వత బాపనమ్మ స్వగృహంలో శుక్రవారం సాయంత్రం మండలపార్టీ అధ్యక్షుడ బద్ది రామారావు అధ్యక్షతన నియోజకవర్గ సమన్వయ కమిటీ క్రియాశీలక సమావేశాన్ని నిర్వహించారు. పర్వత శ్రీసత్యనారాయణ మూర్తి (చిట్టిబాబు) మరణానంతర పరిణామాల్లో భాగంగా నియోజకవర్గానికే చిట్టిబాబు స్థానంలో ఇన్‌చార్జ్ బాధ్యతలను చేపట్టేందుకు పార్టీయేతర వ్యక్తులు పార్టీలోకి రానున్నారని, వారే పార్టీని ఇన్‌చార్జ్‌లుగా నడిపంచనున్నారని, వారి నేతృత్వంలోనే ఇప్పటివరకు ఉన్న పార్టీ శ్రేణులు పనిచేయాల్సి వస్తుందని జిల్లా వ్యాప్తంగా ఊహాగానాలు మిన్నంటడంతో ఈ సమావేశానికి ప్రత్యేకత సంతరించుకుంది. ఈ నేపద్యంలో పార్టీకి నియోజకవర్గంలో ఇన్‌చార్జ్‌గా ఎవరు నాయకత్వం వహించాలనే అంశంపై సుదీర్గంగా చర్చించారు. ప్రతి ఒక్కరి అభిప్రాయాలను ముఖాముఖిగా తెలుసుకున్నారు. చివరకు రాజబాబునే ఇన్‌చార్జ్‌గా నియమించాలనే ఏకాభిప్రాయానికి వచ్చారు. ఇప్పటికే రాష్ట్రంలో తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తూనే ఉన్న తెలుగుదేశంపార్టీ నేటికి కూడా పార్టీలోకి ఇతర పార్టీల నేతలను ఆహ్వానిస్తున్న విషయం చర్చనీయాంశంగా మారింది. ఈపరిస్థితుల దరిమిలా ప్రత్తిపాడు నియోజకవర్గం 'దేశం' పార్టీలోకి వేరే పార్టీల వ్యక్తిని ఆహ్వానించి, వారికి పార్టీ ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగిస్తే ప్రస్తుతం కార్యకర్తల పరిస్తితి ఏమిటనే అంశంపై తీవ్ర తర్జన భర్జనలు జరిగాయి. నిజానికి వేరే వ్యక్తి పార్టీ ఇన్‌చార్జ్‌గా వస్తే గనుక ప్రభుత్వ పథకాల్లో వారు తమ కార్యకర్తలకు అధికభాగం మేలు చేసుకునే అవకాశం ఉందని, తమకు అంతంతమాత్రమే పథకాలు వర్తించే అవకాశాలు లేకపోలేదని, అంతేకాకుండగా కార్యకర్తలపై అణిచివేత ధోరణి వంటి పరిస్థితులు తలెత్తే అవకాశం లేకపోలేదని పార్టీ సమీక్షించింది. దీనికి ప్రత్యామ్నాయంగా నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ బాధ్యతలను రాజబాబుకు ఇవ్వడమే శ్రేయస్కరం అని సమావేశం నినదించింది. మరోవైపు తెలుగుదేశంపార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, పర్వత కుటుంబానికి తగిన గుర్తింపును ఇస్తూనే వచ్చిందని, పర్వత కుటుంబానికే ఇన్‌చార్జ్‌బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని ఒకింత ధైర్యాన్ని తెచ్చుకున్నారు.

కార్యకర్తలు ఎటువంటి ఆత్మన్యూతనా భావానికి లోనవద్దని, ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని ఈ సందర్బంగా ముఖ్యనేతలు పిలుపునిచ్చారు. రాజబాబుకు పార్టీ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చినపుడే క్రియాశీలకు కార్యాచరణ ప్రారంభించాలని, పార్టీ నిబంధనావళికి అనుగుణంగా కార్యకర్తలంతా క్రమశిక్షణతో ఉండాలని, పార్టీని ఏమాత్రం అనుమానించడం, తూలనాడటం, అనాలోచితంగా మాట్లాడటం వంటి క్రమశిక్షణారాహిత్య చర్యలకు పాల్పడరాదని నేతలు హితవు పలికారు. రాజబాబుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇప్పించేందుకు పార్టీ అదిష్టానంతో మాట్లాడి ఒప్పించడమే ఇపుడు నియోజకవర్గ కార్యకర్తల ముందున్న తక్షణ కర్తవ్యంగా సమన్వయ కమిటీ స్పష్టమైన నిర్ణయానికి వచ్చింది. అనంతరం తనను నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్‌గా నియమించేందుకు సమన్వయ కమిటీ తీర్మానించడం పట్ల రాజబాబు స్పందించి కార్యకర్తలందరికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు దేశంపార్టీ అధికార ప్రతినిధి పర్వత సురేష్, కిర్లంపూడి మార్కెట్‌యార్డు చైర్మన్ కొమ్ముల కన్నబాబు, శంఖవరం సొసైటీ అధ్యక్షుడు యామన సురేష్, ఏలేశ్వరం నగరపంచాయితీ వైస్‌చైర్మన్ పైలా సత్యనారాయణ, రౌతులపూడి ఎంపిపి, జడ్‌పిటిసిలు ఇటంశెట్టి సూర్యబాస్కరావు, చెన్నాడ సత్తిబాబు, వెన్నా ఈశ్వరుడు(శివ) తదితరులు పాల్గొన్నారు.

# మీ ఆరోగ్యం - మీ చేతుల్లో

## ఆరోగ్యం ఎలా వస్తుంది?




డా॥ మంతెన సత్యనారాయణ రాజు

ఆరోగ్యం అంటే ? ఏ రోగం లేకుండా ఉండడాన్నే ఆరోగ్యం అని అనుకుంటున్నాము. కానీ అది వాస్తవంకాదు. ఏ రోగం ఇప్పుడు లేకపోయినా, వైద్య పరీక్షలలో దొరకకపోయినా ఇంకొక 4, 5 నెలలు పోయిన తరువాత మరలా పరీక్షిస్తే ఏదో ఒక రోగం బయటపడిదంటే లోపల పుట్టిన రోగం పరీక్షలకు దొరికే స్థితికి వచ్చిందని అర్థం చేసుకోవచ్చు. ఇంకా కొన్ని రోజులలో అది పూర్తి రోగం రూపంలో బయటకు రాకపోయినా వచ్చే గుణం లోపల ఉంటే దానిని ఆరోగ్యం అనవచ్చా? రోగం పునాదుల్లో ఉన్నా దానిని ఆరోగ్యం అని అనకూడదు. ప్రస్తుతం ఏ రోగం లేకుండా ఉండి దానితోపాటు మనలో ఏ రోగం రాకుండా ఉండే స్థితి కూడా ఉంటే దానిని ఆరోగ్యం అని అనుకోవచ్చు. శరీరంలో ప్రతి కణము, ప్రతి అవయవం అది ఎంతవరకు పనిచేయగలదో అంత శక్తివంతంగా పని చేస్తూ మిగతా అవయవాలతో సహకరిస్తూ శరీరాన్ని సుఖంగా ఉండేలా నడిపిస్తే ఆ శరీరం ఆరోగ్యంగా ఉన్నట్లు. శరీరం ఆరోగ్యంగా ఉన్నదని చెప్పడానికి బాహ్యంగా కొన్ని లక్షణాల ద్వారా మనం అంచనా వేసుకోవచ్చు. అవి ఏమిటంటే పరిశుభ్రంగా, కాంతిగా ఉండే చర్మం, మెరిసే కళ్ళు (కాంతవంతముగా) ఎముకలను కప్పి ఉంచిన బలమైన కండరాలు, తియ్యటి శ్వాస, మంచి ఆకలి, ప్రశాంతమైన నిద్ర, మల మూత్రాదులు ఏ రోజుకారోజు బయటకు వెళ్ళిపోవడం, నోరు, పాచి, లాలాజలం, మలం, మూత్రం, చెమట మొ॥నవి పూర్తిగా వాసన రాకుండా ఉండడం, కాళ్ళు, చేతులు మొదలైన అవయవాలు ఇబ్బంది లేకుండా కదలడం మొ॥నవి. ఇలా ఉంటే శరీరం ఆరోగ్యముగా ఉన్నదని అర్థము. ఒక్క శారీరక ఆరోగ్యము మాత్రమే సరిపోతుందా? మనిషికి తప్ప మిగతా జీవులన్నింటికి అది సరిపోతుంది. ఆ జీవులకు ఒక్క శరీరము ఆరోగ్యముగా ఉంటే జీవితము హాయిగా గడిచిపోతుంది. మనిషికి మనసంటూ ఒకటి ఉంది కాబట్టి దాని ఆరోగ్యం కూడా శరీర ఆరోగ్యంతోపాటు అవసరమౌతుంది. ఆరోగ్యవంతమైన శరీరంతోపాటు, ఆరోగ్యవంతమైన మనసు ఉంటే ఆ వ్యక్తి పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నట్లని చెప్పవచ్చు. శరీర ఆరోగ్యాన్ని లెక్కలు వేయడానికి పరికరాలు ఉన్నాయి. కాని మానసికమైన ఆరోగ్యాన్ని తెలియజేయడానికి ఎలాంటి పరికరాలు కనిపెట్టలేదు. ఒక వ్యక్తి మానసికంగా ఆరోగ్యంగా ఉన్నాడు. అనడానికి కొన్ని లక్షణాలను వైద్యశాస్త్ర పరంగా ప్రామాణికంగా తీసుకుంటారు. అవి ముఖ్యంగా మానసికంగా ఎలంటి సంఘర్షణ లేకపోవడం, పరిస్థితులకు సర్దుకుని పోయేతత్వం కలిగి ఉండడం, ఆత్మనిగ్రహం కలిగి ఉండడం మొ॥నవి ముఖ్యంగా చెప్పుకోవచ్చు. ఈ రెండింట్లో ఆరోగ్యం గురించి చెప్పుకునేటప్పుడు మనం శరీరం గురించే ముఖ్యంగా చెప్పుకోవడం జరుగుతుంది. శరీరము ఎక్కువగా రోగాలపాలు అవుతూ ఉంటుంది. కాబట్టి అలాగే మనసుకి, శరీరానికి అవినాభావ సంబంధం ఉంది. మనస్సు ఆరోగ్యంగా లేకపోతే దాని ప్రభావం శరీరంపై తప్పనిసరిగా పడుతుంది. శరీరము ఆరోగ్యముగా ఉంటేనే మనసు కూడా ప్రశాంతముగా ఉంటుంది. అందుచేత ముందు శరీరాన్ని బాగుచేసుకునే ప్రయత్నం చేసి తర్వాత మిగతావాటి సంగతి చూడాలి. శారీరక ఆరోగ్యాన్ని డాక్టరు పాత్ర ఎంత? వైద్య విధానాల పాత్ర ఎంత? అసలు ఆరోగ్యం ఏమి చేస్తే వస్తుంది. ఇలాంటి విషయాలను ముందుగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

> శరీరంలో ప్రతి కణము, ప్రతి అవయవం అది ఎంతవరకు పనిచేయగలదో అంత శక్తివంతంగా పని చేస్తూ మిగతా అవయవాలతో సహకరిస్తూ శరీరాన్ని సుఖంగా ఉండేలా నడిపిస్తే ఆ శరీరం ఆరోగ్యంగా ఉన్నట్లు.

ఆరోగ్యంపై మనస్సు ప్రభావం

ప్రతి ఇంట్లో భర్త, భార్య మీద కోప్పడడం, తల్లి పిల్లలని కోప్పడడం సర్వసాధారణమైన విషయమైపోయింది. కోపాలు, చిరాకులు లేని ఇల్లు వెతికినా దొరకడం కష్టంగా ఉంది. అలాగే బయటకు వెళ్తే చాలు ఎదురింటి వాళ్ళ, పక్కంటివాళ్ళు పోట్లాడుకుంటూ కనిపిస్తారు. ఆఫీసులలో చూస్తే బాస్‌లు కిందవారిపై అరుస్తూ ఉంటారు. వర్కర్స్ ఒకరికొకరు పడక అరుచుకుంటూ ఉంటారు. ఈ విధంగా కోపతాపాలనేవి మనిషికి లక్షణాలుగా మారిపోయినవ. మనిషిని చూస్తే భయం వేస్తుంది కాబట్టి, ఆ భయంతో వారు ఏది చెబితే అది ఎదుటి వాళ్ళు చేస్తూ ఉంటారు. కోపంతో తాత్కాలికంగా ప్రయోజనం పొందవచ్చేమో కాని దాని వలన అనేక దుష్ఫలితాలు కలుగుతాయి. మన కోపం ఎదుటి వారిని భయపెట్టడం, బాధపెట్టడమే కాకుండా స్వయంగా మనకి ఎంతో నష్టాన్ని కలుగుజేస్తుంది.

# విద్యార్థులకు క్రీడలు అవసరం

**రాజధాని, ప్రతినిధి, విజయవాడ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు క్రీడలు అవసరమని శాప్ డైరెక్టర్ బండారు హనుమంతరావు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శారీరక అక్షరాస్యత సదస్సు నివేదిక ఆధారంగా విద్యా శాఖలు క్రీడా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో క్రీడల్లో విద్యార్థులు పాల్గొనే విధంగా వారిలో చురుకుదనాన్ని, శారీరక ప్రమాణాలను గుర్తించాలని తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాల స్థాయి నుంచే వివిధ క్రీడాంశాలలో ప్రవేశం కల్పించాలని సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో 2016-17 విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే క్రీడలు ఆడించే విధంగా స్పోర్ట్స్ అథారిటీ, విద్యా శాఖలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విద్యా సంస్థకు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం తప్పనిసరిగా క్రీడా మైదానాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నత అధికారులకు ఆదేశాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శారీరక అక్షరాస్యత సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల క్రీడా నిపుణులు వారి దేశాల్లో విద్యార్థులకు ప్రాథమిక స్థాయి (6వ సంవత్సరం) నుంచే వారికి క్రీడలపై ఆసక్తి కల్పించి పాఠ్యాంశాల్లో వ్యాయామ విద్యను తప్పనిసరి చేయడం వల్ల వారు క్రీడల్లో రాణిస్తున్నట్లు శాస్త్రీయంగా



శాప్ డైరెక్టర్ బండారు హనుమంతరావు

వెల్లడైందని హనుమంతరావు తెలిపారు. మన దేశంలో క్రీడా పోటీల్లో పాల్గొనే అవకాశం 12వ సంవత్సరం నుండి ఉన్నందున వారికంటే 6 సంవత్సరాలు తరువాత వ్యాయామ కార్యక్రమాలను ప్రారంభమవుతున్నట్లు గుర్తించారు. దీని వలన క్రీడల్లో వెనుకబడటాన్ని గమనించి ప్రతి విద్యార్థికి బాల్య దశ నుంచే శారీరక వ్యాయామం తప్పనిసరి అనే అభిప్రాయాన్ని కెనడాకు చెందిన రిచర్డ్ వే బృందం, సదస్సు కన్వీనర్ పుల్లెల గోపీచంద్ వ్యక్తం చేశారని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం క్రీడలకు బడ్జెట్ కేటాయింపులను 215 కోట్లకు పెంచి శారీరక అక్షరాస్యత కార్యక్రమానికి ప్రచారం కల్పించే విధంగా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. క్రీడలపై మక్కువ కలిగిన వారిని గుర్తించి ప్రతి నియోజకవర్గానికి ఒక స్పోర్ట్స్ పాఠశాల, ప్రతి జిల్లాలో ఒక క్లస్టర్ స్పోర్ట్స్ పాఠశాల, రాష్ట్రంలో మూడు ప్రాంతీయ స్పోర్ట్స్ అకాడమీలు, అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన క్రీడామౌలిక సదుపాయాలను సమకూర్చి వాటిని సద్వినియోగం చేసుకునేందుకు శారీరక అక్షరాస్యత కార్యక్రమం దీర్ఘకాలిక క్రీడా ప్రణాళికలో పొందుపరుస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా, మండల స్థాయిల్లో స్పోర్ట్ అథారిటీ, విద్యా శాఖలు సంయుక్తంగా వ్యాయామ ఉపాధ్యాయులకు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రత్యేక శారీరక అక్షరాస్యత సదస్సులను నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శారీరక అక్షరాస్యత అంశం ప్రాధాన్యతను గుర్తించి, క్రీడలు, విద్య, వైద్య, పంచాయితీ, మున్సిపల్ శాఖల మంత్రులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి క్రీడా విధానం పటిష్టంగా అమలయ్యేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో జరుగనున్న జిల్లా స్థాయి శారీరక అక్షరాస్యత సదస్సుకు దేశంలోని క్రీడా ప్రముఖులను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. వ్యాయామ విద్య పాఠ్యాంశంగా చేర్చేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని హనుమంతరావు పేర్కొన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ క్రీడా శిక్షకులను శారీరక అక్షరాస్యత కార్యక్రమంలో భాగస్వామ్యం చేసేందుకు శాప్ చైర్మన్ పి.ఆర్. మోహన్ విశేషంగా కృషి చేస్తున్నారని శాప్ డైరెక్టర్ తెలిపారు.


## త్యాగానికి ప్రతిరూపమే మంచి శుక్రవారం



వీధుల్లో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

**రాజధాని ప్రతినిధి -కాకినాడ :** మహోన్నత వ్యక్తిత్వం ఉన్న త్యాగశీలి ఏసుక్రీస్తు పాపులను రక్షించడానికి తన ప్రాణాన్ని ఫణంగా పెట్టిన సుదినమే మంచి శుక్రవారం(గుడ్‌ఫ్రైడే) అని క్రీస్తు శిలువ ధ్యానం ద్వారా నేర్చుకోవలసిన అంశమని క్రైస్తవ ఫాదర్లు ఉద్బోధించారు. జిల్లాలోని వందలాది క్రైస్తవ దేవాలయాల్లో గుడ్‌ఫ్రైడే మహోత్సవాన్ని శుక్రవారం పవిత్రంగా నిర్వహించారు. క్రైస్తవ సమాజానికి ప్రేమ , త్యాగం, నిరీక్షణ, క్షమాపణ అనే నాలుగు అంశాలు మూలస్తంభాలు వంటివని వీటిని మానవాళి రక్షణార్థం క్రియారూపకంగా ఆచరించి చూపించి మానవాళి స్వర్గప్రయాణానికి మార్గనిర్దేశనం చేసిన ఆదర్శమూర్తి గుడ్ సమరిటన్ క్రీస్తు అని ఫాదర్లు కొనియాడారు. ఎరుసలేం పట్నంలో గొల్‌గొతా కొండపై 2016 సంవత్సరాల క్రితమే క్రీస్తును శిలువ వేసినపుడు శిలువధ్యానంలో భాగంగా ఏసుప్రభువు తన తండ్రయిన యోహోవా దేవున్ని స్తుతిస్తూ, మానవాళి విముక్తి నిమిత్తం పలికిన ఏడు మాటలను సంఘాలలో నెమరువేసుకోవడం ద్వారా రక్షణ నిమిత్తం క్రైస్తవులు అనుసరించాల్సిన విదివిధానాలపై ఫాదర్లు సంఘస్తులకు వివరించారు. ఈ ఉపవాస ప్రార్థన అనంతరం సంఘాలలో సభ్యులు ఉపవాస ఉపసంహారణకు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

# పక్వానికి రాని పండ్లతో రోగాలు



- కార్బైడ్ పండ్లతో ఉదరకోశ వ్యాధులు, కడుపులో పుండ్లు
- వ్యాపారులు ఉగ్రవాదుల కన్నా ప్రమాదకారులన్న హైకోర్టు
- పట్టించుకోని ఆహార కల్తీ నిరోధక శాఖ
- లైసెన్సులు లేని 75 శాతం పండ్ల వ్యాపారులు

**రాజధాని ప్రతినిధి :**'ఫలాల్లో రాజు' మామిడి. మామిడి పండ్ల సీజన్ దేశం వ్యాప్తంగా మరోవారం రోజుల్లో ప్రారంభం కానుంది. అన్ని వర్గాల ప్రజలు నోరూ ఊరేలా రకరకాల మామిడి కాయలను మాగ పెట్టడంలో పండ్ల వ్యాపారులు రసాయనాలను వినియోగిస్తుండడం గత కొన్ని సంవత్స రాలుగా యధేచ్ఛగా సాగుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో మామిడి పండ్ల వ్యాపారానికి విజయవాడ, హైదరాబాద్, ఏలూరు, నూజివీడు, రాజమండ్రి, గుంటూరు, చిత్తూరు, వరంగల్ ఇట్లా అనేక ప్రాంతాలకు పెట్టింది పేరు. చిన్న రసాలు, పెద్ద రసాలు, బంగినపల్లి, తోతాపూరి, మొగల్తూరు మామిడి, ముంత మామిడి, చెరుకు రసాలంటే ప్రజలు మక్కువ పడతారు. వేసవి కాలమంతా గ్రామ గ్రామాన రాష్ట్ర వ్యాప్తంగా మామిడిపండ్ల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. ఈ నేపథ్యంలో దీన్ని అదునుగా చేసుకుని మామిడికాయలతోపాటు గాలులకు రాలిపడిన మామిడినీ సొమ్ము చేసుకునేందుకు వ్యాపారులు కార్బైడ్‌ను ఉపయోగిస్తున్నారు. ఈ విధానం అక్కడా ఇక్కడా అని కాకుండా అన్ని జిల్లాలకు విస్తరించింది.

కార్బైడ్ వినియోగించి మాగపెట్టిన మామిడిపండ్లను తినడం వల్ల గ్యాస్‌కు సంబంధిత ఉదర కోశ వ్యాధులు సంభ విస్తున్నాయి. కడుపులో పుండ్లు కూడా ఏర్పాడుతున్నాయని వైద్య శాస్త్ర నిపుణులు హెచ్చరిస్తున్నారు. పైకి మాత్రం రసాయన ప్రభావంతో మామిడిపండ్లు నిగనిగలాడుతూ మంచి రంగు తేలి ఉంటాయి. లోపల పచ్చిగానే ఉంటాయి. రసాయనాల విషం పండ్లలో దాగి ఉంటుంది. కార్బైడ్ వినియోగించి కృత్రిమంగా మామిడిపండ్లను మాగపెట్టిన వ్యాపారులకు ఏడాది నుంచి ఆరు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తారు. అంతే కాకుండా పండ్ల వ్యాపారులపై కేసులు పెట్టాల్సిన ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో పండ్ల వ్యాపారులు విచ్చలవిడిగా పక్వాని రాని కాయలను రసాయనాల ద్వారా మాగబెట్టి మంచి రంగు తెప్పించి మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తూ డబ్బు దండుకుంటున్నారు. కార్బైడ్ పండ్ల దుకాణాలపై ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు దాడులు చేసిన సంఘటనలు కనబడవు. గతంలో పక్వానికి వచ్చిన కాయాలను చెట్ల నుండి కోసి మాగపెట్టేవారు. సాంబ్రాణి పొగ, పీచు పొగతో మరో విధానంలో మాగపెట్టేవారు. కార్పొరేట్ సంస్థలు మామిడి పండ్ల వ్యాపారం లోకి దిగిన తరువాత రసాయనాలతో మామిడిని కృత్రిమంగా పండ్లుగా మారుస్తున్నారు. ఇది ప్రజారోగ్యానికి భంగకరం. ఇథలిన్ గ్యాస్ ఛాంబర్స్ ద్వారా మామిడికాయలను పండ్లుగా మార్చవచ్చు. ఇలా మారిన పండ్లు ఆరోగ్యానికి హానికరం కాదని కల్తీ నిరోధక శాఖ వారే చెబుతున్నారు. ఈ పద్ధతిని సైతం వ్యాపారులు అనుసరించడం లేదు. 'పండ్లను మాగపెట్టడంతో కార్బైడ్‌ను ఉపయోగించే వ్యాపారులు ఉగ్రవాదులకన్నా ప్రమాదకారులు' అని హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. ఇంత స్పష్టంగా న్యాయస్థానం చెప్పినా ఆహార కల్తీని అరికట్టడానికి ఆ శాఖ అధికారులు తీసుకున్న చర్యలు కొన్ని చోట్ల నామమాత్రంగా ఉంటే, కొన్నిచోట్ల శూన్య హస్తాలు చూపిస్తున్నాయి. మామిడికాయలే కాదు, అరటి, బొప్పాయి, సపోట, మొదలగు కాయలను పండ్లుగా మార్చడానికి వ్యాపారులు కాల్షియం కార్బైడ్‌ను వాడుతున్నారు. అరటి కాయలను మగ్గబెట్టడంలో మొక్కల పెరుగుదలకు ఉపయోగించే ఎథిపాన్ ద్రావణాన్ని వాడుతున్నట్లు సమాచారం. ఈ ద్రావణం వేయడానే కాయలు రంగు మారి మాగినట్లు పండ్లుగా కనిపిస్తాయి. అయితే ఎథిపాన్ ద్రావణం విషతుల్యమని తేలిపోయింది. ఒక్క పశ్చిమ గోదావరి జిల్లాలోనే సీజన్ బట్టి అన్నిరకాల పండ్ల వ్యాపారం చేసే వారు 4500 మంది ఉన్నారని అంచనా. వీరు కాక ఏలూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకులో మొత్తం 110 దాకా హూల్‌సేల్ పండ్ల దుకాణాలు ఉన్నాయి.

ఈ పండ్ల వ్యాపారాలు చేసే వారిలో 80 శాతం మందికి లైసెన్సులు కూడా లేవు. ఒక్క పశ్చిమ గోదావరి జిల్లాలోనే ప్రతీ రోజూ 2 కోట్ల రూపాయలకు పైగా పండ్ల వ్యాపారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో కార్బైడ్‌తో పండ్లు మాగపెట్టుతున్న వ్యాపారులపై ఇప్పటికైనా ఆహార కల్తీ నిరోధక అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉంది.

## జెపి వైఫల్యం నుండి

# పవన్ నేర్చుకోవాల్సిన పాఠాలు..

- బలమైన కేడర్
- ఎవరికి ఏ పని అప్పగించాలి?
- నిర్ణయాల్లో నిలకడ
- జనంతో కలిసిపోవాలి
- మీడియా అండ
- టీం వర్క్ కావాలి
- మనుఘుల్ని నమ్మడం
- వెన్ను తట్టి ప్రోత్సహించడం



నరేష్ శిరమణి



జయప్రకాష్ నారాయణ్

**ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాల్లో లోక్‌సత్తా అధ్యాయం ముగిసింది. 2006 అక్టోబర్ 2న "కొత్తతరానికి కొత్త రాజకీయం" అనే నినాదంతో లోక్ సత్తా పార్టీని ప్రారంభించింది. జయప్రకాష్ నారాయణ్ పదేళ్ళ తర్వాత, నిన్న ఎన్నికల బరి నుండి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. ఐఏఎస్ అధికారిగా అత్యంత విజయవంతమైన జెపి, ఒక రాజకీయనాయుకుడిగా మాత్రం విఫలం అయ్యారు. మరో వైపు, జనసేన పార్టీ స్థాపించిన పవన్‌కళ్యాన్ 2019 లో జరిగే లోక్‌సభ అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో లోక్ సత్తా వైఫల్యం నుండి పవన్ కల్యాణ్ నేర్చు కోవాల్సిన పాఠాలు ఏంటి? 1996లో జయప్రకాశ్ నారాయణ్ ఐఏఎస్ కు రాజీనామా చేసి ఉద్యమబాట పట్టినప్పటి నుండి ఇప్పటిదాకా అంటే 20 ఏళ్ళు ఆయనతో కలసి పనిచేసిన వ్యక్తిగా, ఆయన్ని అతి దగ్గర నుండి చూసిన వ్యక్తిగా నా అభిప్రాయాల్ని కోరగా పాఠకుల ముందు ఉంచుతున్నాను. ఒక రాజకీయ పార్టీగా లోక్ సత్తా విఫలం కావడంలో, 50% పరిస్థితులు ప్రభావం ఉంటె, 50% జెపి స్వయంకృతం. దేశం మీద ప్రేమ, నిజాయితీ ఈ రెండిటి విషయంలో జెపిని వేలెత్తి చూపడం సూర్యుడిపైకి ఉమ్మి వేయడం లాంటిదే. ఒక లీడర్‌గా జెపిలో చాలా లోపాలు ఉన్నాయి. ఆయన చాలా పొరపాట్లు చేశారు.**

**బలమైన కేడర్**

లోక్ సత్తాకి బలమైన కేడర్ లేకపోవడం పెద్ద మైనస్. లోక్ సత్తా ఉద్యమ వ్యవస్థగా ఉన్నప్పుడు రాష్ట్రంలోని అన్ని నగరాలు, మున్సిపాలిటీలలో, 50% మండలాలలో, 2000 గ్రామాల్లో లోక్ సత్తా శాఖలు ఉండేవి. వీటిని ఉపయోగించుకుని పార్టీనీ కేడర్ నిర్మాణం చేసుకోకుండా, హడావిడిగా రాజకీయ పార్టీని ప్రారంభించారు. డబ్బు లేకుండా రాజకీయం అనేటప్పటికి, అది సాధ్యం కాదు అనే భావనతో జనాల్లో కదలిక రాలేదు. ఇప్పుడు పవన్‌కి అన్ని గ్రామాల్లో అభిమానులు ఉండే ఉంటారు. అయితే అభిమానులు వేరు, రాజకీయ కార్యకర్తలు వేరు. అభిమానులు చేసే పనులు వేరు. రాజకీయ కార్యకర్తలు చేయాల్సిన పనులు వేరు. పవన్ తన అభిమానుల్ని కేడర్‌గా మార్చు కోవాలంటే, 2019 నాటికి వారిని సిద్ధం చేయాలంటే, వారికి ఇప్పటి నుండే రాజకీయ శిక్షణ, అనుభవం కోసం చిన్న చిన్న కార్యక్రమాలు అప్పగించడం అవసరం.

**ఎవరికి ఏ పని అప్పగించాలి?**

లోక్ సత్తాకు అతిపెద్ద మైనస్ పాయింట్ ఒక నాయకత్వం బృందం లేకపోవడం. లోక్ సత్తా పార్టీ ప్రారంభించినప్పుడు మంచి నాయకులు పార్టీలో చేరారు. కాని వారిని ఉపయోగించుకోవడంలో జెపి విఫలం అయ్యారు. ఎవరు ఏపనికి ఉపయోగపడతారు అనే అంచనా వేయడంలో జెపిది. పూరెస్ట్ రికార్డ్. ఉదాహరణకి డా. మిత్రా లోక్‌సత్తాలో చేరారు. ఆయన హైదరాబాద్ స్థాయిలో నెట్ వర్కింగ్ చేయగలరు, మంచి అధికారప్రతినిధిగా వ్యవహరించగలరు. ప్రజలతో, కేడర్‌తో డీల్ చేయడం ఆయనకు రాదు. అలాంటి వ్యక్తిని తీసుకెళ్ళి సంస్థాగత వ్యవహారాలు చూడమని చెప్పారు. ఆయన ఏ జిల్లాకి వెళ్లినా జెపికి కంప్లైంట్స్ వచ్చేవి, దీంతో మిత్రా మీద జెపి కోప్పడ్డారు, దాంతో ఆయన అలిగి ప్రజారాజ్యంలోకి వెళ్ళారు. జెపి కనుక, మిత్రా చేయగల్గిన పనులు మాత్రమే అప్పగించి ప్రోత్సహిస్తే ఆయన ఒక పెద్ద అసెట్ అయ్యేవారు. జెపి చేసిన ఇంకో పెద్ద తప్పు ఎంటంటే.. ఆయన దగ్గరకి రకరకాల భావజాలాలు, ఆలోచనలు ఉన్న వ్యక్తులు వచ్చారు. అందరూ వారివారి రంగాలలో కాస్త పేరున్న వారే. వీరు పార్టీని ఒక్కొకరు ఒక్కొక లాగా నడపమని జెపికి సలహాలు ఇచ్చేవారు. వీరందర్నీ కలిపి కూర్చొబెట్టి, ఒకతాటి మీదకు తీసుకొచ్చి పార్టీకి ఒక డైరెక్షన్ చూపించే పని జెపి ఎప్పుడూ చేయలేదు. ఎప్పుడు ఎవరిమాట నచ్చితే అలా చేసేవారు. దీనికి పరాకాష్ట ఏంటంటే.. ఒక అమ్మాయిని వేధించాడు అనే కేసు ఎదుర్కొంటున్న, మానసిక స్థితి సరిగా లేని ఓ వ్యక్తి పార్టీలో జెపి తర్వాత అన్నీ తానే అయి మూడు నెలలు పార్టీని నడిపాడు. ఆఖరికి ఆ వ్యక్తి తల్లితండ్రులు వచ్చి జెపితో మావాడికి కాస్త మెంటల్ అని చెప్పి, అతన్ని తీసుకెళ్లారు. ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్ అంటే తెలియని, తెలుగు రాని ఒక ఎన్నారై లోక్‌సత్తాకి కమ్యూనికేషన్ హెడ్‌గా పనిచేశాడు. ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు. పార్టీలో జెపి వేసిన కమిటీల లిస్టు చూస్తె గిన్నిస్ రికార్డు ఖాయం. అంతమందిని ఆయన మార్చేవారు. ఒక దీర్ఘకాలిక లక్ష్యం చేరాలి. అంటే నమ్మకమైన టీం ఉండాలి. ఆ టీం సభ్యుల బలాబలాలు నాయకుడికి స్పష్టంగా అర్థం కావాలి. ఎంత చేసిన ఒక్కొకసారి వైఫల్యం రావొచ్చు. దాన్ని సమీక్ష చేసుకుని, ఎవరు ఎలా పనిచేస్తారు, పని చేసేవారెవరు, కబుర్లు చెప్పి షో చేసే వాళ్ళెవరు అనే అంచనాకి రావాలి. లోక్ సత్తా పార్టీ పదేళ్ళ ప్రస్థానంలో ఒక్కసారి కూడా జెపి ఇలాంటి సమీక్ష చేయలేదు. పవన్ కల్యాణ్ దగ్గరకి, ఇలా కబుర్లు చెప్పే వాళ్ళు, షో ,చేసే వాళ్ళు, ఇంకా భారీసంఖ్యలో వస్తారు. అలాంటి వారిని కనిపెట్టి, పనిచేసేవారెవరు, షో చేసే వారెవరో తెలుసుకునే సిస్టమ్ ఉండాలి.

**నిర్ణయాల్లో నిలకడ**

ఒక దీర్ఘకాలిక లక్షాన్ని పెట్టుకుని పనిచేసేటప్పుడు, నిలకడైన నిర్ణయాలు ఉండాలి. లక్ష్యం ఎంత స్పష్టంగా ఉంటుందో, మార్గం కూడా అంత స్పష్టంగా ఉండాలి. జెపికి తన మార్గం మీద ఎప్పుడూ నిలకడ లేదు. లోక్ సత్తా ఉద్యమ సంస్థ ద్వారా కొన్నాళ్ళు అడ్వోకసీ ద్వారా మార్పులు తేవాలని. ప్రయత్నం చేశారు. దేశంలో మరో వ్యక్తి, సంస్థ సాధించలేనన్ని చట్టాలు, రాజ్యాంగ సవరణలు తెచ్చారు. అయితే ఇవి జనానికి అర్థం అయ్యేవి కాదు. ఫలితాలు ప్రజలకు నేరుగా అందేవి కావు. అధికారం లేదా, గణనీయమైన ఓట్ల శాతం సాధించి దేశాన్ని మార్చాలనుకున్న ఆయన, ఆ దిశగా నిలకడ అయిన కృషి చేయలేదు. ఇక పవన్‌కి కూడా నిలకడ తక్కువ అని పేరు. రాజకీయాల్లో ఇది ఎంతమాత్రం పనికిరాదు. ఒకసారి బరిలో దిగితే. లక్ష్యంగా దూసుకుపోవాలి తప్ప, ఆ పార్టీ వాళ్ళు ఏమనుకుంటారు. ఈ పార్టీ వాళ్ళు ఫీలవుతారు. అని లెక్కలేసుకోకూడదు.

**జనంతో కలిసిపోవాలి**

జెపికి మనసులో జనం మీద అంతులేని ప్రేమ ఉన్నా, దాన్ని ఆయన వ్యక్తం చేయలేరు. పుస్తకాలు చదవడం. రాయడం, చర్చించడం మీద ఉన్న శ్రద్ధ, ఫీల్డ్ కార్యక్రమాల మీద ఉండదు. పదేళ్ళ పార్టీ ప్రస్థానంలో ఆయనంతట ఆయన ప్రజల్లోకి వెళ్ళే కార్యక్రమం ఒక్కటంటే ఒక్కటి కూడా తీసుకోలేదు. ఉదాహరణకి, మేము రంగారెడ్డి జిల్లా వికారాబాద్‌లో ఆవిర్భావసభ పెట్టి జెపిని పిలిచాము. ఒక రాజకీయ నాయుకుడు తొలిసారి ఒక జిల్లాకి వెళితే అక్కడున్న ప్రజలతో, ప్రముఖులతో మాట్లాడి, ఆ జిల్లా సమస్యలు తెలుసుకుని, వాళ్ళతో కలిసి భోజనం చేసి వెళ్తారు. కాని జెపి వచ్చారు. ఉపన్యాసం చెప్పి వెళ్ళిపోయారు. జెపి పర్యటన చూసిన ఓ ప్రముఖుడు, ఇది కలెక్టర్ మీటింగ్‌ల ఉంది కానీ, పొలిటీషియన్ మీటింగ్‌లా లేదు అని వ్యాఖ్యానించారు...2009 ఎన్నికల ముందు అయితే, తాను ముఖ్యమంత్రి అయితే ఏ రంగాన్ని ఎలా బాగుచేయాలో ఆలోచించడానికి పెట్టిన పది శాతం సమయం కూడా, తాను అధికారంలోకి ఎలా రావాలో ఆలోచించడానికి పెట్టలేదు. పవన్ కల్యాణ్ జనసేనను అధికారంలోకి తీసుకురావాలి అంటే మాత్రం, నిరంతరం ప్రజలతో ఉడడం. ఎన్నికలకు ఏడాది ముందు ఓ ఆరు నెలలు పాదయాత్ర/రథయాత్ర చేయడం అవసరం.

**మీడియా అండ**

జయప్రకాష్ నారాయణ్‌కు లోక్ సత్తా ఉద్యమ సంస్థగా ఉన్నంతకాలం ఈనాడు సంస్థ మంచి కవరేజ్ ఇచ్చింది. ఆయన పార్టీ స్థాపించాక పక్కన పెట్టేసింది. ఇక లోక్ సత్తా పార్టీ ఒక కొత్తభావజాలంతో వచ్చినప్పుడు, ఆ భావజాలాన్ని ప్రజలకు చేర్చాల్సిన మీడియా తెలిసి కొంత, తెలియక కొంత లోక్ సత్తాకు నష్టం చేసింది. లోక్ సత్తా చెప్పేవన్నీ బాగుంటాయి కాని, అవి జరుగవు. లోక్ సత్తా గెలవదు అని, పార్టీ మొదలుపెట్టిన దగ్గర నుండి పరోక్షంగా లోక్ సత్తా గెలిచే పార్టీ కాదు అనే భావనను ప్రజల్లో వ్యాపింపచేస్తాయి. లోక్‌సత్తా వార్తలు ప్రచురించడం వరకు ఓకే గాని, లోక్ సత్తా అజెండా ప్రజలకి అర్థం అయ్యేలా ఆర్టికల్స్ రాయడం కాని, ఒక మూవ్‌మెంట్ బిల్డ్ చేయడం కాని, ఏ మీడియా మద్దతు లేకపోవడం ఒక కారణం. పవన్ కల్యాణ్ రాజకీయంగా సక్సెస్ కావాలంటే మందు సొంత మీడియా హౌస్ ఉండాలి, దాంతో పాటు ఆయన ఆలోచనలను అర్థం చేసుకుని, ప్రజలకి అవి అర్థం అయ్యేలా చెప్పగలిగే రిసోర్స్ పర్సన్స్ అయినా ఉండాలి. ఇప్పడు తెలుగులో నంబర్1 న్యూస్ చానల్ అయిన టి.వి 9ని ప్రారంభించేటప్పుడు రవి ప్రకాష్ జెపిని పార్టనర్‌గా ఉండమని కోరారు. మనం మంచి చేస్తే మీడియా దానంతట అదే కవరేజ్ ఇస్తుం, మనకొక సొంత ఛానల్ ఎందుకు అని జెపి ఆ ప్రతిపాదన తిరస్కరించారు. టి.వి 9 లో భాగస్వామిగా చేరకపోవడం తాము చేసిన పెద్ద పొరపాట్లలో ఒకటని జెపి అంటుంటారు. కాబట్టి పవన్ సొంతా మీడియా హౌస్ కోసం ప్రయత్నం చేయాలి.

**టీం వర్క్ కావాలి**

లోక్ సత్తా పార్టీలో పెద్ద మైనస్ టీం వర్క్ లేకపోవడం. జెపి దగ్గరకు వెళ్ళిన ప్రతి ఒక్కరు, మీకు జనంలో అద్భుత ఆదరణ ఉంది, మీ చుట్టూ ఉన్నవాళ్ళు మిమ్మల్ని ఎదగనివ్వడం లేదు అని ఫిర్యాదులు చేసేవారు. ఆయన వాటిని గుడ్డిగా నమ్మేవారు. ఎవరు నాలుగు మంచి మాటలు చెప్పి, లాప్ టాప్‌లో మంచి ప్రజెంటేషన్ చేస్తే వారి మాయలో పడి, అప్పటికే పని చేస్తున్న వాళ్ళని డిస్టర్బ్ చేసేవారు. లోక్‌సత్తా ఎప్పుడూ, నాలుగడుగులు ముందుకు, ఐదుడుగులు వెనక్కి అన్నట్లు నడిచింది. జెపి దగ్గరకి వెళ్ళిన వాళ్ళలో 50% మంది మంచివాళ్ళు ఉంటే 50% పనికిమాలినవాళ్లు ఉండేవారు. పవన్‌కి ఈ సమస్య ఇంకా ఎక్కువ ఉంటుంది. పవన్ దగ్గరకి చాలామంది పదవులకోసమే చేరతారు. ఇలాంటి వాళ్ళని ఒక కంట కనిపెట్టి ఉండకపోతే ముంచేస్తారు.

**మనుఘుల్ని నమ్మడం**

ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్ను పోటు పొడవడం దగ్గర నుండి చూసిన జెపికి మనుషులపై నమ్మకం పోయింది. తల్లిమీద ఒట్టువేసి, ఎన్టీఆర్‌కు ద్రోహం చేయం అని జెపికి మాట ఇచ్చిన వ్యక్తి 24 గంటల్లో మాటమార్చి బాబు వైపు చేరిపోవడంతో జెపి షాకయ్యారు. అందుకే జెపి పార్టీలో ఎవర్నీ నమ్మేవారు కాదు. ఆయన పార్టీ పెట్టక ముందు నుండి, ఆయనతో కలిసి నిస్వార్థంగా పనిచేసిన వారిని కూడా ఆయన నమ్మలేదు. నమ్మితే వెన్నుపోటు పొడిచే అవకాశం ఉన్నమాట నిజమే, కాని, రాజకీయాల్లో కనీసం నలుగురైనా నమ్మకస్తులు లేకపోతే మనుగడ సాగించడం కష్టం. పవన్‌కి సినిమాల్లో శరత్‌మరార్, త్రివిక్రమ్ శ్రీనివాస్ నమ్మకమైన వ్యక్తులు. రాజకీయంగా కూడా కనీసం నలుగురు నమ్మకస్తులు ఉంటేగాని విజయం సాధ్యంకాదు.

**వెన్ను తట్టి ప్రోత్సహించడం**

కొత్తపార్టీ, అదీ ఒక ఆదర్శంతో పెట్టినప్పుడు, ఎంతోమంది యువత ఎన్నో రకాల ఆలోచనలతో వస్తారు. వీరిని వెన్నుతట్టి ప్రోత్సహించడం. పొరపాట్లను సరిదిద్దడం చాలా అవసరం. జెపి గుడ్డిగా అందర్నీ ప్రోత్సహించేవారు. జెపి తర్వాతి స్థానంలో పార్టీలో ఎక్కువకాలం పని చేసిన వర్మ అందర్నీ డిస్కరేజ్ చేసేవారు. యూత్ చిన్న విషయాలకే డిసప్పాయింట్ అవుతారు. ఇలా డిసప్పాయింట్ అయిన చాలామంది యువత పార్టీకి దూరం అయ్యారు. పవన్ ఫ్యాన్స్‌కి చాలా ఆలోచనలు, ఎనర్జీ ఉంటాయి. వీటన్నింటిని సక్రమంగా ఛానల్ చెయ్యడం పవన్‌కి చాలా కీలకం..

ఇవీ పవన్ కల్యాణ్, లోక్ సత్తా జెపి వైఫల్యం నుండి నేర్చుకోవాల్సిన ముఖ్యమైన పాఠాలు. సక్సెస్ స్టోరీలు చదివితే స్ఫూర్తి వస్తుంది, ఫెయిల్యూర్ స్టోరీలు చదివితే అనుభవం వస్తుంది అని అబ్దుల్ కలాం అన్నారు. లోక్ సత్తా పార్టీ ఫెయిల్యూర్ స్టోర్ నుండి పవన్ కల్యాణ్ మంచి పాఠాలు నేర్చుకుని విజయం సాధించాలని, ప్రజల జీవితాల్లో పాజిటివ్ చేంజ్ తీసుకురావాలని కోరుకుంటూ...

# ఇస్లామిక్ ఉగ్రవాదానికి అమెరికాయే కారణం

## షియా, సున్నీల్లో విద్వేషం నింపిన అగ్రరాజ్యాలు
## రణరంగంగా మారిన మధ్య ప్రాచ్యం

ఆధిపత్యంలో భాగంగా అమెరికా సామ్రాజ్యవాదులు గత కొన్ని సంవత్సరాలుగా తమ ఆర్థిక, రాజకీయ సైనిక, వాణిజ్య పరిరక్షణ ప్రాబల్య విస్తరణ కోసం వివిధ దేశాలపై సాగిస్తున్న దురాక్రమణదాడులు, పెత్తందారీ హింసా, విధ్వంసకర చర్యల వల్లనే ఇస్లామిక్ ఉగ్రవాదం అనేక రూపాలలో విజృంభించి, ఎన్నో దేశాల్లో నెత్తుటేళ్లు పారిస్తూ ఇప్పుడు విశ్వశాంతికే పెనుముప్పుగా పరిణమిస్తోంది. అమెరికా తదితర ధనిక పారిశ్రామిక దేశాల అనుచిత దురాక్రమణదారీ జోక్యాల వల్ల పశ్చిమాసియా 'ఆరని అగ్నిగుండం'గా రగులుతూనే ఉంది. గతంలో ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, లిబియా, వియత్నాం, తదితర దేశాలపై దురాక్రమణ దాడులకు పాల్పడి భంగపడిన అమెరికా తాజాగా సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌ను గద్దెదించడానికి సున్నీ మతరాజ్యాలు సౌదీ అరేబీయా, టర్కీ, ఖతార్‌ల ప్రోద్బలం, సహకారంతో జరుపుతున్న దాడులు పరిస్థితిని విషమింపజేస్తున్నాయి.

సెక్యులరిస్టు అయిన అసద్ (షియా)కు రష్యా, ఇరాక్, ఇరాన్, బెలనాన్ హెచ్‌బల్లా వర్గాలు 'దన్ను'గా నిలిచి సైనిక, ఆర్థిక సాయమందిస్తుడటంతో అది షియా సున్నీల సమరభూమిగా, అమెరికా సౌదీ అరేబీయా టర్కీల ప్రాబల్య విస్తరణ రణ క్షేత్రంగా మారింది. 12 ఏళ్లక్రితం ఇరాక్‌లో సద్దాం హుస్సేన్ ప్రభుత్వం సామూహిక విధ్వంసక మారణాయుధాలు కలిగి ఉందనే కుంటిసాకులతో అప్పటి అమెరికన్ అధ్యక్షులు జార్జిబుష్ ప్రభుత్వం దురాక్రమణకు పాల్పడి 'నెత్తుటి నెగళ్లను' రాజేసింది. అమెరికా వలన నౌక, వైమానిక, పదాతి దళాలనుందించి, మారాణాయుధాలను ప్రయోగించి వేలాదిమందిని వధించింది. నేల మాళిగల్లో తలదాచుకున్న సద్దాం హుస్సేన్‌ను గాలించి, వెంటాడి, వేటాడి, బంధించి తూతూ మంత్రపు బూటకపు విచారణ జరిపి హతమర్చారు. ఇరాక్ సోషలిస్టు బాల్ పార్టీ ఆధ్వర్యంలో తాను సున్నీ అయిన షియా, సున్నీ, తెగలను ఐక్యంగా ఉంచి ఇరాక్ ఐక్యతను కాపాడారు. సద్దాంను ఉరితీశాక నూరిఅల్‌మవాకీ ప్రధానిగా షియామెజారిటీ అమెరికా తొత్తు ప్రభుత్వం మైనారిటీ సున్నీల ఆకాంక్షాలను నెరవేర్చడంలో విఫలమై వారిని అవమానిస్తూ వచ్చింది. స్వతహాగా సెక్యులర్ భావాలుగల సున్నీలు తొలుత ఒసామా బిన్‌లాడెన్ 'అల్‌ఖైదా'తో చేయికలిపారు. ఒసామాను అమెరికా ఖతం చేశాక పశ్చిమ ఇరాక్‌లోని విస్తృత ప్రాంతాలలో అబుబకర్ అల్‌బాగ్దాదీ నేతృత్వంలోని (ఐఎస్‌ఐఎస్‌కు) మద్దతు ప్రకటించి 'మోసుల్' వంటి ప్రాంతాలను తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. 2014



ఫిబ్రవరిలో బాగ్దాదీని అరెస్టు చేసిన అమెరికన్ దళాలు బాగ్దాదీ చిన్న ఖైదీ అంటూ డిసెంబరులో విడుదల చేశారు. ఇరాక్‌లోనే గాక సిరియా సరిహద్దుల వరకు ఇస్లామిక్ స్టేట్ ప్రాబల్యాన్ని లక్షసేనతో విస్తరించిన బాగ్దాదీ ఇప్పుడు అమెరికా తదితర దేశాలను వణికిస్తున్న ఉగ్రవాదనేత. పొరుగున ఉన్న సిరియాలో వివిధ తెగలమధ్య అంతర్గతపోరు జరుగుతున్న వేళ, సౌదీ, అరేబీయా, ఖతార్, టర్కీ వంటి సున్నీమత రాజ్యాల ప్రోద్బలంతో సిరియా అధ్యక్షుడు అల్ అసద్‌ను గద్దెదించడానికి తొలుత అమెరికా 'ఇస్లామిక్‌స్టేట్'ను ఆయుధంగా వాడుకుంది. దీనితో సిరియా సరిహద్దుల వరకు విస్తరించి, సిరియాలోని మెజారిటీ (74 శాతం) సున్నీల సహకారంతో ఆ దేశాన్ని కబలించి, వీలైతే జోర్డాన్, లెబనాన్ భూభాగలను కలుపుకుని 'విశాలిస్లామిక్ ఖలీసారాజ్య' స్థాపనకు ఐఎస్‌ఐఎస్ ముందుకు సాగుతుండటంతో అసలుకే మోసమొస్తుందనే భీతితో తాజాగా నిధి అరేబియా (ఐఎస్‌పై పోరుకు పాక్‌సహా 34 ముస్లిం దేశాల కూటమిని "రియాద్' కేంద్రంగా ఏర్పరుస్తున్నట్లు ప్రకటించింది. తమ అమోదం లేకుండానే ఈ కుటమిలో ఎలా చేరుస్తారని అణు ఉగ్రదేశం పాకిస్తాన్ అభ్యంతరం చెప్పింది. సద్దాంను నిర్దాక్షిణ్యంగా ఖతం చేసినప్పటి నుండి ఇరాకీ సున్నీ ముస్లి వర్గాలలో అమెరికా సైనికులపై భీకర దాడులకు దిగడంతో ప్రపంచవ్యాప్తంగా నిరసనల మధ్య 'చావుతప్పి కన్నులొట్టపోయి' అమెరికా అవమానాలను దిగమింగి తన సేనలను ఉపసంహరించి 'తొత్తు' ప్రభుత్వాలతో నెట్టుకొస్తోంది. ఆఫ్ఘనిస్తాన్‌లో సామ్యవాద ప్రభుత్వన్ని కూల్చేందుకు మత ఛాందస తాలిబన్ ఉన్మాదులను సమీకరించి పాకిస్తాన్ తదితర దేశాల్లో అమెరికా ఆయుధ శిక్షణ ఇప్పించింది. పాకిస్తాన్‌కు అపారంగా ఆయుధాలు, నిధులిచ్చి ప్రోత్సహించగా తాలిబన్‌లు పెట్రేగిపోయారు. భీకరదాడులు చేశారు. అఫ్ఘన్ అధ్యక్షుడు నజీబుల్లాను రోడ్డు పక్క ఉరితీసి కొయ్యపై వేలాడదీసి భయోత్పాతం సృష్టించారు. 2500 చారిత్రక వారసత్వ సంపదను ధ్వంసం చేసి, తమ ఫత్వాలతో మహిళలనూ, మానవ హక్కులను అణచివేశారు. తాలిబన్‌లకు దన్నుగా నిలిచిన పాకిస్తాన్ మత విద్వేషాన్ని నూరి పోసి ఆఫ్ఘనిస్తాన్‌కు భారత వ్యతిరేక శక్తిగా, పునర్నిర్మాణంలో పాల్గొనే వీలులేకుండా యధాశక్తి యత్నించింది. తాలిబన్‌ల దుశ్చర్యలు-పాక్, సున్నీలపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తగా వారిని అణచివెసేందుకు అమెరికా తన సైనిక దళాలను ఆఫ్ఘన్‌లో దింపి ప్రాబల్య విస్తరణకు యత్నించింది. దుర్గమ పర్వత శ్రేణులతో ఆఫ్ఘన్ తాలిబన్ గెరిల్లా దాడులను ఎదుర్కోలేక, స్వదేశంలో సైతం నిరసనలు వెల్లువెత్తగా అమెరికా దళాలు వైదొలిగాయి. అమెరికా సౌదీ అరేబియాల అండతో, వారందించిన ఆయుధ, ఆర్థిక సాయంతో పాక్ సైనిక పాలకులు భారత్‌పై ఉగ్రవాధులను ఉసిగొల్పి మారణ హోమానికి, విధ్వంసానికి యత్నించడం తెలిసిందే. భారత ప్రజాస్వామ్య ఆలయం పార్లమెంటుపై దాడులు, బొంబాయి తాజ్‌హోటల్‌పై జరిపిన టెర్రరిస్టు దాడులలో ఎందరో బలయ్యారు. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్‌ఐ మద్ధతుతో లష్కరే తోయిబా, జైషేమహ్మద్, ఇండియా ముజాహిద్దీన్ ఉగ్రవాదుల తరచూ జరుపుతున్న దాడులు, కాశ్మీర్‌లో కాల్పులు సాగిస్తున్నా అమెరికా కంటితుడుపు ప్రకటనలే తప్ప నిలువరించలేదు. 1993 బంబాయి పేలుళ్ళ సూత్రధారి స్మగ్లర్ దావూద్ ఇబ్రహీం పాక్‌లో సురక్షితం.

2014 డిసెంబర్ 16న ఇస్లామిక్ ఉగ్రవాదులు పెషావర్‌లోని ఓ పాఠశాలపై దాడిచేసి 122 మంది విద్యార్థులు, టీచర్లతో సహా 150 మందిని కాల్చిచంపడం సంచలనం రేపింది. మరెన్నో చోట్ల పాక్‌లో ఉగ్రవాదులు దాడులు సాగిస్తున్నా గట్టి చర్యల్లేవు. ఇలాంటి ఘనచరిత్ర గల పాకిస్తాన్, నాటి సైనికకూటమి సభ్యదేశం టర్కీ తదితరుల అండతో ఇస్లామిక్ స్టేట్‌కు వ్యతిరేకంగా సౌదీ అరేబియాతో పోరాడుతుంద నుకోవటం ఓ భ్రమే. నిరంకుశ రాచరిక వ్యవస్థకే మానవహక్కులను కాలరాస్తూ, అమెరికా, యూరప్ బ్యాంకులలో లక్షల కోట్ల పెట్రో డాలర్లు దాచిన సౌదీమత రాజ్యం మొదట సిరియా ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటం ఆపాలి. సిరియాలో ఫెడరల్ ప్రజాస్వామ్యం వ్యవస్థ మరింత బలపడి, అన్ని తెగలు, మతాలకు న్యాయం జరిగేందుకు ఐక్యరాజ్య సమితి ద్వారా గట్టి ప్రయత్నాలు జరగాలి. రెండు కోట్ల 30 లక్షల సిరియా జనాభాలో 90 శాతం ముస్లింలు, వారిలో 74 శాతం సున్నీలు, 13 శాతం షియాలు, 10 శాతమే క్రైస్తవులు. అంతర్యుద్ధం కారణంగా ఇప్పుడా ప్రాంతం 'షియా-సున్నీల రణస్థలి'గా మారింది. ఇస్లామిక్ తీవ్రవాద సంస్థ ఐఎస్‌ఐఎస్ నూరిపోసిన 'విద్వేషం' తోజిహాదీలు పారిస్, కాలిఫోర్నియా తదితర నగరాలలో 150 మందికిపైగా దాడిచేసి ఎడిటర్లు, కార్టునిస్టులను కాల్చి చంపి పత్రికలకు హెచ్చరిక చేశారు. తదుపరి నూరు దేశాల నుండి అంతర్జాలం ద్వారా మతావేశాన్ని యువత నరనరానికెక్కించి 30 వేల మందినీ ఐఎస్‌ఐ సైనికులుగా చేర్చుకున్నారు. ఇప్పటికే దాదాపు లక్షసేనతో ఇరాక్, - సిరియాలోని ప్రాబల్యప్రాంతాల నుండి టర్కీ సహకారంతో చమురు అమ్మి రోజుకు 16.5 లక్షల డాలర్లు, కిడ్నాప్‌లు బెదిరింపుల ద్వారా మరిన్ని కోట్ల ఆదాయం ఆర్జిస్తూ, ఆయుధాలు కొంటూ పాలుపోసిన వాటినే కాటేయజూస్తున్నారు.


సున్నీ తీవ్రవాదులపై దాడికి వచ్చిన రష్యా హెలికాప్టర్‌ను పేల్చిన టర్కీ చెప్పేదొకటి చేసేదొకటి అన్నట్లు అమెరికాపై భక్తిని చాటుకుంది. సిరియా అంత్యర్యుద్ధ, ఐఎస్ దాడుల వల్ల కోట్ల మంది నిర్వాసితులై లక్షల్లో ఇరాక్, ఈజిప్టు, లెబనాన్, జోర్డాన్‌లకు వలస వెళ్లగా వేల మంది మంణించారు. సిరియాల్లో అంతర్యుద్ధం ఐఎస్ దాడులు ఆపేందుకు సైనిక పరిష్కారం సాధ్యం కాదు. రష్యా, ఇరాన్‌ల మద్ధతుగల అసద్ ప్రభుత్వాన్ని దించడం అంతసులువు కాదు. అందువల్ల అమెరికా, రష్యా సౌదీఅరేబియా సిరియా సమస్యకు శాంతియుత రాజకీయ పరిష్కారం కనుగొనాలి. అమెరికా, సౌదీ అరేబియా కుటిల యత్నాలు మాని చిత్తశుద్ధితో కృషి చేస్తేనే ఐఎస్ కట్టడి, శాంతి సాధ్యం. వివిధ ముస్లిం తెగల మధ్య రష్యా, ఇరాన్‌ల చొరవతో సయోధ్యకు ప్రయత్నిస్తే మేలు.

# రెండంకెల వృద్ధి కష్టం : జైట్లీ

**దేశంలో సంస్కరణలను స్వాగతించేవారెక్కువ**
**విజయ్‌మాల్యా నుంచి రుణాలను వసూలు చేస్తాం**

**రాజధాని ప్రతినిధి :** ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితుల్లో భారత్‌కు రెండంకెల వృద్ధి కష్ట సాధ్యమని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. పెండింగ్‌లో ఉన్న సంస్కరణలు ముందుకు తీసుకువెళితే వృద్ధి రేటులో కొంత మెరుగుదల ఉంటుందని తెలిపారు. 'ఇండియా టుడే సదస్సు'లో ఆయన ప్రసంగించారు. 'కొన్ని పెండింగ్ సంస్కరణలు అమలు చేసి, పారిశ్రామిక, వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెంచడంతో పాటు బ్యాంకింగ్ రంగాన్ని మెరుగుపరిస్తే అవి వృద్ధికి తోడ్పడుతాయి' అని తెలిపారు. మన ప్రైవేటు రంగం పెట్టుబడును పెట్టేందుకు అనుకూలంగా ఉందన్నారు.

రెండంకెల వృద్ధికి ఏమాత్రం సమీపంలోకి వెళ్లలేనప్పటికీ అధిక ఆర్థిక కార్యకలాపాల ఫలాలు, ప్రస్తుత వృద్ధి రేటు మెరుగుదల ఫలాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అయితే ప్రతికూల పరిస్థితుల్లో కూడా మన వృద్ధి రేటును మెరుగుపరుచుకోవడమే మన ముందు ఉన్న కర్తవ్యమని జైట్లీ చెప్పారు. అంతర్జాతీయ వృద్ధి రేటుతో పోలిస్తే ప్రస్తుత భారత్ వృద్ధి 7-7.5 శాతం ఆకట్టుకునేదేనని తెలిపారు. ప్రస్తుత వృద్ధి రేటును మరో రెండు శాతం పెంచుకోవాలంటే అనేక అంశాలు అవసరమన్నారు. అంతర్జాతీయంగా ప్రోత్సాహకర వాతావరణం, ఆర్థికవ్యవస్థలో పారిశ్రామిక



రంగ వాటా పెరగాలని అభిప్రాయపడ్డారు. దేశీయంగా వ్యవసాయ రంగంలో పూర్తి స్థాయిలో వృద్ధి సాధించాలని, అక్కడ వృద్ధికి భారీ అవకాశాలు ఉన్నాయన్నారు. దేశంలో సంస్కరణలను వ్యతిరేకిస్తున్న వారికంటే అమలు చేయాలంటున్న జనాభానే ఎక్కువని వెల్లడించారు. సరైన దిశలో నిదానంగా సాగితే అన్ని విధానపరమైన మార్పులు వాటంతటవే వస్తాయన్నారు. కింగ్‌ఫిషర్ సంస్థ ప్రమోటర్ విజయమాల్యా నుంచి ప్రతిపైసాను రుణాలిచ్చిన బ్యాంకులు రాబట్టుకుంటాయని అరుణ జైట్లీ స్పష్టం చేశారు. మాల్యా దేశం విడిచి వెళ్లిపోయిన అనంతరం చోటు చేసుకున్న పరిణామాలపై ఆయన స్పందించారు. ఈ లిక్కర్ దిగ్గజం చట్టాన్ని అతిక్రమించినట్లు తేలితే నేర దర్యాప్తు సంస్థలు కఠిన చర్యలు తీసుకుంటాయని ఆర్థికమంత్రి వెల్లడించారు. మాల్యా మార్చి 2న భారత్‌ను వీడి, లండన్‌లో ఉన్నట్లు భావిస్తున్నారు. దీనికి కొద్దిరోజుల ముందు కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు మాల్యాకు చెందిన గ్రూప్ సంస్థల నుంచి రూ.9,000 కోట్లను తిరిగి రాబట్టుకునేందుకు అవకాశం ఇవ్వాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మాల్యా వ్యవహారంలో వాస్తవాలు స్పష్టంగా ఉన్నాయి.. ప్రతి ప్రభుత్వం ఏజెన్సీ.. అది ఆదాయ పన్ను శాఖ అయినా, దర్యాప్తు సంస్థ అయినా సరే మాల్యా చట్టాన్ని ఉల్లంఘించినట్లు వెల్లడైతే కఠిన చర్యలు తీసుకుంటాయి. అతనికి ఆ సంస్థలు ఇచ్చిన ప్రతి పైసాను వసూలు చేసుకుంటాయి' అన్నారు. మాల్యా కేసును ఉదాహరణగా పేర్కొంటూ.. ఇటువంటి వారి వల్ల భారత బ్యాంకింగ్ వ్యవస్థ, ప్రైవేటు రంగానికి అపఖ్యాతి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు బలంగా ఉన్నాయన్న నమ్మకాని కలిగించడమే ప్రస్తుతం ప్రభుత్వ కర్తవ్యమని, అందుకే బ్యాంకుల ములధనాన్ని పునరుద్ధరిస్తున్నట్లు జైట్లీ వివరించారు.

**జీఎస్‌టీపై కాంగ్రెస్ డిమాండ్ కష్టమే**

పెండింగ్‌లో గల రాజ్యాంగ సవరణ బిల్లుల్లో జీఎస్‌టీ రేటు పరిమితికి సంబంధించిన కాంగ్రెస్ డిమాండ్లు ఆమోదం కష్టమేనని అరుణ్‌జైట్లీ చెప్పారు. ప్రస్తుతం పార్లమెంటు సమావేశాల్లోనే జీఎస్‌టీ బిల్లుకు ఆమోదం లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. 'నేడు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు సహా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ)కు సానుకూలంగా ఉన్నాయి. పార్లమెంటులోని అన్ని రాజకీయ పార్టీలు జీఎస్‌టీకి ఓటు వేస్తామని చెబుతున్నాయి' అని జైట్లీ పేర్కొన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ వాకౌట్ చేసింది. ఇతర పార్టీలు అనుకూలంగా ఓటు వేశాయి. కాంగ్రెస్ తాజాగా ఓ ప్రకటన చేసింది. కాంగ్రెస్ ప్రతిపాదన ఆచరణ సాధ్యం కాదు. రాజ్యాంగా సవరణ ద్వారా దీనిని నిర్ణయించలేమని వివరించారు. జీఎస్‌టీ బిల్లును ఇప్పటికే లోక్‌సభ ఆమోదించింది. రాజ్యసభ ఆమోదం కోసం పెండింగులో ఉంది. రాజ్యసభలో పాలక బీజేపీకి కావాల్సినంత మెజారిటీ లేదు. జీఎస్‌టీ బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపితే మొత్తం 29 రాష్ట్రాల్లో సగం రాష్ట్రాలు ఈ బిల్లుకు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. అక్టోబరు నాటికి ఈ బిల్లు ఆమోదం పొందాలి. కాంగ్రెస్ ప్రతిపాదించినట్టుగా టారిఫ్ పెంచాలని ప్రతిసారీ రాజ్యాంగాన్ని సవరించలేమని జైట్లీ చెప్పారు.

# ఉచిత ఇసుక దందా

## గ్రామస్తులకు ఇసుకమాఫియాకు మధ్య ఘర్షణ



**రాజధాని ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం వివాదస్పదంగా మారుతోంది. పేరుకే ఉచితం అన్నట్లుగా పరిస్థితి మారిపోతోంది. దండిగా సంపాదించేందుకు అలవాటు పడిన ఇసుక మాఫియా ఉచిత ఇసుక విధానాన్ని సైతం అనుకూలంగా మార్చుకుంటోంది. ర్యాంపుల నుంచి ఇసుకను బయటకు తెచ్చేందుకు అవసరమైన కూలీలు, రవాణాకు సంబంధించిన వారంతా మాఫియా చేతుల్లోనే ఉండడంతో ప్రభుత్వం నిర్దేశించిన ఆయా ధరలను పక్కన పెట్టి మాఫియా తన దందాను కొనసాగిస్తోంది. ముఖ్యంగా యంత్రాలను వినియోగించరాదన్న అంశాన్ని పగటి పూట పక్కన పెట్టి రాత్రి వేళల్లో యంత్రాలను పెట్టి ఇసుకను యథేచ్ఛగా దోచుకుపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం ముగ్గళ్ళర్యాంపు వద్ద రాత్రి, పగలు అన్న తేడా లేకుండా యంత్రాలతో ఇసుకను తవ్వితీస్తూ లారీల్లో రవాణా చేస్తున్నారు. పెద్దఎత్తున గుట్టలు పోసి మరీ అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ వ్యవహారాన్ని ముగ్గళ్ల గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ యంత్రాల వినియోగాన్ని సహించేది లేదని తేల్చిచెప్పారు. దీంతో ఇసుక మాఫియా, గ్రామస్తులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

ఈ నేపథ్యంలోనే రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ విజయ కృష్ణన్ ర్యాంపునకు చేరుకుని యంత్రాల వినియోగాన్ని నిర్మూలించేందుకు వీలుగా చర్యలు చేపట్టారు. అయితే రాత్రి పూట ఇసుక మాఫియా యంత్రాలను వినియోగించి ఇసుకను తరలించుకుపోతున్నట్లు ఆమె దృష్టికి రావడంతో ర్యాంపు వద్ద ఇసుక మాఫియా ఆగడాలను అడ్డుకునేందుకు వీలుగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా ఇసుకను నది నుంచి తీయాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా తవ్వకాలు సాగుతున్నాయనే ఆందోళన సర్వత్రా వినిపిస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలోని అఖండ గోదావరి నది దిగువ ప్రాంతంలోని కొత్త మండలం మందపల్లి, ఆలమూరు, జొన్నాడు, పి. గన్నవరం ప్రాంతాల్లోనూ, బ్యారేజీకి అతి సమీపంలోని అఖండ గోదావరి నది ఎగువ ప్రాంతంలో వంగలపూడి, సీతానగరం, వెంకటనగరం, ముగ్గళ్ళ, బ్రిడ్జిలంక, కేతావారిలంక వంటి ముప్పు కలిగే విధంగా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా బహిరంగంగా సాగిపోతోంది. మందపల్లి, ముగ్గళ్ల రేవుల్లో అయితే స్థానికులు మాఫియా అరాచకాలను అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. అదేవిధంగా రాజమహేంద్రవరం నగరం పరిసర ప్రాంతాలలోనూ రాత్రికి రాత్రే స్థానిక ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో వారి అనుయాయులు పెద్దఎత్తున అక్రమంగా ఇసుక రవాణా సాగిస్తున్నారు.

# మిర్చి ఎగుమతిలో ఏపీ ఫస్ట్

**వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు**



మిర్చిని పరిశీలిస్తున్న మంత్రి పుల్లారావు తదితరులు

**రాజధాని, ప్రతినిధి- గుంటూరు :** దేశం మొత్తం మీద మిరప పంట ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. మిరపపంట లాభసాటిగా ఉండాలనే లక్ష్యంతో రైతులకు 50 శాతం రాయితీపై ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పనిముట్లను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోందన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్పైసెస్ బోర్డు, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో గత ఆదివారం మిరప పంట మార్కెట్ అనుసం ధానతపై ఏర్పాటు చేసిన సదస్సులో మంత్రి ప్రసంగించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మిరప సాగు చేసే రైతుల్లో అవగాహన కల్పించేందుకు ఈ సదస్సుకు ఏర్పాటు చేస్తామన్నారు. 2014-15లో ఆంధ్రప్రదేశ్‌లో 1.35 లక్షల హెక్టార్ల భూమిలో మిరపపంట సాగు చేయగా, 7.39 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయిందని చెప్పారు. ఇందులో ఒక్క గుంటూరు జిల్లాలోనే 64 వేల హెక్టార్లలో 3 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించినట్లు మంత్రి చెప్పారు. నేడు పెద్ద ఎత్తున మిర్చిని అమెరికా, చైనా, జపాన్, ఆస్ట్రేలియా దేశాలకు ఎగుమతి చేస్తున్నందున, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఎరువులు, పురుగు మందులరహిత మిరప పంటపై రైతులలో అవగాహన కల్పించాలన్నారు.

కేవలం సాంప్రదాయ పద్ధతిలో మిరప పంట సాగు చేసుకొనేలా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగు తోందన్నారు. ఇందుకోసం 10 లక్షల మంది రైతులతో 1000 ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఈ విధంగా రైతులు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసుకుని ఈ స్పైస్ బజార్‌లో నమోదైనట్లైతే, ఎక్స్‌పోర్ట్, ప్రాసె సింగ్ కంపెనీలకు రైతులు తాము పండించిన పంటను నేరుగా అధిక ధరకు అమ్ముకోవడానికి వీలు కలుగుతుందన్నారు. తొలుత లాం ఫాం శాస్త్రవేత్త డా.నారంనాయుడు మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో మిరప సాగు పద్ధతులు, వాడవలసిన ఎరువులు, పురుగుమందులు గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం స్పైసెస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ డా.పి.ఎస్. కంఠన్ తంబి స్పైసెస్ బోర్డు చేపట్టే కార్యక్రమాలు, ప్రస్తుత మార్కెట్ స్థితిగతులు, మిరపకు అధిక మద్దతు ధర వచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ షేక్ జానీమూన్, ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.జయచంద్రారెడ్డి, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన మిర్చి రైతులు, ఎక్స్‌పోర్టర్స్, ప్రాసెసింగ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌కు 70 వేల కోట్ల ఆస్తులు ?

**రాజధాని ప్రతినిధి :** ఉమ్మడి ఆస్తుల పంపకాల్లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.70,000 కోట్ల విలువైన ఆస్తులు దక్కే అవకాశముంది. విద్యా శాఖ, ఉన్నత విద్యామండలి ఆస్తుల పంపకంపై సుప్రీం కోర్టు తీర్పు అనుకూలంగా రావడంతో ఉబ్బితబ్బిబయిన ఆంధ్రప్రదేశ్ అదే జోరును కొనసాగించే ప్రయత్నంతో ఉంది. 2014 విభజన చట్టంలోని 9,10 షెడూల్‌లో జాబితాలోని అన్ని సంస్థల్లో వాటాలను కోరాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పునర్విభజన చట్టంలోని 9, 10 షెడూళ్లలో ఉన్న 120కు పైగా సంస్థలలో ఆస్తుల పంపకానికి తెలంగాణాపై ఒత్తిడి తెచ్చేందుకు మరోసారి సుప్రీంకోర్టు తలుపు తట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలుస్తోంది.

**58:42 నిష్పత్తిలో వాటాల పంపకం**

ఉన్నత విద్యామండలిలో తనకు వాటాపై ఏపీ ప్రభుత్వం చేసిన వాదనలు సుప్రీం కోర్టు సమర్థించిన విషయం తెలిసిందే. బ్యాంకు స్టేట్‌మెంట్ ప్రకారం ఈ ఖాతాలో దాదాపు రూ. 115.58 కోట్లు విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు 18.14 కోట్లు బ్యాంకు నిల్వ ఉన్నాయి. ఈ మొత్తాలను రెండు రాష్ట్రాలు 58.42 నిష్పత్తిలో పంచుకోవాలని కోర్టు తెలిపింది. మిగిలిన 120 సంస్థలకు సంబంధించి రూ.3,800 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. 'రెండు షెడ్యూళ్లలో పేర్కొన్న ఇతర అని సంస్థ లకు ఇదే నిష్పత్తి అనుసరిస్తే.. బ్యాంకు డిపాజి ట్లు, స్థిరాస్తులు రూపంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇంచు మించు రూ.70,000 కోట్లు దక్కే అవకాశ ముంది. తెలుగుదేశం ప్రభుత్వం స్థాధించిన ఏకైక అతిపెద్ద విజయం ఇది' అని రాష్ట్ర ముఖ్యమంత్రి తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోని ఆస్తులు, అప్పులు దామాషా విభజనకు సంబంధించి సెక్షన్ 47ను పేర్కొంటూ సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంపై ఏపీ ప్రభుత్వం ఆనందం వ్యక్తం చేస్తోంది.

**కోర్టు ద్వారనే తేల్చుకుంటాం...**

భౌగోళిక స్థానాన్ని వివరించే సెక్షన్ 75ను చూపించి హైదరాబాదులోని అన్ని సంస్థలను తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దీన్ని కొట్టిపారేసిన సుప్రీంకోర్టు సెక్షన్ 47 ఆధారంగానే ఆస్తుల విభజన జరగాలని స్పష్టం చేసింది. ఆస్తులు అప్పులకు సంబంధించి వివాదాలు తలెత్తితే ఎలా పరిష్కరించుకోవాలో కూడా ఈ సెక్షన్ వివరించింది. రెండు రాష్ట్రాలు పరస్పర అంగీకారం ద్వారా పరిష్కంచుకోవాలని, అది సాధ్యంకాని పక్షంలో కాగ్ సలహా ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వు ద్వారా పంపిణీ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వ వైఖరిని సొలిసిటర్ జనరల్ సుప్రీం కోర్టులో స్పష్టం చేశారు. సుప్రీంతీర్పు ఏపీ ప్రభుత్వానికి భారీగా అవకాశాల ద్వారాలను తెరిచిందని చెప్పొచ్చు. అపాయింట్ డే (2014 జూన్ 2) నాటికి ఉనికిలో ఉన్న అన్ని సంస్థల్లో ఏపీ వాటాలు కోరుతోంది.

ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీలు, సహకార సంస్థలకు వివిధ బ్యాంకులలో ఉన్న ఖాతాల్లో రూ.16,000 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇప్పుడు ఈ సొమ్మంతటిపై వాటాలు కోరేందుకు రాష్ట్ర ఆర్థిక శాఖ సన్నద్ధమవుతోంది. ఇవి రాష్ట్ర విభజనకు ముందే ఉన్నందున ఏపీలోని 13 జిల్లాల ప్రజలపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే సుప్రీం కోర్టు అభ్యర్ధన దాఖలు చేయనుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# 'రియల్' లబ్ధిదారులు ఎవరు..?

**పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా బిల్లు**

**వినియోగదారుడినే రాజు చేయడానికే : ప్రభుత్వం**

ఏ సమాజంలోనైనా పౌరులు కోరుకునేది.. ప్రభుత్వం కల్పించాల్సింది ప్రధానంగా మూడు. అవి తిండి, బట్ట, గృహం. గతంలో కంటే ఉపాధి అవకాశాలు మెరుగవ్వడంతో ప్రజలకు తిండి, బట్టకు ఇబ్బంది లేకున్నా.. ఇల్లు మాత్రం అందని ద్రాక్షగానే మారింది. ఈ పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న సహజ వనరైన భూమిని సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, పౌరులపై ఉంది.



### నగరాల్లో స్థలం కరువు..

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ భూమ్ భారీ స్థాయిలో ఉంది. విజయవాడ, విశాఖపట్టణం, గుంటూరు, రాజమండ్రి, నెల్లూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాలు, జిల్లా ముఖ్య పట్టణాల్లో సామాన్య, మధ్య తరగతి ప్రజలు గజం స్థలం కూడా కొనే పరిస్థితి లేదు. చిన్న చిన్న పట్టణాల్లో కూడా భూమి విలువ అనేక రెట్లు పెరిగింది. రోజుల తేడాలోనే భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ పరిస్థితిలో సామాన్యులకు సొంత ఇల్లు సమకూర్చుకోవడం కలగానే మిగిలిపోతోంది. ఉద్యోగస్తులు, వ్యాపారులు వంటి వారు మాత్రం అపార్ట్‌మెంట్ల లక్షల రూపాలు వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేస్తున్నారు.

### భారంగా ఇళ్ల నిర్మాణ వ్యయం

స్థలాల ధరలు పెరిగిపోతుండడంతో ఇంటి నిర్మాణ వ్యయాలు మొత్తంగా పెరిగిపోతోంది. దీనికి తోడు సిమెంట్, ఐరన్, తాపీ వర్కర్లు, ఇసుక, ఇటుకలు తదితర ధరలు కూడా అందుబాటులో లేవు. దీంతో ఇళ్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అన్న సామెత నేటికీ సమాజానికి వర్తిస్తుందనే చెప్పాలి.

### పుట్టగొడుగుల్లా రియల్ఎస్టేట్ సంస్థలు

భూముల విక్రయాల్లో కూడా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. రియల్‌భూమ్‌ను క్యాష్ చేసుకునేందుకు అనేక రియల్ ఎస్టేట్ సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. భారీ ప్రచారంతో ప్రజలను ఆకర్షించి ఇళ్ల స్థలాలను అధిక ధరలకు అంటగడుతున్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఆ పరిశ్రమ వస్తుంది.. ఈ సంస్థ వస్తుంది అంటూ ఆశల పల్లకిలో ఊగించి భూములను అంటగడుతున్నారు. కొన్ని సందర్భాల్లో కొనుగోలు చేసిన స్థలాలు తమవంటూ ఇతరులు వచ్చి గొడవలు చేయడం, కోర్టు కేసులు వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

**రాజధాని డెస్క్ :** ఇటీవల కాలంలో రియల్ ఎస్టేట్ రంగం చాలా వేగంగా వృద్ధి చెందుతోంది. ఆ రంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ముగింపు పలికేందుకు కేంద్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ బిల్లు 2016ను తీసుకువచ్చింది.

*ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతం ఉన్న కృష్ణా నదీ పరివాహ ప్రాంతంలోని తుళ్లూరు, రాయపూడి, ఉద్ధండరాయుని పాలెం సమీప గ్రామాల్లో రాజధానికి సంబంధించిన కార్యాలయాలు నిర్మిస్తుండడంతో ఆ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో రాజధాని నుంచి మంగళగిరి, విజయవాడలకు వెళ్లే మార్గాల్లో వ్యవసాయ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లుగా వెలుస్తున్నాయి.*

**అపఖ్యాతికి చెక్..**

కీలకమైన రియల్ ఎస్టేట్ రెగ్యూలేషన్ అండ్ డెవలప్‌మెంట్ బిల్లు, 2016ను మార్చి 10వ తేదీన పార్లమెంట్‌లో ఆమోదించింది. వినియోదారుడిని రాజును చేయడానికే, వారి మేలుకోసమే ఈ బిల్లు తెచ్చినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ఎం.వెంకయ్యానాయుడు చెబుతున్నారు. ఈ బిల్లు వినియోగదారులు, డెవలపర్ల మధ్య సంతోషకరమైన పొత్తును (సత్సంబంధాన్ని) ఏర్పాటు చేయడానికి తోడ్పడుతుందని ప్రభుత్వం అంటోంది. రియల్ ఎస్టేట్ రంగంపై ఉన్న అపఖ్యాతికి చెక్ పెట్టి పెట్టుబడులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేస్తోంది. కొద్ది



మంది ఆపరేటర్లు మాత్రమే ఉన్న టెలికమ్యూనికేషన్ రంగానికి ఒక నియంత్రణ సంస్థ ఉండగా, 76,000 కంపెనీలు ఉన్న రియల్ ఎస్టేట్ రంగానికి ఒక నియంత్రణ సంస్థ లేకపోవడమేమిటని ఇటీవల వెంకయ్యానాయుడు వ్యాఖ్యానించారు.

**2013 బిల్లులో మార్పులు**

2013 నుంచి రాజ్యసభలో రియల్ ఎస్టేట్ బిల్లు పెండింగ్‌లో ఉంది. ఆ బిల్లులోనే అనేక మార్పులు చేసి ప్రభుత్వం రియల్ ఎస్టేట్ బిల్-2016ను ఆమోదింపజేసింది. ప్రధానంగా ఈ బిల్లు పెద్ద సంఖ్యలో ఉన్న గృహాల కొనుగోలుదారుల ప్రయోజనాలను పరిరక్షించడంతో పాటు రియల్ ఎస్టేట్ నిర్మాణ పరిశ్రమలో పారదర్శకత, జవాబుదారీతనం, విశ్వసనీయతన పెంపొందించి సమర్థవంతంగా ప్రాజెక్టుల అమలు చేసేందుకు తోడ్పడాలని ప్రభుత్వం భావిస్తోంది. రియల్ఎస్టేట్ రంగం క్రమబద్ధంగా వృద్ధి చెందేందుకు ఒక సమర్థవంతమైన నియంత్రణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని బిల్లు పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆ రంగంలో భారీగా పెట్టుబడులను రప్పించేందుకు 2016-17 బడ్జెట్‌లో అనేక ప్రోత్సాహకాలను ప్రకటించింది.

**వ్యవసాయం తర్వాత రియల్‌లో ఎక్కువ ఉపాధి**

దేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న రియల్ఎస్టేట్ రంగంలో మొత్తం 76,044 కంపెనీలు ఉన్నాయి. వాటిలో ఢిల్లీలో 17,431, పశ్చిమ బెంగాల్‌లో 17,010, మహారాష్ట్రలో 11,160, ఉత్తరప్రదేశ్‌లో 7,136, రాజస్థాన్‌లో 3,054, తమిళనాడులో 3,004, కర్ణాటకలో 2,261, తెలంగాణలో 2,211, హర్యానాలో 2,121, మధ్యప్రదేశ్‌లో 1,956, కేరళలో 1,270, పంజాబ్‌లో 1,202, ఒడిశాలో 1,006 రియల్ ఎస్టేట్ కంపెనీలు ఉన్నాయి. దేశ స్థూదేశీయోత్పత్తికి (జీడీపీ)లో ఈ రంగం 9 శాతం వాటా కలిగి ఉంది. 2011, 2015లలో ఏడాదికి 2,349 నుంచి 4,488 వరకు కొత్త ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. దేశంలోని 15 రాష్ట్ర రాజధాని నగరాలతో సహా 27 నగరాల్లో రూ.13.70 లక్షల కోట్లతో 17,526 ప్రాజెక్టులు ప్రారంభించారు. పరిశ్రమ అందించిన సమాచారం ప్రకారం ఏటా 10 లక్షల మంది తమ సొంత ఇంటి కలను సాకారం చేసుకుంటున్నారు. ప్రభుత్వం రియల్ఎస్టేట్ బిల్లుపై వినియోగదారులు, డెవలపర్ల సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో అనేక దపాలు చర్చలు జరిపింది. అనంతరం వారు సూచనలతో 2013 రియల్ ఎస్టేట్ బిల్లులో అనేక మార్పులు చేశారు.

- రియల్ ఎస్టేట్ డెవలపర్లు వినియోగదారుల నుంచి సేకరించే నగదు మొత్తంలో 70 శాతాన్ని విడిగా డిపాజిట్ చేయాలని ప్రభుత్వం బిల్లులో పొందుపరిచింది. వాస్తవానికి సెలక్ట్ కమిటీ నిర్మాణ ఖర్చులు, భూమి కోసం 50 శాతం డబ్బును మాత్రమే డిపాజిట్ చేయాలని సూచించగా, ప్రభుత్వం దానిని 70 శాతానికి పెంచింది.
- ప్రాజెక్టు రిజిస్ట్రేషన్ నిబంధనలను స్టాండింగ్ కమిటీ సూచన మేరకు 2013 ముసాయిదా బిల్లులో 4000 చదరపు మీటర్లుగా ప్రతిపాదించారు. తర్వాత నూతన బిల్లులో ప్లాట్ విస్తీర్ణం 500 చదరపు మీటర్లకు తగ్గించారు.
- వాణిజ్య రియల్ ఎస్టేట్ రంగాన్ని కూడా బిల్లు పరిధిలోకి తీసుకువచ్చారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను కూడా నూతన రెగ్యులేటరీ అథారిటీలో రిజిష్టర్ చేయించుకోవాలి. ప్రస్తుతం దేశంలో 17,000 ప్రాజెక్టులు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి.
- ఇళ్ల కొనుగోలు అవినీతికి తావు లేకుండా చేసేందుకు స్థలం కొలతలను స్పష్టంగా పేర్కొనాలి.
- గతంలో డెవలపర్లకు అనుకూలంగా ఉన్న నిబంధనలను సవరించి.. ఇకపై ప్రాజెక్టు జాప్యానికి కారణమైతే వినియోగదారులైనా.. డెవలపర్లు అయినా ఒకే రకమైన వడ్డీ రేట్లను చెల్లించాల్సి ఉంటుంది.
- నిర్మాణపరంగా డెవలపర్ల బాధ్యతను 2 ఏళ్ల నుంచి 5 ఏళ్లకు పెంచారు. అలాట్ చేసుకున్న వారిలో మూడొంతుల్లో రెండు వంతుల మంది అంగీకారం లేకుండా నిర్మాణ ప్రణాళికలో డెవలపర్లు మార్పులు చేయకూడదు.
- ల్యాండ్ టైటిల్‌కు బీమాను కూడా చేయాలని బిల్లులో పొందుపరిచారు. ప్రస్తుతం ఈ సౌకర్యం మార్కెట్‌లో లేదు. ఈ నిబంధన వల్ల వినియోగదారులు, డెవలపర్లకు లబ్ధి చేకూరుతుంది.
- ఈ రంగంపై వచ్చే ఫిర్యాదులను అప్పిలేట్ ట్రిబ్యునల్స్, రెగ్యులేటరీ అథారిటీలు వేగంగా పరిష్కరించేందుకు నిర్దిష్ట గడువులను తగ్గించారు.
- ట్రిబ్యునల్, లేదా రెగ్యులేటరీ అథారిటీల నిబంధనలను అతిక్రమిస్తే డెవలపర్లకు గరిష్ఠంగా 3 ఏళ్లు, రియల్ ఎస్టేట్ ఏజంట్లకు, వినియోగదారులకు ఏడాది శిక్ష పడుతుంది.
- 2022 నాటికి ప్రధానమంత్రి అవాస యోజన కింద పట్టణ పేదలకు 2 కోట్ల ఇళ్లను సమకూర్చే లక్ష్యంతో రియల్ ఎస్టేట్ 2016 బిల్లును తీసుకువచ్చినట్లు ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

## వచ్చే మార్చి నాటికి 'తపాలా బ్యాంకు'

**ఢిల్లీ :** వచ్చే ఏడాది మార్చి నాటికి ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉందని కేంద్ర టెలికాం, ఐటీ శాఖ మంత్రి రవిశంకర ప్రసాద్ తెలిపారు. ఇందుకోసం త్వరలో కేబినెట్ అనుమతులు కోరతామని ఆయన చెప్పారు. టైమ్స్ నెట్‌వర్క్ మంగళవారం ఏర్పాటు చేసిన డిజిటల్ ఇండియా సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇండియా పోస్ట్‌కే కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ల శాఖలు అత్యధికంగా ఉన్నాయన్నారు. తాను 2014లో మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు ఇండియా పోస్ట్‌కు కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ల శాఖలు 230 మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు 25,000కు గాను, 20, 494 శాఖలు కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్లు కలిగి ఉన్నాయి. ఏప్రిల్ నాటికి మిగిలిన శాఖలు కూడా ఈ స్థితికి చేరుకుంటాయని ఆయన తెలిపారు. కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ల శాఖల విషయంలో ఎస్‌బీఐ కంటే ఇండియా పోస్టే ముందుందన్న విషయాన్ని ప్రకటిస్తున్నందుకు గర్వంగా ఉందని చెప్పారు. ఇండియా పోస్ట్ ఏటీఎంలు నాలుగు నుంచి 850కు పెరిగాయని తెలిపారు. ఏప్రిల్ మధ్య కల్లా ఈ సంఖ్య 1000కు చేరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చెల్లింపుల బ్యాంకు ఏర్పాటు కోసం గత సెప్టెంబరు 7న ఇండియాపోస్ట్‌కు ఆర్‌బీఐ సూత్రపాయంగా అంగీకారం తెలిపిన సంగతి తెలిసిందే. నిధుల సమీకరణకు పబ్లిక్ ఇన్వెస్టిమెంట్ బోర్డు నుంచి కూడా పోస్టల్ విభాగానికి అనుమతులు లభించాయి.

## టీమిండియా.. వారెవ్వా..

**ఉత్కంఠపోరులో బంగ్లాపై భారత్ విజయం**

**చివరి ఓవర్‌లో సీన్ రివర్స్**

**ప్రపంచ టీ 20 టోర్నీలో భాగంగా గత బుధవారం బెంగళూరు చిన్నస్వామి స్టేడియం టీమిండియా, బంగ్లాదేశ్ మధ్య తీవ్ర ఉత్కంఠభరిత పోరుకు వేదికైంది. దాదాపు బంగ్లాదేశ్ చేతిలోకి వెళ్లిన మ్యాచ్ చివరి బంతిలో భారత్ వశమైంది. చివరి మూడు బంతుల్లో మూడు వికెట్లు తీసి బంగ్లా ఆశలపై ధోనీ సేన నీళ్లు చల్లింది. నరాలు తెగే ఉత్కంఠలోనూ భారత క్రికెటర్లు ఆత్మవిశ్వాసంతో ఆడి అద్భుత విజయం సాధించారు. మొత్తానికి ఈ మ్యాచ్ క్రీడాభిమానులకు కనువిందు చేసింది.**



**బెంగళూరు :** ఒక వైపు టీ 20లోనే ప్రపంచంలోనే మేటి జట్టు.. మరోవైపు ఇప్పుడిప్పుడే అంతర్జాతీయ క్రికెట్‌లో విజయాల రుచి చూస్తున్న పసికూన.. ఇంకేముంది టీమిండియా గెలుపు నల్లేరు మీద నడకే అనుకున్నారు క్రీడాభిమానులు. కానీ బంగ్లా క్రికెటర్లు టీమిండియాకు దీటుగా ఆడారు. ఒక దశలో వారిదే విజయమని అంతా భావించారు. చివరి ఓవర్‌లో అంతా తారుమారైంది. దీంతో టీమిండియా ఒక్క పరుగు తేడాతో నెగ్గింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. సురేష్ రైనా (23 బంతుల్లో 30, 1 ఫోర్, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఓపెనర్లు ధావన్ (22 బంతుల్లో 23, 2 ఫోర్లు, 1 సిక్స్), రోహిత్ (16 బంతుల్లో 18, 1 ఫోర్, 1 సిక్స్) ఆచితూచి ఆడారు. ముస్తఫిజుర్ వేసిన ఆరో ఓవర్లో రోహిత్, ధావన్ చెరో సిక్సర్ బాది వేగం పెంచగా.. చివరి బంతికి రోహిత్ అవుట్ చేశాడు. తర్వాతి ఓవర్లోనే చక్కటి బంతితో షకీబ్.. ధావన్‌ను పెవిలియన్‌కు పంపించాడు. కోహ్లి, రైనా మూడో వికెట్‌కు 50 పరుగులు జోడించిన అనంతరం మరోసారి బంగ్లా ఆధిక్యం ప్రదర్శించింది. షవగత వేసిన 14వ ఓవర్లో 17 పరుగులు రాబట్టి భారత్ దూకుడు ప్రదర్శించినా.. అదే ఓవర్లో కోహ్లి (24 బంతుల్లో 15, 2 ఫోర్లు, 1 సిక్స్)లను అమీన్ అవుట్ చేయగా, యువరాజ్(3) విఫలమయ్యాడు. చివరిలో ధోని (13 నాటౌట్), జడేజా (12) కొన్ని పరుగులు జోడించినా స్కోరు 150 పరుగుల లోపే నిలిచిపోయింది. బంగ్లా బౌలర్లు కట్టడి చేయడంతో భారత్ ఆఖరి ఐదు ఐదు ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 34 పరుగులు మాత్రమే చేసింది. అనంతరం బంగ్లా 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 145 పరుగులు మాత్రమే చేయగలిగింది. తమీమ్ ఇక్బాల్ (32 బంతుల్లో 35, 5 ఫోర్లు) రాణించాడు. టీమిండియా సాధారణ లక్ష్యాన్ని కాపాడుకోవాల్సి మ్యాచ్‌లో బుమ్రా బంగ్లా ప్రధాన బ్యాట్స్‌మెన్ తమీమ్ ఇక్బాల్ 15 పరుగుల వద్ద ఉండగా ఫైన్‌లెగ్‌లో ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను వదిలేశాడు. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న తమీమ్ చెలరేగిపోయాడు. బుమ్రా వేసిన తరువాతి ఓవర్లో నాలుగు ఫోర్లు బాదాడు. అదే ఊపులో భారీ షాట్‌కు ప్రయత్నించి వెనుదిరిగాడు. మరో వైపు దూకుడు ప్రదర్శించిన షబ్బీర్ (15 బంతుల్లో 26, 3 ఫోర్లు, 1 సిక్స్)ను ధోని అద్భుతంగా స్టంపౌట్ చేశాడు. ఎనిమిది పరుగుల వద్ద షకీబ్ (15 బంతుల్లో 22, 2 సిక్సర్లు) క్యాచ్‌ను అశ్విన్ వదిలేసినా.. కొద్ది సేపటికే అద్భుత బంతికి అతనే అవుట్ చేశాడు. ఈ దశలో మహ్మదుల్లా.. సర్కార్ (21 బంతుల్లో 21, 1 ఫోర్, 1 సిక్స్) కలసి జాగ్రత్తగా ఆడుతూ జట్టును విజయం దిశగా తీసుకువెళ్లారు. అయితే చివరి ఓవర్లలో భారత బౌలర్లు పూర్తిగా కట్టిపడేశారు. కీలకమైన 19వ ఓవర్లో బుమ్రా 6 పరుగులే ఇవ్వగా, ఆఖరి ఓవర్లో పాండ్యా 9 పరుగులు ఇచ్చినా రెండు కీలక వికెట్లు తీయడం, చివరి బంతికి ధోని సమయస్ఫూర్తితో రనౌట్ చేయడంతో భారత్‌కు చిరస్మరణీయమైన విజయం లభించింది. రెండు కీలక వికెట్లు తీసిన అశ్విన్‌ను మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు వరించింది. భారత్ తమ తర్వాతి మ్యాచ్‌లో ఆదివారం ఆస్ట్రేలియాతో తలపడనుంది. ఆ మ్యాచ్‌లో గెలిస్తే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా సెమీ ఫైనల్‌కు చేరుతుంది.

## ఇంగ్లండ్‌పై భారత మహిళా జట్టు ఓటమి

**సెమీస్‌కు ఆశలు గల్లంతు**




**ధర్మశాల :** ఐసీసీ టీ 20 టోర్నీలో భాగంగా మంగళవారం ధర్మశాల స్టేడియంలో జరిగిన గ్రూబ్ బి లీగ్ మ్యాచ్‌లో భారత్ మహిళా క్రికెట్ జట్టు ఇంగ్లండ్ చేతిలో ఓటమిపాలైంది. సెమీస్ ఆశలు సజీవంగా ఉండాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత జట్టు చేతులెత్తేసింది. పేలవ బ్యాటింగ్, చెత్త ఫీల్డింగ్‌తో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓడి నాకౌట్ ఆశలను క్లిష్టతరం చేసుకుంది. మంచి సమన్వయంతో ఆడిన ఇంగ్లండ్ రెండు వికెట్ల తేడాతో భారత్‌పై గెలిచింది. టాస్ ఓడిన ఇంగ్లండ్ ఫీల్డింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసింది. హర్మన్ ప్రీత్ కౌర్ (25 బంతుల్లో 26, 3 ఫోర్లు), మిథాలీరాజ్ (33 బంతుల్లో 20, 2 ఫోర్లు) మినహా మిగిలిన వారు నిరాశపరిచారు. హీథర్ నైట్ 3 వికెట్లు తీసింది. తర్వాత ఇంగ్లండ్ 19 ఓవర్లలో 8 వికెట్లకు 92 పరుగులు చేసింది. బీమోంట్ (18 బంతుల్లో 20, 4 ఫోర్లు), స్కివెర్ (19), టేలర్ (16) పర్వాలేదనిపించారు. భారత బౌలర్లు ఆరంభంలో విజృంభించినా .. చివరిలో ఫీల్డింగ్‌లో విఫలమయ్యారు. విజయానికి మూడు పరుగులు చేయాల్సిన దశలో శబ్రసోల్ (5, నాటౌట్) ఇచ్చిన క్యాచ్‌ని మిథాలీ జారవిడిచింది. ఆ తర్వాత బంతిని ఆమె ఫోర్ కొట్టడంతో మ్యాచ్ ఇంగ్లండ్ సొంతమైంది. బిస్త్ నాలుగు వికెట్లు తీసింది.

## సెమీస్‌లో కివీస్

**22 పరుగుల తేడాతో పాక్‌పై విజయం**

**మొహాలీ :** ప్రపంచ టీ 20 కప్ టోర్నీలో న్యూజిలాండ్ తన ఖాతాలో మరో విజయాన్ని వేసుకుని సెమీస్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఆ జట్టు ఇప్పటివరకు మూడు విజయాలు సాధించింది. ఫలితంగా మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సెమీఫైనల్‌కు చేరింది. పీసీఏ స్టేడియంలో గత మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో కివీస్ 22 పరుగులు తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 180 పరుగులు చేసింది. ఓపెనర్ గప్టిల్(48 బంతుల్లో 80, 10 ఫోర్లు, 3 సిక్సర్లు) అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. కెప్టెన్ విలియమ్సన్ (17), అండర్సన్ (21), గప్టిల్‌కు అండగా నిలిచారు. చివరి ఓవర్లో రాస్ టేలర్ (23 బంతుల్లో 36 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడడంతో కివీస్ భారీ స్కోరు సాధించింది. పాకిస్థాన్ జట్టుకు 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 158 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. ఓపెనర్ షార్జీల్ ఖాన్ (25 బంతుల్లో 47, 9 ఫోర్లు, 1 సిక్సర్) సూపర్ ఇన్నింగ్స్ ఆడటంతో పాటు మరో ఓపెనర్ షెహజాద్ (32, బంతుల్లో 30, 3 ఫోర్లు) కూడా రాణించడంతో పాక్‌కు మంచి ఆరంభం లభించింది. ఈ ఇద్దరూ తొలివికెట్‌కు 65 పరుగులు జోడించారు.

అనంతరం న్యూజిలాండ్ బౌలర్లు అనూహ్యంగా పుంజుకున్నారు. పాక్ చేతిలో వికెట్లు ఉన్నా.. న్యూజిలాండ్ బౌలర్లు అద్భుతమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు వేయడంతో పాక్ బ్యాట్స్‌మెన్ పరుగులు చేయలేకపోయారు. ఈ ఓటమితో పాకిస్థాన్ సెమీస్‌కు చేరే అవకాశాలు క్లిష్టమయ్యాయి. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఆసీస్‌పై పాకిస్థాన్ ఓటమిపాలవడంతో టోర్నీ నుంచి ఇంటిముఖం పట్టింది. దీంతో భారత్, ఆస్ట్రేలియాలలో ఒక జట్టుకు ఈ గ్రూప్ నుంచి రెండో సెమీస్ బెర్త్‌ను సాధించే అవకాశం ఉంది.


## శరవేగంగా పుష్కరఘాట్ల పనులు

**రాజధానిప్రతినిధి, రాజధాని :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆగస్టు 12 నుంచి 23 తేదీవరకు జరగబోయే కృష్ణానది పుష్కరాలను పెద్దఎత్తున నిర్వహించాలని అమరావతి నుంచి ప్రధాన పుష్కరఘాట్ కాగా, రెండవది తాళ్లాయపాలెం, సీతానగరంలో మూడవది చేపట్టనున్నారని కలెక్టర్ కాంతిలాల్ దండే తెలిపారు. ఇవికాకుండా ఇంకా చిన్నచిన్న ఘాట్‌లు కూడా ఇంకా చాలా ఉన్నాయని, మన జిల్లాలో 92 ఘాట్లను అభివృద్ధి పరుస్తామన్నారు. అమరావతి నుంచి రేపల్లెవరకు కలెక్టర్, ఎస్పీలతో సహా ఆర్అండ్‌బి, ఇరిగేషన్ ఇంజనీర్లు, ఆర్డీఓ, ఎంఆర్‌ఓలు పర్యటించారు. హరిశ్చంద్రపురంలో స్థానికుల విజ్ఞప్తి మేరకు రెండు పెద్ద ఘాట్‌లను నిర్మిస్తామన్నారు. అంతే కాకుండా తాళ్లాయపాలెం రేవును 500 మీటర్ల ప్రత్యేక ఘాట్ నిర్మిస్తామని,దీంతో శైవక్షేత్రానికి విచ్చేసే భక్తులకు వసతిగా ఉంటుందన్నారు. భక్తుల సౌకర్యార్థం కరకట్టపైకి మరొక రోడ్డును కూడా నిర్మిస్తామని కలెక్టర్ తెలిపారు.



# నాయకుడంటే అతడే...

**నిన్ను నీవు ఎంత ప్రేమించుకుంటావో... అంతే ప్రేమను పొరుగువారికి కూడా అందించాలి**



'నిన్ను వలే నీ పొరు గువారిని ప్రేమించు' ఈ వాక్యం లోనే బైబిల్‌లోని సారాం శం అంతా ఉందని క్రైస్తవ తత్వవేత్తలు బోధిస్తారు. నిజమే... ఈ మాట చాలా చిన్నదిగా కనిపించవచ్చు కాని దీని అర్థం మాత్రం విస్తృత పరిధి లో ఉంటుంది. నిన్ను నీవు ఎంత ప్రేమించు కుం టావో...అంతే ప్రేమను పొరుగువారిని కూడా అందించాలి. అంటే ఒక సంఘంలో శాంతి, సమాధానాలు ఉండాలంటే ద్వేషం, అసూయలు లేకుండా నీ పొరుగువారిని కూడా నిన్ను నువ్వు ప్రేమించ కున్నంత ప్రేమించాలి. నీ పొరుగువారు ఏ రంగులో ఉన్నా, ఏ సంఘానికి చెందిన వారైనా, ఏదేశం వారైనా, ఏ నమ్మకానికి చెందిన వారైనా, గొప్పపేద తారతమ్యాలు లేకుండా వారందరినీ అభిమానించాలి. అప్పుడే భూలోకం స్వర్గంగా మారుతుంది.

రెండవది యజమానిగా లేదా నాయకుడిగా ఉండాలనుకునే వారు ముందుగా దాసుడుగా ఉండాలని బైబిల్ చెబుతోంది. దాసుడు తన యజమానికి సేవ చేస్తూ ఉంటాడు. యజ మానికి సేవ చేయించుకోవడం మాత్రమే తెలుసుకాని, దాసుడికి సేవలో ఉండే తృప్తి, కష్టం తెలుసు అందుకే యజమానిగా ఇతరుల కష్టాన్ని గుర్తించాలంటే ముందు దాసుడిగా ఉండాలి. అప్పుడే మన కు పనిని గౌరవించే సంస్కారం అలవడుతుంది. నాయకుడు ప్రజల్లోని దురాచారాలను పోగొట్టాలి. తప్పొప్పులు సరిదిద్దాలి, మెరుగైన జీవన విధానంలోకి ప్రజల్ని నడిపే శక్తియుక్తులు కలిగి ఉండాలి. కులమత, ప్రాంతాలకు అతీతంగా జాతిని ఒక తాటిపై నడిపించాలి. తన ప్రజల కోసం ప్రాణాలు పెట్టడానికి కూడా వెనుకాడకూడదు. అలాంటి నాయకుడు ఏసుప్రభు... తన వారికోసం ప్రాణం తృణప్రాయంగా వదిలారు, స్వాతంత్ర సమరయోధులు కూడా దేశం కోసం అంతే త్యాగాలు చేశారు. ఆయన రాజులకు, రాజ్యాలకు వత్తాసుగా మాటలు చెప్పలేదు కాని వెలివేయబడిన వారికోసం, బాధితులకోసం, ఆకలిదప్పికలు కల వారికి సంఘంలో స్థానం కోసం ఎంతగానో పరితపించారు. షేరింగ్, కేరింగ్ ఈ రెండు సమాజంలో చాలా ముఖ్యమని మనకు తెలియడం కోసమే ఐదువేల మందికి రెండు చేపలు, ఐదు రొట్టెలు పంచి మిగిలినవి 12 గంపల కు ఎత్తారు అని బైబిల్ చెబుతుంది. అంటే ఈ ప్రపంచంలో మనకు ఎంత తక్కువైనా ఇతరులను ప్రేమించి మనకున్నదాన్లో పంచితే భూలోకంలో ఏ మనిషికీ ఏమీ తగ్గదని ఈ కార్యం ద్వారా మనకు తెలుస్తోంది.

దీన్నిబట్టే రష్యాను అతి సంక్లిష్ట పరిస్థితుల్లో పాలించి, ప్రజల్ని కార్యోన్ముఖులను చేసిన జోసఫ్ స్టాలిన్ ప్రపంచంలో మొదటి కమ్యూనిస్టు యేసు అని చెప్పారు. అయితే దురదృష్టవశాత్తూ ప్రపంచం ఈ పరిస్థితుల నుంచి పూర్తిగా వైదొలుగుతోంది. 13 దేశాల ఆర్థిక బడ్జెట్ కేవలం ఐదారుగురు వ్యక్తుల దగ్గర కేంద్రీకరించబడింది. దీంతో ఆయా దేశాలు తీవ్ర ఆర్థిక సమస్యల్లో కొట్టు మిట్టాడుతున్నాయి. ఈ ఏడాది చివరినాటికి సుమారు 32 దేశాలు ద్రవ్యోల్బణంతో చేతులు ఎత్తే పరిస్థితుల్లో ఉందని ఆర్థికవేత్తలు చెబు తున్నారు. అంటే జాతి సంపద వ్యక్తుల చేతుల్లో ఇమిడిపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతుందని అర్థం చేసుకోవచ్చు.

యేసు ఓ తిరుగుబాటుదారుడిగా సిలువ వేయబడ్డారు. ఎందుకంటే ఆ రోజుల్లో మతాధికారులదే పెత్తనమంతా... వారు ఔనంటే ఔను కాదంటే కాదు. ప్రజలకు, వారి అభిప్రాయాలకు, వారి ఆలోచనలకు ఎక్కడా ప్రాతినిధ్యం లేదు.

రాజులతో సహా ప్రజలంతా వారి నియమ నిబంధనల కర్కశత్వంలో జీవితం వెళ్లదీసేవారు. వారిని ఎదిరించి పేదలను, ఊరి వెలుపల జీవనం సాగించే వారిని, తప్పుడు మార్గాల్లో పయనించిన వారిని ఏసు సమకూర్చడం మతోన్మాదులకు నచ్చ లేదు. అందుకే వారి మూర్ఖత్వానికి యేసు సిలువ వేయబడ్డారు. మనం మళ్లీ అదే పరిస్థితికి దిగజారుతున్నామేమో ఒకసారి చూసుకోవాలి...మన ప్రజాస్వామ్యం అత్యంత విలువైనది...దాన్ని కాపాడుకోవాలి.

పరిస్థితులు బాగున్నప్పుడు అందరూ బాగా మాట్లాడతారు, కాని కాస్త గతితప్పితే చాలు నిజరూపం బయటకు వస్తుంది. అలాంటిది ఏసు సిలువపై తీవ్ర వేదనకు గురవుతున్నా ఈ ప్రపంచం శాంతి సౌభాగ్యాలతో ఉండే విధంగా ఏడు మాటలు ఉద్బోధించారు. అందులో మొదటిది.. వీరేమి చేయుచున్నారో వీరికి తెలియదు. అవును మనం ఏం చేస్తున్నాం... ఎందుకు ఈ లోకంలో జన్మించాం...మనం మన సమాజానికి లేదా దేశానికి ఏం చేస్తున్నాం అనేది తప్పకుండా ఆలోచించుకోవాలి. బతకటం అంటే మనలో ఊపిరి ఉన్నంత వరకు ఉండటం కాదు... మనం చేసే పనులతో మనం చచ్చిపోయిన తర్వాత కూడా బతకడం...యేసుక్రీస్తు 2016 ఏళ్ల కిందట చనిపోయినా ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా ఆయన బోధనలు ఉన్నాయంటే అదే కారణం. అలాగే మహాత్మాగాంధీ, బాబాసాహెబ్, నెల్సన్ మండేలా, మర్టిన్ లూథర్ ఇలా ఎందరో వారి జీవితాలను సుసంపన్నం చేసుకున్నారు. మరి మన సంగతేంటి ? మన పయనం ఎటు? మన జీవన విధానం ఏమిటి ? ఒక్కసారి ఆలోచించు కొని మనలను మనం ఉత్తమ పౌరుడిగా రూపొందించుకోవడానికి కృషి చేద్దాం...ఈస్టర్ శాంతి సమాధానాలు మీకు కలుగును గాక..

.. రోజ్ మేరీ

ఇసుక, మట్టి గట్టిగా పట్టేయ్..

# అందినకాడికి దోచేయ్

**ఉచితం మాటున పెరుగుతున్న అక్రమాలు**

**రాజధానిప్రతినిధి :** ప్రభుత్వం ఉచిత ఇసుక గురించి చేసిన ప్రకటన ఎందరికో వరాల మూటగా మారింది. దీనిపై సంపూర్ణంగా విధివిధానాలు ఖరారు కానప్పటికీ అందినకాడికి ఇసుక, మట్టిని కూడా కొందరు దోచుకుని డబ్బు దాచుకునే పనిలో నిమగ్నమయ్యారు. అనుమతులున్నాయంటూ, తమకు అధికార పార్టీ మద్దతు ఉందంటూ పరోక్షంగా స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తూ చేతనైనంత మేరకు సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అవసరమైనవారు తవ్వి తీసుకోవడానికి మార్గదర్శకాలు ఉన్నప్పటికీ స్థానిక అధికారులు నిస్సహాయులుగా మారిపోతున్నారు. అనుమతులు ఉన్న రీచ్‌లతోపాటు అనధికార రీచ్‌లను ఏర్పాటు చేసుకుని రాత్రింబవళ్ళు యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. ఇదేమని అడిగినవారిపై దౌర్జన్యానికి దిగుతున్నారు. దీనిపై ఎవరూ నోరుమెదపలేని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని అధికార యంత్రాంగం హెచ్చరిస్తున్నా వాటిని బేఖాతరు చేస్తూ ఇసుక, మట్టి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. జిల్లాలో 10 రీచ్‌లకు మాత్రమే ఇసుకను ఉచితంగా తవ్వుకోవడానికి అనుమతులు ఉన్నాయి. ఎవరైనా జిల్లాలో గుర్తించిన రీచ్‌లలో ఉచితంగా ఇసుకను తవ్వి తీసుకోవచ్చునని, అక్కడ ప్రభుత్వ కట్టడాలకుగానీ, ప్రాజెక్టులకుగానీ భంగం కలగకుండా తవ్వాలనే నిబంధనలు ఉన్నాయి. రాష్ట్ర సరిహద్దులు దాటించరాదని, తమ నిర్మాణాల్లో లోతట్టు ప్రాంతాలను, పునాదుల్లోను ఇసుకను నింపడానికి వీలులేదని కూడా నిబంధనలు చెబుతున్నాయి. దీనిపై వచ్చే ఫిర్యాదులు తమ ఇతర సమస్యలను జిల్లా స్థాయిలో ఎస్‌పి, భూగర్భగనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, వాణిజ్యపన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్, జిల్లా రవాణాధికారి, గ్రౌండ్ వాటర్ డిడి, జలవనరులశాఖ ఎస్‌ఇ సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేశారు. డివిజన్ స్థాయిలో డిఎస్‌పి, డిఎల్‌పివో ఏడి మైన్స్, ఇరిగేషన్ ఇఇ, ఆర్‌డీవో, పంచాయతీరాజ్ ఇఇ, ఆర్‌అండ్‌బీ ఇఇ సభ్యులుగా ఉన్నారు. ఇక రీచ్ స్థాయిలో సిఐ, ఎడి మైన్స్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌వో, ఇరిగేషన్ ఎఇలు ఉన్నారు. ఇంతమంది పర్యవేక్షణ ఉన్నప్పటికీ అనధికారికంగా ఇసుక తవ్వకాలు, మట్టి తవ్వకాలు ఊపందుకుంటున్నాయి. ఇంతవరకు జిల్లా యంత్రాంగం దీనిపై సమీక్ష చేసిన దాఖలాలు కనిపించలేదు. జిల్లాలో పెండ్యాల-కానూరు, కరుగోరుమిల్లి, సిద్ధాంతం, పందలపర్రు, దాచారం, ఇబ్రహీంపట్నం, రేపాక గుమ్మి, రుద్రమకోట, తిరుమలాపురం, వింజరం రీచ్‌లలో మాత్రమే ఇసుక తవ్వుకోవాలి. ఒక మీటర్ లోతు మించకుండా తవ్వి తీసుకోవచ్చునని ఇతర వాగుల్లో ఇసుక తవ్వితే చర్యలు ఉంటా యని జిల్లా జాయింట్ కలెక్టర్ పులిపాటి కోటేశ్వరరావు హెచ్చరికలు జారీ చేశారు. కాగా, జిల్లాలో గుర్తించిన రీచ్‌లలో సుమారు 9 లక్షల క్యూబిక్ మీటర్లు ఇసుక అందుబాటులో ఉందని తెలుస్తోంది. సాధారణ గృహస్తులకు, పేదవర్గాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటిం చడంతో అక్రమార్కులు బయలుదేరి ఒక ట్రాక్టర్ ఇసుక బ్లాక్‌లో రూ. 3 వేలకు పైగా విక్రయి స్తున్నట్లు తెలుస్తోంది. అవసరమైన వారికి ఇసుక దొరక్క గృహనిర్మాణాలు మధ్యలోనే నిలిచిపో యాయి. గృహనిర్మాణాలపై ఆధారపడిన సుమారు 6 లక్షల మందికి పైగా కార్మికులు ఉపాధి లేక సతమతమవుతున్నట్లు తెలుస్తోంది. ఏలూరు సమీపంలోని సత్రంపాడులో చెరువు తవ్వకం కూడా వివాదంగా మారింది. మట్టి తవ్వకాలపై స్థానికులు అభ్యంతరాలు పెట్టారు. అయినా మట్టి తవ్వకం ఆగలేదు. ఈ విధంగా అనేక ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం. పెరవలి మండలంలో కాకరపర్రు, కండవల్లి, ముక్కామల, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు తదితర గ్రామాల్లో అనధికార రీచ్‌ల ద్వారా ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికైనా అప్రమత్తమై అక్రమార్కులను కఠినంగా శిక్షించాలని పలువురు కోరుతున్నారు.

## కాకతీయుల నాగశాసనానికి 755 ఏళ్లు

**మల్కాపురంలో 1261లో మార్చి 25 న శిలాస్తంభ శాసనం ఏర్పాటు**

నాటి ఇంద్రుని రాజధానిగా భాసిల్లిన అమరావతి నేడు ఆంధ్రప్రదేశ్ రాజధానిగా విరాజిల్లనుందని తుళ్ళూరు తహసీల్దారు ఎ.సుధీర్‌బాబు తెలిపారు. అజరామరమైన కీర్తి ప్రతిష్ఠలతో విరాజిల్లుతున్న 'అమరావతి' జైనులు, బుద్ధులు, శాతవాహనులు, కాకతీయులు, శ్రీకృష్ణదేవరాయలు, రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు మొదలైన వారు నడయాడిన పుణ్య భూమి అని చెప్పారు. ఈ ప్రాంతంలోని మల్కాపురం గ్రామంలో 755 సంవత్సరాల క్రితం ఓ శిలాశాసనం చారిత్రక వైభవానికి సజీవ రుజువుగా నిలుస్తోందన్నారు. శిలాశాసనం స్థాపించి 755 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన రాజధాని ప్రతినిధికి ఆ చారిత్రక విశేషాలను వివరించారు.

**రుద్రమ పట్టాభిషేకాన్ని పురస్కరించుకుని శిలాశాసనం ఏర్పాటు**



కాకతీయుల సామ్రాజ్యంలోని ఆణిముత్యమైన రాణి రుద్రమదేవి పట్టాభిషేకం సందర్భాన్ని పురస్కరిం చు కొని 1261 మార్చి 25వ తేదీన మల్కాపురం గ్రామంలో శిలాశాసనాన్ని నిర్మించారు. ఈ శిలాస్తంభంపై 40 శ్లోకాలను లిఖించారు. గణపతి దేవుడు వృద్ధాప్యంలో తన పెద్దకుమార్తె రుప్రమదేవిని 1261 మార్చి 25వ తేదీన పట్టాభిషిక్తురాలిగా చేసి రాజ్య సింహాసనాన్ని అప్పగించారు. ఈ సందర్భాన్ని తన గురువైన విశ్వశంభువునకు మందడం, వెలగపూడి గ్రామాల మధ్య ఉన్న భూములను దానం చేసినట్టుగా మల్కాపురం గ్రామంలో ఒక పెద్ద నాగ శాసనాన్ని రుద్రమదేవి, గణపతిదేవునితో ప్రతిష్ఠించారు. రుద్రమదేవి తొలి మహిళా రాజ్యాధినేతగా వీరనారిగా చరిత్రలో నిలిచిపోయింది.



మల్కాపురంలోని శిలాశాసనం, ఇన్‌సెట్‌లో తహశీల్దారు సుధీర్‌బాబు

# పంట మాటున పన్ను ఎగవేత..!

*ఆరుగాలం శ్రమించినా వర్షాభావ పరిస్థితులవల్ల పంట చేతికందక, చేసిన రుణాలు తీర్చలేక, బతుకు పోరులో ఓటమినంగీకరిస్తూ, రైతన్న ఉరికొయ్యకు వేలాడుతుంటే...కార్పొరేట్ బాబులు మాత్రం పన్ను పోటును తప్పించుకునేందుకు నల్లధనాన్ని తెల్లగా చేయడం కోసం కోట్లరూపాయలు ఆదాయం వచ్చినట్లు చూపుతున్న లెక్కలు ప్రభుత్వాన్ని దిమ్మెరపోయేలా చేస్తున్నాయి.*



దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) కంటే వ్యవ సాయం ద్వారా వచ్చే ఆదాయం 20 రెట్లు ఎక్కువగా ఉందని ఆర్టీఐ చట్టం కింద ప్రభుత్వం అందించిన గణాంకాల ద్వారా తెలిస్తే ఎవరైనా ఆశ్చర్యపడాల్సిందే.. రహస్య ంగా దాచుకున్న ధనానికి ఆదాయం పన్ను చెల్లించకుండా తప్పించుకునేందుకు గాను వ్యవసాయం ద్వారా తాము ఆదాయం పొందు తున్నామని అనేక మంది బడా బాబులు తమ వార్షిక ఆదాయం పన్ను రిటర్న్‌లో తెలియ జేశారు. ఆర్టీఐ చట్టం కింద విజయశర్మ దాఖలు చేసిన పిటీషన్‌పై ఆదాయం పన్ను శాఖ అందించిన గణాంకాలు ఎవరినీ నమ్మిం చేవిగా లేవని చెప్పవచ్చు. పదవీవిరమణ చేసిన ఐఆర్‌ఎస్ అధికారి విజయశర్మ ఈ గణాంకాల కోసం పిటీషన్ దాఖలు చేశారు. ఆదాయం పన్ను శాఖ అందించిన వివరాలు కళ్లు బైర్లు కమ్మేలా ఉన్నాయి. 2001 నుంచి 2013 వరకు ఆయా వ్యక్తులు దాఖలు చేసిన ఆదాయం పన్ను రిటర్న్ చూసే మన దేశం వ్యవసాయ రంగంలో ఇంత అభివృద్ధి చెందిందా అని ఆశ్చర్యపోవాల్సిందే.. ఒక్క 2011లో వ్యవసాయ రంగం నుంచి రూ.2 వేల లక్షల కోట్లు ఆదాయం లభించినట్లుగా ఆదాయం పన్ను శాఖ లెక్కల్లో చూపింది. 6.57 లక్షల మంది పన్ను మదింపుదారులు 2011లో మది రిటర్న్‌ను దాఖలు చేశారు. ఆ సంవత్సరం జాతీయ స్థూల ఉత్పత్తి (జీడీపీ) విలువ రూ.84 లక్షల కోట్లు కాగా, దానికి 20 రెట్లు ఎక్కువగా వ్యవసాయ ఆదాయం ఉన్నట్లుగా చూపుతున్నారు. రైతులు ఆత్మ హత్యలు చేసుకుంటున్న సమయంలో ఇంత ఆదాయం ఎలా లభించింది? ఇదంతా ఆడిటర్ల ద్వారా మాయ చేసి ఆయా వ్యక్తులు తమ ఆదాయాన్ని లెక్కల్లో చూపకుండా దాచు కోవడం వల్లనే సాధ్యమైంది. వ్యవసాయ రంగం ద్వారా వచ్చే ఆదాయానికి పన్ను మినహాయింపు ఉండటం ఎగవేతదారులకు వరంగా మారింది. అక్రమ సంపాదన లేదా నల్లధనం దాచుకోవడం లేదా వైట్ మనీగా మార్చుకోవడానికి పన్నుతున్న మాయోపాయం ఇదని, దీన్ని బయట పెట్టేందుకు తాను ఈ పిటీషన్ దాఖలు చేశానని శర్మ తెలియచేశారు. ఈ కుంభకోణం పైన దర్యాప్తు జరిపి ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. శర్మ దాఖలు చేసిన పిటీషన్ పాట్నా హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ పిటీషన్ పైన ఏప్రిల్‌లో హైకోర్టు విచారణ జరపనుంది. గత ఏడాది ఏప్రిల్‌లో ఆదాయం పన్ను శాఖ నుంచి ఈ వివరాలు తాను సేకరించానని ఆయన వెల్లడించారు. ఈ వ్యవహారాలపైన దర్యాప్తు జరిపించాలని ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటీ)కు విదలకుండా లేఖలు రాస్తూనే ఉన్నానని ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టినట్లు తెలియలేదని శర్మ తెలిపారు. అలాగే ఏ ప్రభుత్వ శాఖ ఈ సమాచారం సరైంది కాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేదని ఆయన అన్నారు. వాస్తవంగా రాజ్యసభలో మాట్లాడిన ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ సైతం ఈ గణాంకాలను తిరస్కరించలేదని ఆయన అన్నారు. వ్యవసాయన్ని అడ్డుపెట్టుకొని పన్నులు ఎగవేస్తున్న వారిపై ఆదాయం పన్ను శాఖ దర్యాప్తు చేస్తుందని మాత్రమే అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. ఏడాదికి కోటిరూపాయలు పైగా వ్యవసాయ ఆదాయాన్ని చూపిన వ్యక్తులపైన ఆదాయం పన్ను శాఖ దర్యాప్తు చేస్తుందని మాత్రమే వివరించారు. 2015-16లో రిటర్న్ దాఖలు చేసిన వారిలో 307 మంది కోటికి పైగా ఆదాయం వ్యవసాయం పైన వచ్చినట్లుగా తెలియజేశారని అధికార గణాంకాలు చెబుతున్నాయి. 2007-08లో కోటికి పైగా ఆదాయం వచ్చిన వారిసంఖ్య 180 మాత్రమే ఉంది. ఇలాంటి వ్యవహారాలకు సంబంధించి 2,746 కేసులను ఆదాయపు పన్ను శాఖ దర్యాప్తు చేస్తోంది. వీటిలో బెంగళూరులో అత్యధికంగా 321 కేసులు ఉండగా, ఢిల్లీలో 275 కేసులు ఉన్నాయి. కోల్‌కత్తాలో 239 కేసులు ఉన్నాయి. పొలాలకు సంబంధించిన రికార్డులను డిజిటలైజ్ చేస్తే ఇలాంటి వాటిని అరికట్టే అవకాశం ఉంటుందని పన్ను ఎగవేత దారులు తప్పించుకునేందుకు వీలు ఉండదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయంపై ఆదాయం వచ్చినట్లు చూపడం పూర్తిగా అబద్ధం అని వారు చెబుతున్నారు. గత ఐదేళ్లుగా ఆదాయం పన్ను రిటర్న్ దాఖలు చేసిన 100 మంది వివరాల కోసం శర్మ ఆర్టీఐ దరఖాస్తులను పెడుతూనే ఉన్నారు. ఆదాయం పన్ను శాఖ ఇందుకు సంబంధించిన సమాచారం అందించేందుకు తిరస్కరిస్తూనే ఉంది. ఆర్టీఐ చట్టం 81 (జె) సెక్షన్ కింద మదింపుదారు వ్యక్తిగత సమాచారం అందించడంపై నిషేధం ఉందని ఆదాయ పన్ను శాఖ తెలియజేస్తోంది.

-ది హిందూ సౌజన్యంతో..



చెరుకూరి బాబ్జి B.com
సెల్:7287098456

చెరుకూరి శ్రీనివాసరావు B.Sc
సెల్:8008336995,9490157549

తిరుమల తిరుపతి దేవస్థానముల వారి ఆధ్వర్యంలో జరుగు అనంతవరం
శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల శుభాకాంక్షలతో
నాగార్జున రియల్ ఎస్టేట్ & కన్సల్‌టెన్సీ


నవ్యాంధ్ర రాజధాని ఏరియాలో
పొలములు,ఇళ్ళ స్థలములు కొనదలచిన,
అమ్మదలచిన సంప్రదించగలరు.
ప్లాట్లు డెవలపింగ్‌కు ఇవ్వదలచిన,
తీసుకోదలచిన సంప్రదించగలరు.

H.O:తుళ్ళూరు, B.O: రాయపూడి, తుళ్ళూరు మండలం, గుంటూరుజిల్లా.


Printed, Published and Owned by Pattan Hussain Khan, Published at 6-45/1, Rayapudi Post, Thullur Mandal, Guntur District, AP 522237. Printed at Jagathi Publications Ltd., D.No : 5-625, Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. Editor : Pattan Hussain Khan, Cell: 9440662699, Email: info@rajadhanivartalu.com, APTEL 14598 / 2015.